జనవరి
2015

105

సంపుటి : 9 సంచిక : 9

వెల రు. 10/-


## ఈ సంచికలో........


సంస్కృతి పాత్ర : మార్క్సిస్టు అవగాహన
సమిష్టి పని విధానం
మా కథలు వింటారా!
వెన్నాడుతున్న ఆర్థిక మాంద్యం
లెనిన్ ప్రసిద్ధ రచన 'రాజ్యం-విప్లవం'
నెహ్రూ అభివృద్ధి నమూనా
మిత్రవర్గాల మధ్య వైరుధ్యాలను వైషమ్యాలుగా మారనీయకూడదు
ఆదర్శ కమ్యూనిస్టు మానికొండ సుబ్బారావు

స్ఫూర్తి


# ఆదర్శ కమ్యూనిస్టు మానికొండ సుబ్బారావు

**యు. రామకృష్ణ**

సాధారణ విజ్ఞానం కలిగీ.. సాధారణ స్థానాల్లోనే ఉండీ.. బాధ్యత వహించి పని చేసిన విప్లవకారుడాయన! ఉత్తమ పని పద్ధతులూ, స్వార్థరహిత దృష్టీ, ఉదాత్తమైన మనస్సూ, త్యాగమూ, సాహసమూ, ప్రజల కష్టసుఖాలు తనవే అనుకున్న చైతన్యమూ.. ఆయననొక అసాధారణ మానవుడిగానూ, విప్లవకారుడిగానూ రూపొందించాయి. తన ఆస్తిపాస్తులూ, సర్వస్వమూ పీడిత ప్రజల సేవకు అర్పించిన ఆదర్శనీయుడాయన. తన మాతృమూర్తిని విప్లవ మాతగానూ, సతీమణిని విప్లవకారిణిగానూ తీర్చిదిద్ది విప్లవకారులకు మార్గదర్శిగా నిలిచాడాయన. ఆయనే మానికొండ సుబ్బారావు.

మానికొండ సుబ్బారావు 1918లో కృష్ణా జిల్లా పూర్వపు గన్నవరం తాలూకా నందమూరులో జన్మించారు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి బుల్లెమ్మ కొద్దిపాటి చదువు సంధ్యలే ఉన్నా పెద్ద సంస్కారంగల ఇల్లాలు. మానికొండ చదువులో ఆలస్యంగా ప్రవేశించారు. తాను ఆంగ్లం చదువుకుంటానని ఎనిమిదో యేటనే మారాం చేసి మాట నెగ్గించుకున్నారు. బందరు మాధ్యమిక పాఠశాలలో చేరి శ్రద్ధగా చదువుతూ, క్రమశిక్షణాయుతంగానూ, అందరికీ ఆదర్శంగానూ ఉండేవారు. బందరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణుడయ్యాక బివిఎస్‌సి కోర్సులో ప్రవేశించారు. ఒకటి రెండేళ్లు చదివి అక్కడ జరిగే అన్యాయాలకూ, అక్రమాలకూ వ్యతిరేకంగా చదువుకు స్వస్తి చెప్పి స్వగ్రామం చేరారు.

మానికొండకు 19వ యేట వివాహమైంది. పెళ్లి సందర్భంగా అంత చిన్న వయసులోనూ నూతన ప్రమాణాలు నెలకొల్పారు. కట్నం మీద పెద్దలు మక్కువ చూపగా, 'నేను చేసుకునేది పిల్లనా, డబ్బునా?' అంటూ.. తన ఇష్టప్రకారమే కట్న కానుకల్లేకుండా సూర్యావతిని వివాహం చేసుకున్నారు. 1938-39లో ఆనాడు కమ్యూనిస్టు ప్రముఖుడుగా ఉన్న అన్నాప్రగడ కామేశ్వరరావు గుంటూరు జిల్లా మంతెనవారిపాలెంలో 'విద్యా వనం' అనే ఆదర్శ పాఠశాలను ప్రారంభించారు. బాలబాలికల్లో నూతన ఆదర్శాలు ప్రేరేపించి.. కొత్త విద్యా విధానంతో తీర్చిదిద్దాలనే ఆశయంతో.. ఆ పాఠశాలను ప్రారంభించారు. తుమ్మల వెంకట సుబ్బయ్య మొదలైన మిత్రులతో కలిసి సేవాదృష్టితోఆ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ప్రవేశించారు. అక్కడ పని చేసినన్నాళ్లూ పిల్లల మనస్తత్వాన్ని చక్కగా గ్రహించి వ్యవహరించారు. పిల్లల్లో సత్ప్రవర్తన, అభ్యుదయ భావాలు కలిగించడానికి ప్రత్యేక తరగతులు నడిపేవారు. ఎక్కడా చెల్లని పిల్లలను కొందరిని మంచి మార్గంలో తీర్చిదిద్దారు. ఆ పాఠశాలలో ఆయన ఉపాధ్యాయుడుగా చూపిన సామర్థ్యాన్ని తరువాత రాజకీయ జీవితంలో మరోమారు నిరూపించుకున్నారు. రాష్ట్ర, జిల్లా కమిటీలు నడిపిన రాజకీయ పాఠశాలల్లో సిద్ధాంత రాజకీయ నిర్మాణ సమస్యలను సమర్థంగా బోధించి మంచి ఉపాధ్యాయుడుగా రాణించారు.



'విద్యావనం'లో పనిచేస్తున్న రోజుల్లోనే కమ్యూనిస్టు సాహిత్యం అధ్యయనం చేస్తుండేవారు. స్థానిక కమ్యూనిస్టు కార్యకర్తలతో సంబంధాలు పెట్టుకున్నారు. ఆయనలోని స్వచ్ఛమైన దేశభక్తీ, ప్రజలందరికీ శాంతి సౌఖ్యాలతో కూడిన జీవితం అందుబాటు కావాలనే మానవతా దృష్టీ, కమ్యూనిస్టు సాహిత్య అధ్యయనం ద్వారా ఏర్పడిన దృక్పథమూ, దాని వల్ల కలిగిన చైతన్యమూ, కొంతమంది కమ్యూనిస్టుల ఆచరణను ప్రత్యక్షంగా చూడగలగటమూ, ఇవన్నీ పెనవేసుకొనే ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరడానికీ, కార్యాచరణకూ ప్రేరేపించాయి. నిండు చైతన్యమూ, పరిపూర్ణ బాధ్యతా, విప్లవ కార్యాచరణా ఆయనలో పెనవేసుకుపోయాయి.

పార్టీకి అతి క్లిష్ట సమయమది. నందమూరులో మానికొండ ఇల్లు పార్టీ కార్యకర్తల రహస్య సమావేశాలకు స్థావరంగానూ, రక్షణ దుర్గంగానూ తయారయింది. కృష్ణాజిల్లా కమ్యూనిస్టు కమిటీ ఆ రహస్య కాలంలో జయప్రదంగా నడవడానికి మానికొండ ప్రధాన పాత్ర వహించారు. ఒక ఏడాదిపాటు మానికొండ విప్లవ కార్యాచరణను ప్రత్యక్షంగా చూసిన జిల్లా, రాష్ట్ర నాయకత్వం.. 1941వ సంవత్సరంలో ఆయనను పార్టీ గన్నవరం తాలూకా ఆర్గనైజర్‌గా నియమించింది. చిత్తశుద్ధితోనూ, అవిరామంగానూ పనిచేసి గన్నవరం తాలూకాలో ఆయన బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించారు. ప్రజల, పార్టీ కార్యకర్తల పట్ల, ఆయన తీసుకునే వైఖరీ, వారితో చర్చించే పద్ధతీ, వారిని ఒప్పించి తలకొకపని అప్పగించి ప్రోత్సహించి పంపించే విధానమూ ఆదర్శనీయంగానూ, ప్రయోజనాత్మకంగానూ ఉండేవి. పార్టీ శాఖలూ, కమిటీలూ.. అవి ఎదుర్కొనే రాజకీయ నిర్మాణ ప్రజా సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో ఆయన నేర్పేవారు. ప్రతి సమస్యనూ రాజకీయ దృక్పథంతో విశ్లేషించి పరిష్కారం చూపేవారు. తీవ్ర విభేదాలు తలెత్తిన సందర్భాల్లో కూడా సహనం కోల్పోకుండా ఇతరులు చెప్పింది ఓపిగ్గా విని.. విప్లవ పరిజ్ఞానంతో వివరించడం ఆయన ప్రత్యేకత. ముఖంలో చిరునవ్వూ.. వైఖరిలో నమ్రతా ఆయనను వీడేవి కావు. కార్మికుల నుంచి మేధావుల వరకూ అందరితోనూ ఆయన సామరస్యంగా వ్యవహరించేవారు. ముఖ్యంగా కార్యకర్తలను రాజకీయంగా చైతన్యవంతులను చేయడం లోనూ, వాళ్లు తమ కాళ్లమీద తాము నిలబడగలిగేపాటి దక్షత సమకూర్చడంలోనూ పార్టీ ఆర్గనైజర్‌గా ఆయన ప్రతిభ వెల్లడయింది. రెండేళ్లలో పార్టీ నిర్మాణానికీ ప్రజా ఉద్యమానికీ ఆయన చేసిన కృషికి గుర్తింపుగా పార్టీ ఆయనను కృష్ణాజిల్లా నాయకత్వానికి ప్రమోట్ చేసింది.

పార్టీ కృష్ణాజిల్లా నాయకత్వం స్వీకరించిన తరువాత అనేక వ్యతిరేక శక్తులను ఎదుర్కొంటూ పార్టీ విధానాలను ప్రజలకు ఓపికతోనూ, సమర్థతతోనూ వివరిస్తూ ప్రజల నిత్య జీవిత సమస్యలపైన నిర్మాణాత్మకంగా పనిచేశారు. పార్టీ పట్ల ప్రజల్లో అనుకూల ధోరణీ, మార్పూ తీసుకు రావడంలో ఆయన

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

**1. ఆదర్శ కమ్యూనిస్టు మానికొండ సుబ్బారావు**
– యు. రామకృష్ణ 2

**2. సంస్కృతి పాత్ర మార్క్సిస్టు అవగాహన**
– సీతారామ్ ఏచూరి 4

**3. సమిష్టి పని విధానం**
– ఎస్. వీరయ్య 12

**4. మా కథలు వింటారా!**
– శివం విజ్ 14

**5. వెన్నాడుతున్న ఆర్థిక మాంద్యం**
– సి.పి. చంద్రశేఖర్ 22

**6. లెనిన్ ప్రసిద్ధ రచన 'రాజ్యం-విప్లవం'**
– ఎన్.వి.ఎస్. నాగభూషణ్ 25

**7. నెహ్రూ అభివృద్ధి నమూనా**
– ప్రభాత్ పట్నాయక్ 29

**8. మిత్రవర్గాల మధ్య వైరుధ్యాలను వైషమ్యాలుగా మారనీయకూడదు**
– ఎ. రవి 30

**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్:** ఎడిటోరియల్ **0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org

# మాయా మార్గం

**గ**త నెలరోజుల్లో మన దేశంలో ఏం జరిగిందో గమనించండి! హిందూ మహాసభ 'ఘర్ వాపసి' పేరుతో పేద ముస్లింలను బలవంతంగా మతమార్పిడి చేయించడం.. పార్లమెంటు లోపలా బయటా దానిపై పెద్ద ఎత్తున చర్చ... ఇంతలో పార్లమెంటు 'కన్ను కప్పి' ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు బొగ్గు గనులు అమ్మకానికి పెడుతూ ఆర్డినెన్స్ జారీచేయడం. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ క్రిస్టమస్‌రోజున 'గుడ్ గవర్నెన్స్ డే'గా ప్రకటించడం... మైనారిటీల హక్కులకు భంగకరమైన ఈ చర్యపై పార్లమెంటు లోపలా, వెలుపలా నిరసనలు... ఇంతలో మళ్లీ పార్లమెంటు కన్ను కప్పి బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడులకు అనుమతిచ్చే బిల్లుపై ఆర్డినెన్స్ జారీ చేయడం. పీకె సినిమా కొందరి మనోభావాలు దెబ్బతీస్తోందంటూ కాషాయ పరివారం సినిమాహాళ్లపై దాడులు...ఇంతలో రైతుల భూములను కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టేందుకు భూ సేకరణ చట్టానికి ఆర్డినెన్స్ రూట్‌లో సవరణలు తీసుకురావడం......

ఇదంతా మన పురాణాల్లో విష్ణుమూర్తి మోహినీ అవతారంలో దేవతలకు అమృతాన్నిచ్చి, రాక్షసులకు తన అందచందాలు ఒలకబోస్తూ ఒట్టి మూకుడు చూపించిన కథ గుర్తుకు రావడం లేదూ! అయితే ఇక్కడ మోడీ ప్రభుత్వానికి విదేశీ, స్వదేశీ కార్పొరేట్లు దేవతలు. ఎందుకంటే వారే కదా ఆయనను అధికారంలోకి తేవడానికి డబ్బు, ప్రచారం రూపంలో మదుపు పెట్టింది. ఆయన దృష్టిలో ప్రజలు రాక్షసులు. ప్రజలంటే రైతులు, కార్మికులు, ఉద్యోగులు ఇతర సామాన్యులు. కాకపోతే చూడండి ఈ నెల రోజుల కాలంలో ప్రజలకు ఎన్నెన్ని ఒట్టి మాటల పంచారో. స్వచ్ఛ భారత్ అన్నారు, మేక్ ఇన్ ఇండియా అన్నారు, స్మార్ట్ సిటీలన్నారు, బుల్లెట్ ట్రెయిన్లన్నారు... ఇంకా చాలా చాలా అన్నారు.

ప్రజలు ఊహల్లోనైనా ఉండాలి, లేక వివాదాల్లోనైనా ఉండాలి. వాస్తవంలో మాత్రం ఉండకూడదు. ఎందుకంటే వాళ్లు వాస్తవంలోకి వస్తే మోడీ ప్రభుత్వ చర్యలను ప్రశ్నిస్తారు. పార్లమెంటు ఉండగా ఇన్ని చట్టాలను ఆర్డినెన్స్‌ల ద్వారా అమల్లోకి తేవాల్సిన అగత్య మేమొచ్చిందని అడుగుతారు. బొగ్గు గనుల విషయంలో గత యుపిఎ ప్రభుత్వాన్ని విమర్శించిన మీరు మళ్లీ అదే తోవలో వాటిని ప్రయివేటు సంస్థలకు ఎందుకు కారుచౌకగా అమ్మేస్తున్నారని ప్రశ్నిస్తారు. భారత ఆర్థిక వ్యవస్థకు జీవనాడి లాంటి బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తే దేశం దివాళాతీయదా, ఇదేనా మీ స్వదేశీ అభిమానం అని నిలదీస్తారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో తెచ్చిన భూ సేకరణ బిల్లుకు తూట్లు పొడవడం ద్వారా రైతుల భూములు కార్పొరేట్లకు అప్పగించడం ఎంత దారుణం అని ఆగ్రహం వ్యక్తం చేస్తారు. ప్రజలు ఇవన్నీ చేయకుండా ఉండాలంటే వాళ్లు నిత్యం ఏదో ఒక వివాదంలో, ఏదో ఒక ఊహలో ఉండాలి. అందుకే మోడీ గారు ఒకవైపు అందమైన ఊహాలోకాలు (టెక్ భాషలో వర్చువల్ ప్రపంచాలు) సృష్టిస్తుంటే, మరోవైపు ఆయనగారి పార్టీ, దాని సైద్ధాంతిక గురువైన ఆర్‌ఎస్‌ఎస్ పరివారం అంతులేని వివాదాలు సృష్టిస్తోంది. ఈ వివాదాల్లో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఏలూ, అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులు, సంఘ్‌పరివార్ కార్యకర్తలు అందరూ చురుకుగా పాల్గొంటున్నారు. కార్పొరేట్ మీడియా అసలు సమస్యలు వదిలేసి ఈ వివాదాల చుట్టూ ప్రచారాన్ని తిప్పుతోంది.

ఇప్పుడు మన పనేంటంటే, గారడీలన్నిటి వెనుక ఆంతర్యాన్ని ప్రజలు గ్రహించేట్లు చేయడం. ఏ మాటల వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగిఉన్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మళ్లీ మళ్లీ మోసపోతూనే ఉంటారని లెనిన్ చెప్పారు. మోడీ, ఆయన పరివారం మాటలు, చేతల గుట్టు విప్పాల్సిన పని ఇప్పుడు వామపక్ష ప్రచార యంత్రాంగం చేయాల్సి ఉంది. మామూలు పద్ధతిలో చేస్తే సరిపోదు. చాలా సమర్ధవంతంగా చేయాలి.

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్** (ప్రజాశక్తి కార్యాలయం),
**అజామాబాద్, హైదరాబాద్- 20**

**ఈ మాసం ముఖ్యాంశం**

# సంస్కృతి పాత్ర మార్క్సిస్టు అవగాహన

**సీతారామ్ ఏచూరి**



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు

జన నాట్యమంచ్ ఆధ్వర్యంలో ఈనాడు (2014 నవంబర్ 22) ఏర్పాటు చేసిన సఫ్దర్ హష్మి స్మారకోపన్యాసంలో మాట్లాడేందుకు ఎంచుకున్న ఈ అంశానికి రెండు పరిమితులు ఉన్నాయని తెలిసే మాట్లాడేందుకు మీ ముందుకు వచ్చాను నేను.

మొదటి పరిమితి ఏటంటే నా ఉపన్యాసం పూర్తయ్యే సరికి ఇదేదో ఇంతకు ముందే విన్న వ్యవహారంలా ఉందని మీరు భావించే అవకాశం ఉంది. ఎందుకంటే సాంస్కృతిక ఆచరణ అనేది – ఆ మాటకి వస్తే ఏ ఆచరణ అయినా – ఏదో ఒక దశలో ఆ కాలపు సైద్ధాంతిక పారిభాషికా చట్రంలో ఒదిగి పోతుంది. 'ఆ కాలపు' అన్న మాటకు అర్ధం క్రమానుగతమైనదనీ, దిశారహితమైనదనీ కాదు. కాలం అంటే మార్క్సిస్టు దృక్కోణంలో నిర్ధిష్ట సమయంలోని పదార్థ పునాది. అంటే మానవ కార్యకలాపాల ద్వారా సృష్టించబడిన పదార్థ సంపదలోనే సంస్కృతి కూడా అంతర్భాగంగా ఉంటుంది. ఇక రెండో పరిమితి ఏంటంటే – నేను ఇప్పుడు ప్రస్థావించబోయే ప్రతిపాదనలు, విశ్లేషణలు వింటుంటే ఇవేం 'రూల్స్'రా బాబూ... విషయం వదిలేసి ఏచూరి ఏదో చెప్తున్నాడు అని మీకు అనిపించవచ్చు. అయినప్పటికీ మానవ నాగరికత వికాసక్రమంలో సంస్కృతి పాత్ర ఏమిటనేది వివరించే ప్రయత్నం చేస్తాను. నయా–ఉదారవాద సైద్ధాంతిక భావజాలానికి అంటుకొమ్మలా ఇవాళ చలామణీలో ఉన్న ఆధునికానంతరవాద దశలో నాగరిక వికాసంలో సంస్కృతి పాత్ర పట్ల మార్క్సిస్టు అవగాహన ఏమిటో తెల్సుకోవాల్సిన అవసరం గతం కన్న ఎక్కువగా ఉంది. సమాజం వర్గాలుగా విభజితమై ఉన్నా వర్గపోరాటం అవసరాన్ని, అనివార్యతను ఆధునికానంతర వాదం త్రోసిపుచ్చుతుంది. అస్థిత్వాల పేరిట సమాజం యావత్తునీ విడగొడుతూ ఏ అస్థిత్వ సమూహానికి చెందిన సంస్కృతి ఆ సమూహానిదే, దేనికదే స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటుందని ఆధునికానంతర వాదం ప్రతిపాదిస్తుంది. ఈ విడివిడి స్వయం ప్రతిపత్తిగల అస్థిత్వ సమూహాల సమాహారమే సమాజం అనేది ఆధునికానంతర వాదుల వాదన. నా దృష్టిలో ఈ రకమైన సాంస్కృతిక విభాజక ధోరణి వర్గ సమాజంలో వాస్తవికతను, సమాజ పరిణామక్రమంలో సంస్కృతి పాత్రను, ముఖ్యంగా భారతదేశ సంస్కృతి విషయంలో, విస్మరిస్తుంది.

సంస్కృతి అంటే సౌందర్యశాస్త్రం అనే పరిమిత దృష్టితో అర్థం చేసుకుంటున్నారు. ఈ సౌందర్యశాస్త్రం గురించి నేను తరువాత వివరిస్తా... కానీ సంస్కృతి అంటే మానవాళి కార్యకలాపాల సమస్తానికి సంబంధించిన విస్తృతాంశం. ఆదర్శ సౌందర్యశాస్త్రం అంటే కళలు అనే అభిప్రాయం గట్టిగా చలామణిలో ఉంది. కళలు సరే ఆదర్శం అంటే? అంటే వాస్తవం కన్నా ఉన్నతమైనది, ఉదాత్తమైనది అనేగా అర్థం.


మార్క్సిస్టు సిద్ధాంత ఆవిర్భావానికన్నా ముందు కాలంలోని చరిత్రకారులకు, కళా సిద్ధాంత వేత్తలకు కళల పుట్టుక, అభివృద్ధి, వికాసం, క్షీణతలను ఎలా అంచనా కట్టాలో తెలియని అయోమయంలో కూరుకుపోయారు. ఎందుకంటే వాళ్ళు మానవ సామాజిక కార్యకలాపాలకు, కళలు – సంస్కృతికి మధ్య ఉన్న సంబంధాన్ని గ్రహించలేకపోయారు. వాస్తవం ఏమిటంటే మానవ సామాజిక కార్యకలాపాల నుండే సంస్కృతి ఆవిర్భవిస్తుంది. కళలు, సాహిత్యం, నాట్యం, చిత్రలేఖనం, సంగీతం, గానం, ఇత్యాదివన్నీ 'సంస్కృతి'లో భాగమే.

ఆధునిక తత్వశాస్త్రానికి పునాది గతి తర్క సిద్ధాంతం. నిర్ధిష్ట పరిస్థితులను నిర్ధిష్టంగా విశ్లేషించడమే గతి తర్కంలో ఇమిడి ఉన్న 'జీవ సిద్ధాంతం' అంటాడు లెనిన్. జర్మన్ తత్వశాస్త్రం గతి తర్క సిద్ధాంత అభివృద్ధికి బాటలు వేసింది. హెగెల్ ఈ సిద్ధాంత ప్రతిపాదనలో శిఖర సమానులు. అందుకే కార్ల్‌మార్క్స్ కూడా నమ్రతతో "నేను చేసిందల్లా తల్లక్రిందులుగా ఉన్న హెగెల్‌ను కాళ్ళు నేలకి ఆనించి తలపైకి ఎత్తుకు నిలబడేలా చెయ్యడమే, అంతకన్న నా గొప్పతనం ఏమీ లేదు" అంటాడు. ఎంగెల్స్‌తో కలిసి రాసిన 'జర్మన్ సిద్ధాంతం' అన్న గ్రంథంలో మార్క్స్ ఇలా అంటాడు – జర్మన్ సిద్ధాంతం ఆకాశం నుండి భూమి మీదకి దిగివస్తే మేం దాన్ని నేలమీద నుండి ఆకాశం కేసి నడిపించాం. జర్మన్ సిద్ధాంతం కాళ్ళు నేల ఊనేలా చేసాం. ఇంకో మాటలో చెప్పాలంటే బుద్ధిపెట్టి ఆలోచించు, రూపుదిద్దు అన్న మహనీయుల పిలుపులకు, మహితాత్ముల ఆలోచనలకు, సిద్ధాంత ప్రతి పాదనలకు మనిషిని కేంద్రకంగా చేసాం. రక్తమాంసాలతో నిండిన మానవ జీవిత సంవిధానాలే భిన్న తాత్విక సైద్ధాంతిక భావనలను ప్రతిధ్వనించాయని వివరించాం. మనిషి మెదడులో కలిగే ఊహలు అనివార్యంగా పదార్థ జీవిత ప్రతిస్పందనలే. నైతికత, మతం, మెట్ట వేదాంతం, పుక్కిట పురాణాలు... ఇవన్నీ నాటి సమాజ పాదార్థిక చైతన్యం మీద ఆధారపడినవే. ఇవేవీ సమాజం నుండి విడగొట్టుకుని ఉండవు. అదాటున గాల్లోంచి ఉద్భవించేవి కావు. మానవ సమాజ పరిణామ క్రమంలో చైతన్యం జీవితాన్ని నిర్ణయించదు, జీవితమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. మార్క్సిస్టు సిద్ధాంత ఆవిర్భావ పూర్వ కాలానికి చెందిన చింతనాపరులు చైతన్యాన్ని కేంద్రకంగా చేసుకుని తత్వాలు చెప్పారు. అక్కడికేదో చైతన్యం అనేది జీవమున్న మనిషయినట్లు భావించారు. మరికొందరు నిజ జీవితం ఆధారం చేసుకుని, ఆ జీవితం ఆధారంగా ఏర్పడే చైతన్యాన్ని ఆ రూపంలోనే పరిగణనలోకి తీసుకున్నారు.

మార్క్స్ ఈ రెండవ కోవకు చెందిన ఆలోచనల పట్ల మొగ్గుచూపాడు. ఈ కారణాలతోనే ఫ్యూయర్‌బా సిద్ధాంతంతో విభేదించాడు. కొద్దిమంది కుర్రాళ్ళతో జట్టు కట్టాడు. వారికే 'యువ హెగెలియన్‌లు' అని పేరు. ఈ చిన్న గ్రూప్ తదనంతర కాలంలో తాత్విక చర్చల ద్వారా మానవ జాతి సమగ్రంగా, సంపూర్ణంగా

> **“ ప్రకృతికీ, మానవుడికీ మధ్యన నడిచే గతి తర్క క్రమంలో - ప్రకృతి నియమాలను తెలుసుకుంటూ, మార్చుకుంటూ, మనిషి అనేక మార్పులకు లోనవుతాడు. ప్రకృతి మీద ఆధిపత్యం సాధించే క్రమంలో ‘మనిషి ఉత్పత్తి సాధనాలను, నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటాడు. ఈ క్రమంలోనే అతని ఊహాశక్తి, సృజనాత్మకత విస్తరిస్తాయి. దీనితో పాటే ‘సంస్కృతి’లో కూడా వైవిధ్యత చోటు చేసుకుంటుంది. ”**

ఎలా విముక్తి చెందుతుంది అనే సిద్ధాంతం రూపుదిద్దుకోవడానికి దోహదం చేసింది. యువ హెగెలియన్లు మొదటిగా మానవ జాతి చైతన్యం మీద మత భావజాల ప్రభావాన్ని తుడిచిపెట్టం ద్వారా విముక్తి చెందవచ్చు అని ప్రతిపాదించారు. కాని మార్క్స్ ఈ వాదనతో కూడా పూర్తి ఏకాభిప్రాయంతో లేడు. అది అసమగ్రమైనదని వాదించాడు. మానవజాతి విముక్తికి అంతకు మించినది ఏదో అవసరం అని భావించాడు. (దాని కోసమే జీవిత పర్యంతం అన్వేషించాడు) రాజకీయ అర్థశాస్త్ర విమర్శమీద మార్క్స్ కొంత కృషి చేసాడు. అందులో ఇలా పేర్కొన్నాడు. – “హెగెల్ తత్వశాస్త్ర సిద్ధాంతాన్ని సునిశితంగా పునఃపరీక్షించడం ద్వారా నాలో అలుముకున్న సందేహాలను పరిష్కరించుకోవాలని భావించాను. దీనికి సంబంధించి పరిచయం 1844 లో పారిస్ నుండి వెలువడే ‘ద్యూషె –ఫ్రాండోషిషె జార్ బషుర్’ పత్రికలో వచ్చింది. మానవ మేధస్సు వికాసం అనేది న్యాయ సంబంధాల మీదనో, రాజకీయ సంవిధానాల మీదనో ఆధారపాటు కాకుండా పోతాయనే నిర్ధారణకు వచ్చాను. అంతే హెగెల్ సిద్ధాంతానికి పూర్తిగా భిన్నమైన అవగాహన ఏర్పడింది. మానవుడి బుద్ధి వికాసం అనేది పదార్థ జీవిత పరిస్థితుల ఆధారంగా జరుగుతుందని నా విచారణలో తేలింది. పద్దెనిమిదవ శతాబ్దపు ఇంగ్లీష్, ఫ్రెంచ్ తాత్వికులు అనుసరించిన పౌర సమాజం సిద్ధాంతాన్ని అనుసరించి ‘పౌర సమాజ’ శల్య పరీక్షలో భాగంగా ఆయా సమాజాల రాజకీయ ఆర్థిక విధానాన్ని విశ్లేషించాను. (ఇదే ఆధునిక పెట్టుబడిదారీ సమాజ అధ్యయనానికి, ‘దాస్ కాపిటల్’ గ్రంథ రచనకు దోహదం చేసింది) నేను ఏ సాధారణ నిర్ధారణలకయితే వచ్చానో – ఒకసారి ఆ నిర్ధారణలకు వచ్చాక నా తదుపరి అధ్యయనానికి మార్గదర్శక సూత్రాలుగా మారాయో వాటిని ఈ రకంగా క్లుప్తీకరించవచ్చు. సామాజిక ఉత్పత్తి క్రమంలో మానవుడికి ఆ ఉత్పత్తి క్రమంతో అనివార్యంగా సంబంధాలు ఏర్పడతాయి. ఈ ఉత్పత్తి సంబంధాలు వారి అభీష్టంతో సంబంధం లేనివిగా ఉంటాయి. ఉత్పత్తికి సంబంధించిన భౌతిక శక్తుల అభివృద్ధి క్రమంలో ప్రజల మధ్యన ఉత్పత్తి సంబంధాలు ఏర్పడతాయి. ఈ ఉత్పత్తి సంబంధాలే ఆ కాలపు సమాజపు ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటాయి. ఈ ఉత్పత్తి సంబంధాలే ఏ సమాజానికయినా అసలయిన పునాది. ఈ పునాది మీదుగా ఉపరితంలో ఏర్పడేవే రాజకీయ చట్ట నిర్మాణాలు. ఈ ఉపరితల నిర్మాణాలకు నాటి



కార్ల్ మార్క్స్, యంగ్ హెగేలియన్స్

సామాజిక చైతన్యానికి మధ్యన నిర్ధిష్టమైన సంబధాలు ఉంటాయి. పదార్థ జీవితంలోని ఈ ఉత్పత్తి విధానాలు జన జీవన సామాజిక, రాజకీయ, మేధోపరమైన అంశాలను ప్రభావితం చేస్తుంటాయి. అంటే మానవ చైతన్యం అతని ఉనికిని నిర్ధారించటం అనేది కాకుండా అతని సామాజిక ఉనికే అతని చైతన్యాన్ని ప్రభావితం చేస్తుంది.

## 2

ప్రకృతికీ, మానవునికీ మధ్య నిరంతరాయంగా జరిగే పెనుగులాట మూలంగా మానవ నాగరికత అభివృద్ధి చెందుతుందని చారిత్రక భౌతికవాదం స్పష్టం చేస్తుంది. మానవుడు ప్రకృతి నుండి తన అవసరాలు తీర్చుకోవడం కోసం చేసే కార్యకలాపాలే ఆ రెంటి నడుమ గతి తర్క సంబంధానికి హేతువుగా నిలుస్తాయి. మానవులు తమ భౌతిక జీవితానికి అవసరమైన ఉత్పత్తి చేసుకుంటారు. ‘జర్మన్ ఐడియాలజీ’ పుస్తకంలో మార్క్స్, ఏంగెల్స్‌లు చెప్పినట్లు – ‘ప్రతిమనిషీ తనదైన జీవితాన్ని అభివ్యక్తీకరించుకుంటాడు. అయితే మనుషులందరి వ్యక్తీకరణలు ఉత్పత్తి దగ్గర ఎలా ఉత్పత్తి చేస్తారు, ఏం ఉత్పత్తి చేస్తారు అనే దగ్గర యాదృచ్ఛికంగా కలుస్తాయి. ప్రతి మనిషీ ఉత్పత్తికి అవసరమైన భౌతిక పరిస్థితుల వ్యక్తీకరణగా ఉంటాడు.”

మార్క్స్ మరో అడుగు ముందుకు వేసి ఉత్పత్తి అనేది సామాజికంగా ఉంటుందని రుజువు చేసాడు. మానవుడు తన అవసరాలను తీర్చుకోవటానికి ప్రకృతి నుండి సంగ్రహించడంలో ఉపయోగించే సాధనాలు, సాంకేతిక పరిజ్ఞానాలనే ఉత్పత్తి సాధనాలు అంటాం. ఈ ఉత్పత్తి క్రమం ఒక్కో నిర్ధిష్ట సామాజిక పరిస్థితులలో ఒక్కోరకమైన సృజనాత్మక, ఆలోచనాత్మక వ్యక్తీకరణలుగా వెలువడుతుంది. ఇదే నాటి ‘సంస్కృతి’గా తీర్చిదిద్దబడుతుంది.

ప్రకృతికి మానవుడికి మధ్యన నడిచే గతి తర్క క్రమంలో – ప్రకృతి నియమాలను తెలుసుకుంటూ, మార్చుకుంటూ, మనిషి అనేక మార్పులకు లోనవుతాడు. ప్రకృతి మీద ఆధిపత్యం సాధించే క్రమంలో ‘మనిషి ఉత్పత్తి సాధనాలను, నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటాడు. ఈ క్రమంలోనే అతని ఊహాశక్తి, సృజనాత్మకత విస్తరిస్తాయి. దీనితో పాటే ‘సంస్కృతి’లో కూడా వైవిధ్యత చోటు చేసుకుంటుంది. సామాజిక ఉత్పత్తి శక్తులు నిరంతరాయంగా అభివృద్ధి చెందుతూ ఉంటాయి. ఉత్పత్తి శక్తులకు ఉత్పత్తికి మధ్య ఉండే సంబంధాన్నే ఉత్పత్తి విధానం అంటాం. ఈ ఉత్పత్తి విధానమే పునాదిగా ఉపరితల అంశాల నిర్మాణం ఉంటుంది. అందు మూలంగా మానవ నాగరిక చరిత్రలో ఏ స్థలకాలాలనైనా సంస్కృతి అనేది ఈ పునాది మీదనే ఆవిర్భవిస్తుంది. అయితే సంస్కృతి ఎప్పుడూ ఈ పరిస్థితుల్లోనే ఉండదు. గతకాలపు వాసనలు కూడా ఆగామి సంస్కృతితో సహజీవనం

> **"చరిత్రను భౌతికవాద దృక్పథంతో పరికిస్తే వాస్తవ జీవితంలో జరిగే ఉత్పత్తి, పునరుత్పత్తులే అంతిమంగా చరిత్రను నిర్ధారించే అంశాలని స్పష్టమవుతుంది. అలా కాకుండా ఆర్థిక అంశాలే అన్నింటినీ నిర్ధారిస్తాయని ఎవరన్నా వక్రీకరిస్తే అంతకన్నా అర్ధరహితమైన మూర్ఖ వాదన, అసంబద్ధ పద ప్రయోగం వేరొకటి ఉండదు."**

సాగించే అవకాశాలూ ఉంటాయి. ఉదాహరణకు చెప్పుకోవాలంటే వర్ణ వివక్షత అనేది బానిస ఉత్పత్తి విధానం, నాటి సామాజిక దురాచారం. పెట్టుబడిదారీ వ్యతిరేక, ఆధిపత్య పాలన వ్యతిరేక కళారూపాల్లో కూడా ఈ వర్ణ వివక్షత అనేది సంస్కృతి నిర్వచనంలో ఒదిగి ఉం టుంది.

అయితే మార్క్సుని, మార్క్సు సిద్ధాంతాన్ని సంకుచితి ఆర్థిక నియతివాదానికే పరిమితం చేసి వ్యాఖ్యానించే ప్రమాదాన్ని గుర్తించే ఏంగెల్స్ ఇలా చెప్తాడు.

"చరిత్రను భౌతికవాద దృక్పథంతో పరికిస్తే వాస్తవ జీవితంలో జరిగే ఉత్పత్తి, పునరుత్పత్తులే అంతిమంగా చరిత్రను నిర్ధారించే అంశాలని స్పష్టమవుతుంది. అలా కాకుండా ఆర్థిక అంశాలే అన్నింటినీ నిర్ధారిస్తాయని ఎవరన్నా వక్రీకరిస్తే అంతకన్నా అర్ధరహితమైన మూర్ఖ వాదన, అసంబద్ధ పద ప్రయోగం వేరొకటి ఉండదు. ఆర్థిక వ్యవస్థ పునాదియే అయినప్పటికీ రాజకీయ రూపాల్లో జరిగే వర్గ పోరాటాలూ, వాటి ఫలితాలు పర్యవసానాలు మూలంగా ఉపరితలాల్లో ఉండే అనేక నిర్మాణ రూపాల ప్రభావాన్నీ తక్కువగా అంచనా వెయ్యలేం. వర్గ పోరాటంలో గెలుపొందిన వర్గం తన వర్గ నీతిని అమలు చెయ్యడానికి అనువుగా రాజ్యాంగాన్ని, కోర్టులను తీర్చిదిద్దుకుంటుంది. అలాంటి రాజకీయ, చట్ట సిద్ధాంతాలు, మత దృక్కోణాలు అనేక మూఢ విశ్వాసాలను ఆలోచనలను వ్యవస్థాగతం చేస్తాయి. చారిత్రక పరిణామ క్రమంలో జరిగే (వర్గ) పోరాటాలన్నింటా వీటి ప్రభావం పడుతూనే ఉంటుంది. ఈ అంశాలన్నీ ఒకదానినొకటి ప్రభావితం చేసకుంటూ అనేక పరిణామక్రమాలకు దారి తీస్తుంటాయి. ఒక్కోసారి మన ఊహకైనా తట్టని విధంగా, లేకుంటే ఉపేక్షించిన అంశాలు కూడా తటాలున ఆవిష్కారమవుతుంటాయి. (జోసెఫ్ బ్లాక్‌కు ఏంగెల్స్ లేఖ. సెప్టెంబర్ 21-22, 1890)


హెగెల్

కాబట్టి సంస్కృతి అంటే వివిధ కళారూపాలకు, సౌందర్యశాస్త్ర అంశాలకు మించినదని, మానవ జీవితాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించేదని నేను విశ్వసిస్తాను. 'ఎకనమిక్ అండ్ ఫిలాసఫిక్ మాన్యుస్క్రిప్ట్' పుస్తకంలో మార్క్సు చెప్పినట్లు మానవ సంస్పందనలు, ఆపేక్షలు ఇత్యాదివన్నీ సంకుచిత, పరిమితి అర్థంలో ఆంత్రోపాలజీ లక్షణాలు కాదు.

సంస్కృతి అనేది ఏ సందర్భంలో చూసినా, పదార్థ లక్షణాల మీద ఆధారపడి ఉంటుంది. ఉత్పత్తి అనేది అవసరాన్ని తీర్చే పదార్థాన్ని అందించడమే కాదు. పదార్థానికి అవసరాన్ని కూడా కల్పిస్తుంది. వినియోగం అనేది ఆదిమ మొరటు పద్ధతి నుండి తక్షణ అందుబాటులో నుండి ఉద్భవిస్తుంది. ఉత్పత్తి అనాగరిక, మొరటు పద్ధతులలో ఉండడం మూలంగా వినియోగం కూడా అదే స్థితిలో ఉంటుంది. ఒక వస్తువు పట్ల కోరిక ద్వారా ఈ రెండూ వ్యక్తమవుతాయి. వస్తువును కోరుకోవడం అనేది ఆ వస్తువు పట్ల ఏర్పరచుకున్న అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి ప్రజలు ఆస్వాదించే గుణాలు, అభిరుచులను బట్టి కళలు రూపొందుతాయి. కళలనే కాదు ఏ ఇతర ఉత్పత్తి లోనయినా ఇదే కీలకం. ఉత్పత్తి అనేది ఆలోచన నుండి వస్తువుని ఎలా సృష్టిస్తుందో వస్తువు కూడా ఆలోచనలు సృష్టిస్తుంది.

మానవ సృజనాత్మకత అనేది వివిధ కళారూపాల్లో వ్యక్తీకరించబడుతూ ఆ కాలపు సమాజ సంస్కృతిగా పిలవబడుతుంది. జ్ఞానం విస్తృతమవుతున్న కొలదీ, చరిత్రలో నమోదయిన నూతన ఆవిష్కరణలు, అన్వేషణలు, సాంకేతిక పురోభివృద్ధి ఇవన్నీ మనకీ విషయాన్నే ధృవపరుస్తాయి. హెూమోసెపియన్ జాతి మానవాళి ఆవిర్భావానికి సంబంధించిన శాస్త్రీయ పురాతత్వ పరిశోధనలు ద్వారా అతి క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు దాదాపుగా మన పూర్వీకజాతి అంతరించిపోయే స్థితిని కల్పించాయని వెల్లడయ్యింది. 'సైంటిఫిక్ అమెరికన్' (2010, ఆగస్టు) నివేదిక ఇందుకు సంబంధించిన కృషి, ఫలితాల గురించి ఇలా వెల్లడించింది.

195,000 నుండి 123,000 సంవత్సరాల క్రితం మధ్యన హెూమోసెపియన్ జాతి జనాభా తీవ్రంగా పడిపోయింది. శీతల, పొడి వాతావరణం ఈ జాతి ప్రజానీకం పురిటిగడ్డ అయిన ఆఫ్రికాను జనావాస యోగ్యం కాని భూభాగంగా మార్చేసింది. ఉత్పాతాన్నుండి తట్టుకుని మిగిలిన జనాభా సమూహాలు నివసించిన ప్రాంతం నుండే మనం ఉద్భవించాం. (ఆ ప్రాంతాన్నే 'పినకిల్ పాయింట్' గా వ్యవహరిస్తున్నారు.)

ఈ వాతావరణ సంక్షోభం నుండి ఆఫ్రికాలోని దక్షిణకోస్తా ప్రాంతంలోని కొన్ని కొన్ని ప్రదేశాల్లో మాత్రమే జనం తట్టుకుని మిగిలారు. ఎందుకంటే ఈ తీరం వెంబడి చేపలు, దుంపచెట్లు విస్తారంగా లభ్యమయ్యాయి కాబట్టి ఈ ప్రాంతంలో జరిపిన పురావస్తు తవ్వకాలలో లభించిన శిధిలాలు, అవశేషాలు, అతి ప్రాచీనకాలపు మానవజాతికి చెందినవే. ఈ పరిశోధనల మూలంగా తేలిన అంశం ఏమిటంటే మనం ఊహించిన దానికన్నా ముందు కాలం నుండే సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని మనుగడ ఎలా సాగించాలో మానవజాతి ఆలోచించగలిగిందని ససాక్ష్యంగా వెల్లడయింది.

ఈ చివరి అంశానికి సంబంధించి ఆ తవ్వకాలు పరిశోధనల బృందానికి నేతృత్వం వహించిన పెద్దమనిషి ఏం చెప్పాడంటే - 'పినకిల్ పాయింట్‌కు చెందిన చరిత్ర పూర్వపు మానవులు సాంకేతికంగా నైపుణ్యం కలిగినవారే

కాదు కళాభిరుచి కూడా మెండుగా ఉన్నవారని అర్థమవుతా వుంది. పి.పి. 13 బి. సీక్వెన్స్‌లో ఉన్న అతిపురాతన పొరల తవ్వకాలు, పరిశోధనలలో మా బృందం మడ్డిరంగు (ఐరన్ ఆక్సైడ్) తో ఉన్న డజన్ల కొద్దీ శకలాలను కనుగొన్నది. బహుశా జంతువుల కొవ్వుతో కలగలిపి రంగులుగా ఉపయోగించే వారని తెలియ వస్తున్నది. ఈ రంగుతో చేసిన అలంకరణలు సామాజిక గుర్తింపునకీ లేక సాంస్కృతికపరమైన ఇతరత్రా అంశాల వ్యక్తికరణకీ సంబంధించినవని ధృవపడుతున్నాయి. అంటే కొన్ని వేల ఏళ్ళక్రితమే నరజాతి ప్రతీకాత్మకంగా వ్యవహరించింది అనడానికి ఇది తిరుగులేని ఉదాహరణ అని మా బృందం గట్టిగా అభిప్రాయపడుతుంది.”

మన మానవజాతి కాలం నుండేఆధునిక నక్షాచిత్రకళ ఉందని ఇంతకాలం మనం గొప్పగా చెప్పుకుంటున్నది సరికాదని ఈ పరిశోధనలు తెలియ చెబుతున్నాయి. నేను ఇంత సుదీర్ఘమైన, క్లిష్టమైన ఉపోద్ఘాతం చెప్పడానికి ఎందుకు కష్టం చేసానంటే ఇవాళ భారతదేశంలో మానవ చైతన్యం నుండి ఒక వాస్తవాన్ని ప్రక్కకి తప్పించాలని చురుగ్గా సాగుతున్న ప్రయత్నాలు తప్పని చెప్పడానికే. మానవాళి ఉనికిలోకి వచ్చిన కాలం నుండి అప్పటి భౌతిక పరిస్థితులు అనుగుణమైన సంస్కృతిని కలిగి ఉన్నారన్న వాస్తవాన్ని చెరిపివెయ్యాలని కొన్ని స్వార్థపరశక్తులు ప్రయత్నిస్తున్నాయి. ప్రజలకు వారిదైన సంస్కృతి ఎప్పుడూ ఉంది.

## 3
## ఆచరణ

సంస్కృతి మూలాలు ఏమిటో మనకు అర్థమయితే సాంస్కృతిక ఆచరణ అంటే మానవజాతి విముక్తికి, దోపిడి నుండి సంపూర్ణ స్వేచ్ఛకై సాగే కార్యాచరణలో అవిభాజ్యమైన అంతర్భాగంగా ఉంటుంది. ఆచరణ అంటే మీరు డిక్షనరీలో అర్థం వెతకకండి. ఆచరణ అంటే ఏ విజ్ఞానమైనా, తత్వమైనా ప్రాక్టికల్‌గా అన్వయించే కార్యక్రమం.

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ రచనలలో మీకీ విషయం ప్రత్యేకించి ఎక్కడా కనబడదు. కాని వారి రచనల సారాంశం అంతా ఆచరణే. ఫ్యూయర్ బా సిద్ధాంతం మీద మార్క్స్ విమర్శచేస్తూ “తత్వవేత్త'లు ప్రపంచాన్ని పరిపరి విధాలా వ్యాఖ్యానించారు కాని కావల్సింది ఏంటంటే దీన్ని మార్చడం ఎలా అన్నదే” అంటాడు. అలాగే ‘ఏం చెయ్యాలి’ అన్న గ్రంథంలో లెనిన్ ‘విప్లవ సిద్ధాంతం అనేది లేకుండా విప్లవోద్యమం ఉండదు’ అంటాడు.

“సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టనిదే దాన్ని మెరుగుపరచలేం. మార్క్సిజం అనేదీ ఒక సిద్ధాంతం. ఒక రాజకీయం. ఇక్కడ రాజకీయం అంటే మార్క్సిస్టు సిద్ధాంతమే. సిద్ధాంతం ఆచరణల మేలైన మేళవింపే రాజకీయం అంటే. మార్క్సిజం అంటేనే కార్యచరణ ద్వారా నిగ్గు తేల్చబడే సిద్ధాంతం.”


భారత దేశంలో సాంస్కృతిక వైవిధ్యం

సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టనిదే దాన్ని మెరుగుపరచలేం. మార్క్సిజం అనేదీ ఒక సిద్ధాంతం. ఒక రాజకీయం. ఇక్కడ రాజకీయం అంటే మార్క్సిస్టు సిద్ధాంతమే. సిద్ధాంతం ఆచరణల మేలైన మేళవింపే రాజకీయం అంటే. మార్క్సిజం అంటేనే కార్యచరణ ద్వారా నిగ్గు తేల్చబడే సిద్ధాంతం. ఆచరణ అనే మాటను గ్రాంపీ విరివిగా వాడుకలోకి తెచ్చాడు.

## 4
## మనదేశ పరిస్థితుల నేపథ్యం

ఈ దృష్టికోణం నుండి పరిశీలిస్తే భారతదేశంలో సాంస్కృతికాభివృద్ధి అనేది ఈ గడ్డ మీద ఉన్న భిన్న జాతుల, భిన్న మతాల నాగరికతల ప్రభావంతో జరిగినట్లే. రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక చోట చెప్తాడు – ‘ఆర్యులు, ఆర్యేతరులు, ద్రవిడులు, చైనీయులు, స్కిథియన్‌లు, హూణులు, పఠాన్‌లు, మొఘులులు... అందరూ జమిలిగా ఒకే శరీరంలో సంలీనమైపోయారు. ఆ శరీరమే ఇండియా’ అని.

భారతదేశం అంటే భిన్న సంస్కృతుల సమాహారం. విభిన్న సంస్కృతుల మథనం ద్వారా నాగరికత అభివృద్ధి చెందింది. సాహిత్యం (ఆ మాటలకి వస్తే ఇతరత్రా కళారూపాలన్నీ కూడా) ఇందులో ప్రధాన ఆసక్తిగా ఉంటుంది. మానవ సంస్పందనలు, అనుభవాలు అన్నింటినీ ప్రతిఫలించడం అసాధ్యమైనప్పటికీ ప్రతి మనిషీ తన జీవిత అనుభవాలకు కొనసాగింపుగా సాహిత్యాన్ని పరిగణిస్తాడు. అలానే ఇతరత్రా సాంస్కృతిక వ్యక్తీకరణలను కూడా.

ఇవాళ భారతదేశంలో రెండు భిన్నమైన (అయినప్పటికీ జమిలిగా కొనసాగగలిగిన) సాంస్కృతిక ప్రభావాలు ఉన్నాయి. అందులో ఒకటి సామ్రాజ్యవాద సంస్కృతి. నయా–ఉదారవాద ఆర్థిక విధానాలను అంటిపెట్టుకుని ఈ సామ్రాజ్యవాద సంస్కృతి విస్తరిస్తా ఉంది. రెండవది మతతత్వ సంస్కృతి. మతతత్వశక్తుల

> “ పాలకశక్తుల భావజాలమే భావజాల రంగంలో ఆధిపత్యం చలాయిస్తుంటుంది. అంటే భౌతిక సంపద మీద ఆధిపత్యం చలాయించే శక్తులే మేధోరంగంలో ఆధిపత్యం చలాయిస్తా ఉంటాయి. ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం గల శక్తులే మేధోవాతావరణ సాధనాల మీదా ఆధిపత్యం కలిగి ఉంటాయి. తద్వారా ప్రజల ఆలోచనల మీద, చైతన్యం మీదా ప్రభావం చూపిస్తు ంటాయి. ”

పునరాగమనంతో ఈ సాంస్కృతిక దాడి పెరిగింది. మోడి సర్కారు హయాంలో ఈ రెండు ఆధిపత్య సంస్కృతులు కలిసి భారతదేశ భవిష్యత్తును ముఖ్యంగా ప్రజల సామాజిక చైతన్యం మీద బలంగా ముద్ర వేసేదానికి ప్రయత్నిస్తున్నాయి.

'హిందూత్వ అనేది భారతీయులందరి సంస్కృతి. ఈ దేశంలో నివసించే వారందరూ ఆ గొప్ప సంస్కృతి వారసులే' అని ఈ మధ్యనే (10-8-2014) ఆర్.యస్.యస్. పెద్ద బాస్ ప్రకటించేసాడు. కాని మన రాజ్యాంగంలో పొందుపరుచుకున్నట్లు భారతదేశం భిన్న ప్రాంతాల విభిన్న మతాల సంస్కృతులతో అలరారే దేశం. 'బహుళ సంస్కృతుల సమాహారం', భారతదేశ సాంస్కృతిక వైవిధ్యతను త్రోసిపుచ్చే ప్రయత్నమే ఆర్‌యస్‌యస్ పెద్ద బాస్ ప్రకటనల్లో ఆంతర్యం.

సాంస్కృతిక కార్యాచరణను ఈ వాస్తవ నేపథ్యం నుండి మనం నిర్వచించుకోవాలి. సమాజం మీద పాలకవర్గాల ఆధిపత్యాన్ని బలోపేతం చేసుకునేందుకే ఇవాళ నయా-ఉదారవాద, మతతత్వ శక్తులు రెండూ జమిలిగా సంస్కృతి మీద ఈ రకమైన దాడికి దిగాయి.

పాలకవర్గాలు సైద్ధాంతిక ఆధిపత్యాన్ని చలాయించడం గురించి మార్క్సు, ఏంగెల్సులు ఏనాడో వివరించారు. 'పాలకశక్తుల భావజాలమే భావజాల రంగంలో ఆధిపత్యం చలాయిస్తుంటుంది. అంటే భౌతిక సంపద మీద ఆధిపత్యం చలాయించే శక్తులే మేధోరంగంలో ఆధిపత్యం చలాయిస్తా ఉంటాయి. ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం గల శక్తులే మేధోవాతావరణ సాధనాల మీదా ఆధిపత్యం కలిగి ఉంటాయి. తద్వారా ప్రజల ఆలోచనల మీద, చైతన్యం మీదా ప్రభావం చూస్తా ఉంటాయి. పాలకశక్తుల భావజాలం అంటే ఉత్పత్తి సంబంధాల్లో ఆధిపత్య శక్తుల భావజాలమే. ఆధిపత్య శక్తులు భావజాలం ద్వారా తమపాలనను, దోపిడిని సుస్థిరం చేసుకునేందుకు పనిచేస్తాయి. పాలక శక్తులలోని ప్రతి ఒక్కొరూ వర్గ స్పృహను కలిగి ఉంటారు. అందుకే ఒక వర్గంగా వీరంతా కలిసి ఉత్పత్తి, పంపిణీ, సంపద సృష్టి వంటి అంశాలతో పాటు భావజాల ఉత్పత్తి, ప్రసారాలకు కూడా తమ వర్గ కృషి కొనసాగిస్తారు. ఇందు మూలంగానే పాలక శక్తుల భావజాలమే ప్రజల భావ జాలంగా చెలామణి అవుతుంటుంది. (జర్మన్ ఐడియాలజీ, మాస్కో ప్రచురణ 1976. పేజి69)

## 5

భారతీయ సాంస్కృతిక చారిత్రక వికాసం అనేది నాగరిక ప్రగతి స్థానంగా చెప్పుకోవడం ఒక పార్శ్వం. స్వాతంత్రోద్యమం కోసం జరిగిన ప్రజా పోరాటాల ద్వారా కూడా సాంస్కృతిక చారిత్రక వికాసం జరిగింది.

1920ల కాలంలోనే స్వాతంత్ర్యోద్యమంలో మూడు దృక్కోణాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానంతర భారతదేశం ఎలా ఉండాలనే ఈ మూడు దృక్కోణాల మధ్యన భావజాల సంఘర్షణ నిరంతరం జరుగుతూ వచ్చింది. ప్రధాన స్రవంతిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యానంతరం భారతదేశం లౌకిక ప్రజాస్వామిక ఆదర్శ రాజ్యంగా ఉండాలన్న దృక్పథాన్ని కలిగి ఉంది. వామపక్ష శక్తులు ఈ లక్ష్యాలతో ఏకీభవిస్తూనే దేశానికి రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు ఆర్థిక స్వాతంత్ర్యమూ రావాలని, దోపిడి లేని రాజ్యం కావాలని, సోషలిజం ఒక్కటే అందుకు మార్గమని నినదించాయి.

ఈ రెండు దృక్కోణాలకు పూర్తిగా వ్యతిరేకమైన భావన మరొకటి ఉంది. భారతదేశం మత రాజ్యంగా ఉండాలనేదే ఆ వాదన. ముస్లింలీగ్ 'ఇస్లామిక్ రాజ్యం' కావాలని, ఆర్.యస్.యస్. హిందూ రాజ్యం నెలకొల్పాలనే లక్ష్యంతో పనిచేసాయి. దురదృష్టకరమైన దేశ విభజన ద్వారా ముస్లిం లీగ్ కలనెరవేరింది. నాటి మత విభజన పర్యవసానాలు నేటికీ వివిధ ఉద్రిక్తతల రూపంలో కొనసాగుతున్నాయి. కాని ఆర్‌యస్‌యస్ కలగన్న అఖండ హిందూ రాష్ట్ర స్థాపన సాధ్యం కాలేదు.

ఇవాళ్టికీ భారతదేశ రాజకీయాల్లో ఈ మూడు భావజాల స్రవంతులు కొనసాగుతున్నాయి. భావజాల రంగంలో ఈ మూడు విభిన్న శక్తుల మధ్యన సైద్ధాంతిక పోరాటం నడుస్తానే ఉంది. 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం కూడా ఈ పోరాటం కొనసాగుతూనే వుంది. ఈ పోరాటంలో అంతిమంగా ఏ శక్తులు పై చెయ్యి సాధిస్తాయి అనే దాన్ని బట్టే భారతదేశం ఏ దశ దిశలో సుస్థిరపడుతుంది అనేది నిర్ణయమవుతుంది.

అయితే కాంగ్రెస్ పార్టీ లక్షిత భారత దేశం ఆ పార్టీ సామ్రాజ్యవాదంతోను, గుత్త పెట్టుబడిదారులు, భూస్వామ్య శక్తులతోనూ విడగొట్టుకుంటే తప్ప సాధ్యపడే పరిస్థితి కనబడ లేదు.

స్వాతంత్ర్యానంతరం పాలకశక్తులను ఏకం చేసే వానికి బడా బూర్జువా నాయకత్వాన భారత పెట్టుబడిదారీ వర్గం అటు సామ్రాజ్య వాదంతోను ఇటు ఫ్యూడల్ భూస్వామ్య వాదంతోను చెలిమి చేసేందుకు సిద్ధపడింది. ఈ బూర్జువా - భూస్వామ్య పాలక శక్తుల కలయిక ఫలితంగా ఫ్యూడల్, సెమీ ఫ్యూడల్ దోపిడికి గురవుతూ, అత్యంత వెనుకబాటుతనంతో ఉన్న లక్షలాది మంది గ్రామీణ ప్రాంత ప్రజానీకాన్ని విముక్తి చేసే వ్యవసాయ రంగ సంస్కరణలు నిరోధించబడ్డాయి. ఈ సంస్కరణలు భూస్వామ్య వ్యవస్థ సామాజిక - ఆర్థిక పునాదిని దెబ్బతీస్తాయి. కాబట్టి పాలక శక్తుల్లో ఉన్న భాగస్వామి ప్రయోజనాలు కాపాడే దానికే ప్రభుత్వం మొగ్గింది.

పర్యవసానంగా వ్యవసాయరంగ సంస్కరణల ద్వారా మెజారిటీ ప్రజానీకం ఆర్థిక వెనుకబాటుతనం పరిష్కారం అవడంతో పాటు వారి సామాజిక చైతన్యమూ మెరుగయ్యే అవకాశం దెబ్బ తినిపోయింది. అందుకే కుల, మత, ఛాందస భావాలు ఆధిపత్యం చెలాయిస్తున్న సంస్కృతి కొనసాగుతా వస్తుంది.

పాలక వర్గాలు ఎన్నుకున్న అభివృద్ధి నమూనా ద్వారా ప్రజల వాస్తవ అవసరాలను, ఆకాంక్షలను తీర్చలేక పోయినప్పటికీ, వారిలో భ్రమలను నిలిపి ఉంచేదానికి ప్రయత్నించాయి. అయితే ఈ భ్రమలు తొలగి ప్రజలలో తీవ్ర అసంతృప్తి రగులుకుంటున్న కాలంలో వామపక్ష

> **"భారతదేశపు ఆధునికత వెనుకటి సమాజపు అవ లక్షణాలు, దురాచారాలయిన, కులపీడన, సామాజిక వివక్ష, పితృస్వామ్యం, ఖాప్ పంచాయితీలు, మతపరమైన మైనార్టీల పట్ల వివక్షతల సాక్షిగా వొంకర్లు పోతోంది. 'ఆధునికత' ఉట్టిపడే నయా-ఉదారవాద వినిమయదారీ పోకడలు, పాత కాలపు బూజుపట్టిన భావాలతో సంకర మయి పోయాయి."**

ప్రజా తంత్ర శక్తులు ఆ అసంతృప్తిని వ్యవసాయ రంగ సంస్కరణలు సాధించే పోరాట దిశగా మళ్ళించడానికి కృషి చేస్తుంటే, మితవాద శక్తులు ఈ అసంతృప్తిని వారి విముక్తికి ఏమాత్రం తోడ్పడని 'హిందూ రాజ్యస్థాపన' దిశగా (మత ప్రాతిపదికన) దారి మళ్ళించే దానికి కృషి చేశాయి. ఈ క్రమంలో ప్రజల వెనుకబాటు తనాన్ని, మతపరమైన సెంటిమెంట్లను ఉపయోగపెట్టుకున్నాయి. వ్యవసాయ రంగ సంస్కరణలు చేపట్టక పోవడం మూలంగా ప్రజల సామాజిక చైతన్యం ఇంకా ఫ్యూడల్ కట్టుబాట్ల మధ్యనే పరిమితమై ఉండడం మత తత్వశక్తుల పెరుగుదలకు తోడ్పడింది.

'ఆధునికత' అంటే సమత్వ భావన, ఇతరులను గౌరవించడం వంటి లక్షణాలను కలిగి ఉండడం అని సామాజికశాస్త్రవేత్తలు నిర్వచిస్తారు. ఆధునిక సమాజంలో ప్రజలంతా ఒకటిగా ఉంటారా అంటే ఉండకపోవచ్చు. ప్రజల మధ్యన అనేక తేడాలు, అభిప్రాయ భేదాలూ ఉండొచ్చు. అయినప్పటికీ ఆధునిక సమాజంలో ప్రజలందరూ హుందాగా జీవించే దానికి, తమ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకునే దానికి ఉన్న అవకాశాలను ఉపయోగపెట్టుకునే దానికి హక్కు కలిగి ఉంటారు. ఈ రెండు అంశాల సమానత్వ పునాదిగా ప్రజల మధ్యన ఎలాంటి అంతరాలు, అసమానతలు ఉన్నా ఆధునికతకు తక్షణం వచ్చిపడే నష్టం ఏమీ ఉండదు. అయితే సమానత్వ పునాది అంశాల మీద ఎట్టి పరిస్థితుల్లో రాజీపడడం కుదరదు. ఆధునిక సమాజాల్లో పౌరసత్వ హక్కు ఈ సమానత్వ పునాది అంశాలకు పూచీనిస్తుంది. రాజరిక సమాజాల్లో పాలకులు, పాలితులు మాత్రమే ఉన్నారు గాని పౌరులు ఉండేవారు కాదు.

ఆయతుల్లా ఖొమైనీ నాయకత్వాన జరిగిన ఇరాన్ విప్లవ విజయానంతరం పశ్చిమ ఐరోపా దేశాల ప్రవాసాన్ని వీడి తిరిగి ఇరాన్ చేరుకుంటున్న కులీన కుటుంబాలు బ్రాండెడ్ ఫ్యాషన్ దుస్తుల వేషధారణ, ఆధునిక ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌తో 'వెస్టర్న్' తరహాలో తరలిరావడం చూసి జలాల్ – ఇ – అహ్మద్ అనే ఇరాన్ మేధావి 'దున్నపోతు అలంకారాలు' అంటూ (వెస్టర్నైజేషన్‌కు వ్యతిరేకార్థంలో వెస్టాక్సికేషన్ అనే పద బంధాన్ని సృష్టించారు) ఎద్దేవా చేసాడు. ఆ మేధావికి క్షమాపణలతో భారతీయ నేపథ్యానికి తగినట్లుగా 'మోడ్రన్' (ఆధునిక)కు వ్యతిరేక వాచ్యార్థంలో 'మోడ్రనాక్సిటీ' అనే పదాన్ని వాడుతున్నా. ఎంత లేటెస్ట్ సెల్‌ఫోన్, ఎంత లేటెస్ట్ కారు ఉంటే అంత ఆధునికంగా ఉన్నట్లు చెలామణీ అవుతుంది మన దేశంలో. ఆధునిక వస్తు వినిమయాన్నే ఆధునికతగా చలామణీ చేసేస్తున్నారు. భారతదేశం "ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థ' అనిపించుకోవడానికి, జి–20 దేశాధినేతల ఎత్తుబల్ల మీద వారితో భుజం భుజం రాసుకుని నిలబడడానికి ఈ వినిమయాలనే 'ఆధునికతకు' కొలమానంగా చూపిస్తున్నారు. కాని మన సమాజంలో అత్యంత ఆధునికంగా ఉన్నాం అనుకుంటున్న తరగతి ప్రజానీకం – ప్రవాస భారతీయులు సహా – పాలుపంచుకునే 'మాట్రిమోనియమ్' (వివాహార్థుల వేదిక) కాలమ్స్ చూడండి. తమ కులంలోనే, ఉపకులం సహా, జీవిత భాగస్వామి కావాలని కోరుకోవటం మనకు కనబడుతుంది. పశ్చిమదేశాల్లో చట్టాలను తు.చ. తప్పక పాటించే వారు ఈ దేశానికి వచ్చేసరికి చట్టాల్ని ఉల్లంఘించటానికి ఉవ్విళ్లూరుతుంటారు. ఢిల్లీ రోడ్ల మీద తిరిగే అత్యంత ఆధునికమైన విలాసవంతమైన కార్లే తరచూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం మనకు కనబడుతుంది.

భారతదేశపు ఆధునికత వెనుకటి సమాజపు అవలక్షణాలు, దురాచారాలయిన, కులపీడన, సామాజిక వివక్ష, పితృస్వామిక ఆధిపత్యంతో కూడిన మహిళల అణచివేత, ఖాప్ పంచాయితీలు, మతపరమైన మైనార్టీల పట్ల వివక్షతల సాక్షిగా వొంకర్లు పోతుంది. 'ఆధునికత' ఉట్టిపడే నయా–ఉదారవాద వినిమయదారీ పోకడలు, పాత కాలపు బూజుపట్టిన భావాలతో సంకరమయి పోయాయి. ఇలా భ్రష్టు పట్టిన ఆధునిక పోకడల మూలంగానే నేటికీ మహిళలను సమాన భాగస్వామిగా, మానవీయంగా చూడడం వొదిలేసి శృంగార వస్తువుగా చూపించే పెడధ్రపు లక్షణాలు కొనసాగుతున్నాయి.

అంతేకాదు మన ఎన్నికల విధానంలోఇమిడి ఉన్న అవకాశవాద ధోరణులను అడ్డం పెట్టుకుని తక్షణ ఎన్నికల లబ్ధి కోసం అన్యాయ పూరితమైన, అసమానతలతో కూడిన సామాజిక వ్యవస్థ దుర్లక్షణాలన్నింటనీ వాడుకుంటున్న తీరు కళ్ళకు కట్టినట్లు కనబడతా ఉంటుంది. ఫ్యాషన్‌గా ఉండే బ్రాండెడ్ దుస్తులు 'గూసీ' బూట్లు, విలాసవంతమైన సెల్‌ఫోన్లు, ఖరీదైన పెర్ఫ్యూమ్‌లు వాడే ఆధునికులు ఎందరో ఇవాల్టికీ ఆధునిక ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలాంటి అరాచక సామాజిక దుర్లక్షణా లన్నింటినీ యథాతథంగా పాటించడం పెద్ద వైరుధ్యమే, కానీ అదీ నేటి వాస్తవం.

పెట్టుబడిదారీ విధానం సమాజంలో ఆధునికతను తీసుకు వస్తుందని చెబుతుంటారు. కానీ

**'మార్క్సిస్టు' పై**

**మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

> **"ప్రపంచీకరణ విధానాల ద్వారా ప్రజల అభిరుచిని ఏకరీతిగా మలచడం ద్వారా సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పడం ఇక్కడ అన్నింటికన్నా కీలకం. తద్వారా జనబాహుళ్యానికి తేలిగ్గా విస్తారంగా అందించడానికి కావల్సిన యంత్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం సులువవుతుంది. సంస్కృతిని వ్యాపారమయం చెయ్యడం గ్లోబలైజేషన్ ప్రక్రియ ప్రధాన క్రతువుల్లో ఒకటి."**

పెట్టుబడిదారీ పూర్వ సమాజపు ఉత్పత్తి సంబంధాలను, దానితో పాటే అంటిపెట్టుకుని ఉండే పాతకాలపు సామాజిక చైతన్యాన్ని బద్దలు కొట్టకుండా, పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమాన్ని నయా–ఉదారవాద విధానాల ద్వారా సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు అణిగి మణిగి ఉండేలా చెయ్యడం మూలంగా ఇదిగో ఇవాళ మనం సాంస్కృతిక రంగంలోని దివాళాకోరు పోకడలను చవిచూడాల్సి వస్తుంది. పెట్టుబడిదారీ పూర్వపు ఫ్యూడల్ సామాజిక పునాదుల మీదనే పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించాలని సాగుతున్న ప్రయత్నాల మూలంగానే నేడు సంకర సంస్కృతి మన సమాజంలో వర్ధిల్లుతోంది. ఫ్యూడల్ సమాజపు క్షీణ సంప్రదాయాలు, సాంఘిక దురాచారాలు, ఆధునిక వినిమయదారీ పోకడలు పాలూ నీళ్ళలా కలిసిపోయిన ఈ సంకర సంస్కృతిని పాలకవర్గాలు తమ ఆధిపత్యాన్ని చలాయించుకోవడానికి పెంచి పోషిస్తున్నాయి.

**6**

గ్రాంసీ చెప్పినట్లు పాలక వర్గాల ఆధిపత్య భావజాలాన్ని కేవలం రాజ్యం ఒక్కటే చలామణీ చెయ్యలేదు. రాజ్యం అనేది బాహ్యపు అంచు మాత్రమే. లోపల శక్తివంతమైన సాంస్కృతిక కట్టడాలు, కందకాలు పాలక శక్తుల ఆధిపత్య భావజాలాన్ని నిలిపి ఉంచే దానికి నిరంతర కృషి చేస్తా ఉంటాయి.

సంక్లిష్టమైన సామాజిక సంబంధాలు, దొంతరలతో కూడిన సామాజిక నిర్మాణాలు ఈ సంస్కృతిని నియంత్రిస్తా నడిపిస్తా ఉంటాయి. కుటుంబం, కులం, మతం, గుళ్ళు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, ఇవన్నీ పాలకవర్గాల ఆధిపత్య భావజాలానికి అనుగుణమైన విలువలను తీర్చిదిద్దే దానికి దోహదం చేస్తా ఉంటాయి. ఈ క్రమంలోనే 'ఉమ్మడి సంస్కృతి' అనే మిధ్యావాదాన్ని మెదళ్ళకు ఎక్కిస్తుంటాయి. 'ఉమ్మడి సంస్కృతి' అంటే వేరేమీ కాదు పాలకశక్తుల ఆధిపత్య విలువలను అంగీకరించే మానసిక వాతావరణాన్ని సృష్టించడమే. ఈ 'ఉమ్మడి సంస్కృతి' మార్పులకు అతీతంగా ఉంటుందని మత తత్వశక్తులు భావిస్తా ఉంటాయి. కాని అది శుద్ధ తప్పు. ఉదాహరణకు మధ్య అమెరికా దేశాలు అనుభవాలనే తీసుకుందాం. దాదాపు నాలుగు వందల ఏళ్ళ పాటు కాథలిక్ చర్చిల ఆధిపత్యం కొనసాగింది అక్కడ. అయితే మత పీఠాధిపతులు ఎప్పుడయితే ఒక దేశం తర్వాత మరో దేశంలో విముక్తి సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి పీడితుల పక్షాన నిలబడసాగారో పాలక వర్గాలు అప్పటిదాకా తలకెత్తుకున్న 'శతాబ్దాల నాటి సంస్కృతి'ని దింపి ప్రొటెస్టెంట్ మతాన్ని నెత్తిన పెట్టుకున్నాయి. 'ఉమ్మడి సంస్కృతి' అంటే పాలకవర్గాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఏ సంస్కృతినయినా తలకెత్తుకుని, దేన్నయినా దించుకునే అవకాశం కలిగి ఉండడమే.

కాబట్టి 'సంస్కృతి' అనేది ప్రధానంగా పాలకవర్గ ప్రయోజనాలను కొనసాగించడానికి ఉపకరించే సైద్ధాంతిక భావజాల సాధనం. పాలకవర్గాల సంస్కృతిని ఎదిరించడానికి పీడిత వర్గాలు "ప్రత్యామ్నాయ సంస్కృతిని ఎంచుకుంటాయి. అంటే సాంస్కృతిక రంగంలో కూడా వర్గపోరాటం ఉంటుంది. భారతదేశంలో ఇవాళ సాంస్కృతిక రంగంలో వర్గపోరాటం ముందుకు వచ్చింది. పెట్టుబడిదారీ విధానంలో సంస్కృతి అనేది పెట్టుబడుల నీతిని విస్తరింపచేసే సైద్ధాంతిక సాధనంగా పని చేస్తుంది. సమాజంలో అన్నీ మారుతూ వస్తున్నట్లే సంస్కృతి' కూడా సరుకుగా మారిపోతూ ఉంటుంది. దీని గురించి ఇప్పటికే సవివరమైన చర్చ చాలా జరిగింది. అందుకే నేను మళ్ళీ దాని జోలికి పోవడం లేదు. పెట్టుబడిదారీ విధానపు 'సాంస్కృతిక ఉత్పత్తులు' సామాజిక సృజనాత్మక వ్యక్తీకరణ కన్నా సామాజిక నియంత్రణ సాధించడమే లక్ష్యంగా ముందుకు వస్తాయి. వీటి మారకపు విలువ ఎల్లప్పుడూ వాటి ఉపయోగపు విలువని అధిగమించే ఉంటాయి. అయితే పెట్టుబడిని వ్యతిరేకించే ప్రత్యామ్నాయ సంస్కృతికి ఈ లక్షణాలు ఉండవు.

పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాద విధానాల పరిణామక్రమంలోని గుణాత్మకమైన విభిన్నమైన దశయే ప్రపంచీకరణ విధానాలు. ఈ దశలో ఫైనాన్స్ పెట్టుబడి, దాని అంతర్జాతీయ స్వభావం చాలా విస్తృతి కలిగి ఉంటాయి. ఫైనాన్స్ పెట్టుబడి భూమండలం మీద ఎక్కడ నుంచయినా తక్షణ లాభాలు సంగ్రహించడానికి చూస్తుంది. మరీ ముఖ్యంగా సట్టా వ్యాపారం ద్వారా. అందుకే పెట్టుబడి ఏ దేశంలోకయినా జొరబడడానికి అనువైన నియంత్రణలు లేని రాజ్యాన్ని కోరుకుంటుంది. అందుకే అది దేశాల సార్వభౌమత్వాన్ని, భౌగోళిక సరిహద్దులను ఏ మాత్రం ఖాతరు చెయ్యదు.

భారీ బహుళజాతి కార్పోరేట్ సంస్థల ద్వారా అలవిమాలిన సంపద పోగేసు కోవడంతో పాటు కమ్యునికేషన్, సమాచార, వినోద రంగాలన్నింటినీ ఏకం చేసి సాంస్కృతిక రంగం మీద గుత్తాధిపత్యం సాధించడం, సరుకుల ఉత్పత్తి – పంపిణీలను గుప్పిట్లో పెట్టుకోవడంతో పాటు ప్రపంచం మొత్తాన్ని ఏకరూప సాంస్కృతిక మార్కెట్‌గా మలిచేదానికి చూస్తాయి ప్రపంచీకరణ విధానాలు. దీని గురించి ఇప్పటికే చాలామంది ఆర్థికవేత్తలు విపులమైన వివరమైన రచనలు మనకు అందించారు. కాబట్టి ఇప్పుడు నేనా వివరాల్లోకి పోవడం లేదు.

ప్రపంచీకరణ విధానాల ద్వారా ప్రజల అభిరుచిని ఏకరీతిగా మలచడం ద్వారా సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పడం ఇక్కడ అన్నింటికన్నా కీలకం. తద్వారా జనబాహుళ్యానికి తేలిగ్గా విస్తారంగా అందించడానికి కావల్సిన యంత్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం సులువవుతుంది. సంస్కృతిని వ్యాపారమయం చెయ్యడం గ్లోబలైజేషన్ ప్రక్రియ ప్రధాన క్రతువుల్లో ఒకటి. మనదేశంలో పాశ్చాత్య సంస్కృతికి సంబంధించిన 'వాలంటైన్స్‌డే' (ప్రేమికుల రోజు) హఠాత్తుగా పాపులర్ కావడం వెనుక ఆ సందర్భానికి తగిన గ్రీటింగ్ కార్డులు బహుమతుల మార్కెట్‌ను విస్తృతం చేసుకోవడమే అసలు లక్ష్యం. ఈ రోజుకీ చాలా దేశాల్లో నిరక్షరాస్యత పెద్ద శాతంలో ఉన్నా అక్కడి పిల్లలకు మాత్రం వాల్ట్‌డిస్నీ కార్టున్ చిత్రాల్లో పాత్రలు మాత్రం చిరపరిచితులుగా ఉంటాయి.

వర్గాధిపత్య కోణం నుండి పరిశీలిస్తే ప్రపంచీకరించబడిన ఈ సంస్కృతి లక్ష్యం ఏంటంటే ప్రజలను తమ దైనందిన జీవిత కఠోర వాస్తవాల నుండి దృష్టి మళ్ళించడమే,

దారిద్ర్యం, దోపిడి వంటి తీవ్ర సమస్యల నుండి ప్రజల ఆలోచనలు పక్కకి మళ్ళించడమే. అంటే ప్రపంచీకరణ సంస్కృతి ప్రజల సృజనాత్మక చైతన్యాన్ని పెంపొందించేదిగా గాక దాన్ని దారిమళ్ళించేదిగా పనిచేస్తుంది. అంతే కాదు వారి జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవడానికి పోరాటాలు చేపట్టకుండా నిలవరించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. అందుకే మైకేల్ పేరెంటీ అంటాడు – ప్రజా సంస్కృతి, పాపులర్ సంస్కృతులకు తోడుగా ఇప్పుడు కొత్తగా మీడియా సంస్కృతి ఒకటి వచ్చి పడింది అని. ఈ మీడియా సంస్కృతిని అతికొద్ది బహుళజాతి కార్పోరేట్ సంస్థలు నియంత్రిస్తున్నాయి. అవి కావల్సినంత సంపద పోగేసుకోవడానికి, యధేచ్ఛగా దోపిడి కొనసాగించుకోవడానికి వీలుగా ప్రజల ఆలోచనలను నియంత్రిస్తుంది. సామాజిక సృజనాత్మకతను ప్రోది చెయ్యడానికి బదులుగా సామాజిక నియంత్రణను రుద్దుతుంది. ప్రజా సంస్కృతి అంటే ప్రజలు ఎదుర్కొంటున్న కఠోర చేదు వాస్తవాలను అర్థం చేసుకుని వాటిని పరిష్కరించు కోవడానికి తోడ్పడాలి కదా. కానీ దానికి బదులుగా పాపులర్ సంస్కృతి పేరిట సంచలనాలు, క్షీణ విలువల ద్వారా ప్రజలను ఏమారుస్తా ఉంటారు. ప్రజల ఆహార, ఆహార్య అలవాట్లతో సహా సమస్తాన్నీ నియంత్రిస్తా ఉంటారు.

ఈ మొత్తం క్రమం వెనుక ఒక సైద్ధాంతిక లక్ష్యం ఉంది. వినోద పరిశ్రమ లక్ష్యం ప్రజలకు వినోదం అందించడమే తప్ప రాజకీయాల్తో పనిలేదని పైకి చెప్తూ ఉంటారు కానీ ఈ పరిశ్రమ ద్వారా రాజకీయాభిప్రాయాల బలమైన ముద్ర వేస్తా ఉంటారు. అందులోనూ శృంగార భావనలు రెచ్చగొట్టేదానికి, జాత్యహంకార ధోరణులు పెచ్చరిల్లే దానికి, నియంతృత్వ – సైనిక – సామ్రాజ్యవాద పరిపాలనల పట్ల ఆమోదయోగ్యత సృష్టించడానికి, వినిమయదారీ ధోరణులు పెంచి పోషించేదానికి వినోద పరిశ్రమ ప్రధాన సాధనంగా ఉంది ఈనాడు.

నయా–ఉదారవాద విధానాల విశ్వరూపం అది. అలాంటి నయా–ఉదారవాద విధానాలు, మతతత్వ శక్తుల చెలిమి ఇవాళ మన ముందు సవాలుగా నిలిచింది. నయా–ఉదారవాదం సాంస్కృతిక ఆధిపత్యం ద్వారా బంపర్ లాభాలను పోగేసుకోవాలని చూస్తుంటే మత తత్వశక్తులు, అందుకు అనువుగా అణుకువగా దారి వదులుతూనే 'అఖండ హిందూ రాజ్యస్థాపన' పేరిట ఆర్‌యస్‌యస్ లక్ష్యిత మత రాజ్యాన్ని స్థాపించేదానికి ప్రయత్నిస్తున్నాయి. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే సంస్కృతి అన్న ఆర్‌యస్‌యస్ నినాదం వెనుక భారతదేశ ఘనమైన సాంస్కృతిక వైవిధ్యాన్ని దాని పునాదులను ధ్వంసం చేసే కుట్ర దాగి ఉంది.

> **❝ ప్రపంచీకరణ సంస్కృతిని పోషించేవాళ్లు ఎలాంటి నూతన ప్రజా కళారూపాన్నయినా ఇట్టే అక్కున చేర్చేసుకుని అందులోని ప్రజా చైతన్యాన్ని ప్రేరేపించే అంశను స్వాహా చేసేంతటి మొనగాళ్ళు. అయినప్పటికీ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను సాంస్కృతిక అజెండాగా మలచడమే ప్రజా కళాకారుల కర్తవ్యం, ప్రజా సంస్కృతి లక్ష్యంగా ఉండాలి. ఇందుకు ఎంతో సృజనాత్మకంగా వ్యవహరించాలి. తద్వారా మాత్రమే సంస్కృతి మీద జరుగుతున్న పెనుదాడిని తిప్పికొట్టగలం. ❞**

పై పెచ్చు ఈ రెండు శక్తులూ స్వీయ ప్రయోజనాలు ఈడేర్చుకోవడానికి ప్రజల దైనందిన సమస్యల నుండి దృష్టి మళ్ళించేదానికి, ప్రస్తుత దోపిడి విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలు పక్కదారి పట్టించేందుకు, ఇప్పుడున్న దోపిడి వ్యవస్థ యథాతథంగా కొనసాగించేందుకు వీలుగా 'సాంస్కృతిక రంగాన్ని' బలమైన సాధనంగా వినియోగించుకుంటాయి.

## 7

ఇటువంటి పెను సాంస్కృతిక దాడిని ఎదుర్కోవడం ఎట్లా? దీన్ని తట్టుకొని ప్రజా సంస్కృతిని నిలబెట్టటం ఎట్లా? అందుకు తక్షణం మార్గం ఏంటంటే ప్రజల సమస్యలను సాంస్కృతిక అజెండాగా మలచడం. ఆధిపత్య సాంస్కృతిని సవాలు చెయ్యడమనే అత్యున్నత కర్తవ్యాన్ని నిభాయించడానికి ఇంతకన్న దగ్గరి మార్గం లేదు.

ప్రజల సమస్యలను సాంస్కృతిక అజెండాలోకి తీసుకురావడానికి ఇప్పుడున్న రూపాలను, పద్ధతులను సృజనాత్మకంగా వాడుకోవడంతో పాటు కొత్త రూపాలను కొత్త పద్ధతులను కూడా ఎంచుకోవాలి. శక్తివంతమైన ఎలక్ట్రానిక్ మీడియా ఇవాళ నయా–ఉదారవాద, మతతత్వ శక్తుల సంస్కృతికి పట్టం కడుతోంది. ప్రజలను –ముఖ్యంగా పిల్లలు యువతీయువకులను టీవీలకు అతుక్కుపోయేట్లు చేస్తూ వారిలో సామాజిక మమేకతను, స్పందనలను లుప్తం చేస్తుంది. మరీ ముఖ్యంగా కార్పోరేట్ మీడియా అయితే ఈ రెండు మితవాద శక్తుల చేతుల్లో పావుగా మారిపోయింది. దోపిడిరహిత సమసమాజాన్ని సాధించుకోవడానికి వీలుగా ప్రజల చైతన్యాన్ని పెంపొందించడానికి బదులు వారి చైతన్యాన్ని మొద్దు బార్చేస్తుంది.

కొత్త కళారూపాలను సృష్టించుకోవడం అంటే పాత ప్రజా కళారూపాలను వదిలేసుకోమని చెప్పడమూ కాదు, కొత్త ప్రజా కళారూపాలను సృష్టించడం తోటే యుద్ధంలో గెలిచినట్టూ కాదు. ప్రపంచీకరణ సంస్కృతిని పోషించేవాళ్లు ఎలాంటి నూతన ప్రజా కళారూపాన్నయినా ఇట్టే అక్కున చేర్చేసుకుని అందులోని ప్రజా చైతన్యాన్ని ప్రేరేపించే అంశను స్వాహా చేసేంతటి మొనగాళ్ళు. అయినప్పటికీ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను సాంస్కృతిక అజెండాగా మలచడమే ప్రజా కళాకారుల కర్తవ్యం, ప్రజా సంస్కృతి లక్ష్యంగా ఉండాలి. ఇందుకు ఎంతో సృజనాత్మకంగా వ్యవహరించాలి. తద్వారా మాత్రమే సంస్కృతి మీద జరుగుతున్న పెనుదాడిని తిప్పికొట్టగలం.

సాంస్కృతిక రంగంలో మన కార్యాచరణను ముందుకు తీసుకుపోవడం ద్వారానే ఈ సాంస్కృతిక యుద్ధంలో గెలవగలం. ప్రజలు ఎదుర్కొంటున్న బహుముఖ సమస్యలను, సాంస్కృతిక అజెండాగా మలచడానికి నూతన కళారూపాలను ఎంచుకోవడం, ఇప్పటిదాకా సాంస్కృతిక రంగంలో సాధించిన నాగరికత ప్రగతిని నిలబెట్టుకోవడం సప్దర్ హష్మికి మనం ఇచ్చే నిజమైన నివాళి కాగలదు.

ఇది మనకు సాధ్యమా? మనం చెయ్యగలమా అన్న ప్రశ్నకు – జర్మనీలో హిట్లర్ ఫాసిజం ఎదురులేనిదిగా నడుస్తాఉన్న కాలంలోనే బ్రెఫ్ట్ అన్న మాటలే జవాబుగా నిలుస్తాయి.

'చీకటి రాజ్యంలో పాడగలమా
గలము, చీకటి రాజ్యం గురించే పాట
పాడాలి'

'సంస్కృతి' అనేది మానవాళి కోరుకునే స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల సమగ్ర వ్యక్తీకరణ. దీనిని అణిచిపెట్టడం ఎవ్వరి తరమూ కాదు.

**(తెలుగు : సత్యరంజన్ కె.)**

పార్టీ నిర్మాణం

# సమిష్టి పని విధానం



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు, ప్రజాశక్తి తెలంగాణా సంపాదకులు

**ఎస్. వీరయ్య**

సమిష్టి పని విధానానికి కమ్యూనిస్టులే ప్రాధాన్యతనిస్తారెందుకు?

బూర్జువా పార్టీల్లో దీన్ని పాటించ ఁదుకు?

సమిష్టి పని విధానం నిబంధనావళిలో భాగమైనప్పటికీ, కమ్యూనిస్టు పార్టీలో పదేపదే చర్చించవలసిన పరిస్థితి ఎందుకు వస్తోంది?

సమిష్టి పని విధానాన్ని ఆమోదించి కూడా ఉల్లంఘిస్తుంటారు ఎందుకు?

ఇవన్నీ పరిశీలించాల్సిన ప్రశ్నలే.

కమ్యూనిస్టులు సమాజం గురించి విశ్లేషణకు పరిమితం కారు. మార్చేందుకు ప్రయత్నిస్తారు. మానవ జాతి చరిత్రలో మార్పులన్నీ సమిష్టి కృషి ఫలితాలే. మానవజాతి పురోగమనమంతా సమిష్టి కృషితో సాధించిందే. ప్రజలే చరిత్ర నిర్మాతలు. కొద్ది మంది వ్యక్తుల్లో, నాయకులో మాత్రమే కాదు – శ్రామిక ప్రజలు సమైక్యంగా కదలాలి. వారిని కదలించేందుకు కమ్యూనిస్టు పార్టీ ప్రయత్నించాలి. ప్రజా ఉద్యమాలకు దిశానిర్దేశం చేయవలసిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ. ప్రజలను ఐక్యం చేసి, ఉద్యమబాట నడపవలసిన పార్టీ ఇది. కమ్యూనిస్టు పార్టీ సమిష్టిగా పనిచేయకుండా ఈ పని సాధించజాలదు. పార్టీలో ఐక్యంగా లేకుండా, ప్రజల్లో ఐక్యతను సాధించలేము. ఇలాంటి ఐక్యతకు తోడ్పడే అత్యంత కీలకమైన అంశమే సమిష్టి పని విధానం. అందుకే కమ్యూనిస్టు పార్టీలో సమిష్టి నాయకత్వానికే ప్రాధాన్యత. ఇది గతితార్కిక పద్ధతి. బూర్జువా–భూస్వామ్య పార్టీలు ఈ సమాజ మార్పుకు వ్యతిరేకం. ప్రస్తుత దోపిడీ వ్యవస్థను యథాతథంగా కాపాడడమే వారి లక్ష్యం. సమాజాన్ని మార్చవలసిన కర్తవ్యం వారికేమీ లేదు. అందుకే ప్రజలను ఐక్యంగా కదిలించాల్సిన కర్తవ్యమూ లేదు. ప్రజలు ఐక్యం కాకుండా చూడడమే వారికి అవసరం.

కమ్యూనిస్టు పార్టీకి ఐక్యత అత్యంత కీలకమైంది. సిద్ధాంతపరంగానూ, ఆచరణపరంగాను పార్టీ ఐక్యంగా నిలబడాలి. ఆచరణలో ఐక్యతను సాధించేందుకు తోడ్పడేదే సమిష్టి పని విధానం. రాజ్యాంగ యంత్రాన్ని ఢీకొనాల్సిన కర్తవ్యాన్ని భుజాన వేసుకున్నది కమ్యూనిస్టు పార్టీ. అందుకే ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహిస్తోంది. శక్తివంతమైన రాజ్యాంగ యంత్రాన్ని ఢీకొనవలసిన కమ్యూనిస్టు పార్టీలో ఐక్యత అవసరం గురించి అందరూ అంగీకరిస్తారు. సమిష్టి నిర్ణయాల వల్ల సాధ్యమైనంత మేరకు సరైన నిర్ణయాలు చేసేందుకు అవకాశాలు ఉంటాయి. ఒక అభిప్రాయానికి అనేక అభిప్రాయాలు తోడు కావడం వలన ఈ ప్రయోజనం చేకూరుతుంది. అనేక మంది అనుభవాలను క్రోడీకరించి చేసే నిర్ణయంగా అది ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పొరపాట్లు జరిగినా, నష్టనివారణకు సమిష్టిగా కృషి చేసే అవకాశం ఉంటుంది. ఇది ఉద్యమానికి ప్రయోజనకరం. వ్యక్తిగతంగా అనేక శక్తి, సామర్థ్యాలు కలిగిన సమర్థులు అనేక మంది ఉంటారు. కానీ ఒక వ్యక్తి ఎంత సమర్థుడైనప్పటికీ, ఎంత తెలిసినప్పటికీ తెలియనివి చాలా ఎక్కువ. విశ్వ విజ్ఞానంతో గాని, అనుభవ సారంతో గాని పోల్చినప్పుడు ఒక వ్యక్తి విజ్ఞానం, అనుభవం సముద్రంలో నీటిబొట్టు వంటిదే. అందుకే ఎవరికైనా చాలా తెలుసు అనగలమేమోగాని, అన్నీ తెలుసు అనలేము. అందుకే అనేక విషయాలు తెలిసినవారు, అనేక మంది అనుభవజ్ఞులు కలిసి చేసే నిర్ణయం, ఒక వ్యక్తి చేసే నిర్ణయం కంటే మెరుగైందిగా పరిగణించాలి. తొంభైతొమ్మిది తెలిసినా, ఒకటి కలవకుండా వంద కాదన్న విషయం గమనించాలి. కొత్తగా ఏమీ చెప్పకపోయినా, ప్రతిపాదనతో పూర్తిగా ఏకీభవించినప్పటికీ, సమిష్టి నిర్ణయాల ప్రాధాన్యతను తక్కువ అంచనా వేయకూడదు. ప్రతిపాదన సరైందైనప్పుడు కొత్తగా చెప్పవలసిందేమీ ఉండకపోవచ్చు. కానీ, నిర్ణయంలో తామూ భాగస్వాములైనందువల్ల నిర్ణయాలను సొంతం చేసుకుంటారు. మంచి–చెడ్డలకు మనస్ఫూర్తిగా బాధ్యత వహిస్తారు. సాధ్యమైన మేరకు సహకారమందిస్తారు. పరస్పర గౌరవ భావం పెరుగుతుంది. సహజంగానే ఈ ప్రక్రియ మొత్తం కామ్రేడ్స్ మధ్య ఐక్యత పెరగడానికి, పార్టీ మరింత పటిష్టం కావడానికి తోడ్పడు తుంది.

సమిష్టితత్వం ఒక కళ. ఇది చైతన్యవంతంగా చేయాల్సిన పని. పథకం ప్రకారం సాధించాల్సిన పని. కొన్ని సందర్భాల్లో ఇందుకు భిన్నమైన ఆచరణ చూస్తాం. ఎదుటి వ్యక్తి సహకరించడం లేదని తేల్చడానికి కొందరు పథకం ప్రకారం ప్రయత్నిస్తారు. రుజువు చేయడానికి సమయం కోసం ఎదురుచూస్తారు. ఐక్యత పెంపుదలకు ఇది తోడ్పడదు. ఈ ప్రయత్నమేదో సహకారం పొందడానికి చేయాలి. ఇది పార్టీకి ఉపయోగపడుతుంది. తోటి కామ్రేడ్ శక్తి సామర్థ్యాలను బట్టి సహకారం ఆశించవచ్చు. అందుకు ఉన్న అవకాశాల మేరకు సహకారం తీసుకోవచ్చు. సమిష్టి పని విధానాన్ని మెరుగుపర్చుకునేందుకు సంస్థాగత పద్ధతులు ఉన్నాయి. కేంద్రీకృత ప్రజాస్వామ్యం సారాంశం ఇదే. కీలకమైన నిర్ణయాలు ఎప్పుడూ కమిటీ లేదా కార్యదర్శివర్గం లేదా శాఖలోనే చేయాలి. తోసుకొచ్చిన సమస్యలు పరిష్కరించాల్సిన సందర్భాల్లో పూర్తి స్థాయి సమావేశాలు సాధ్యం కాకపోవచ్చు. అలాంటప్పుడు అందుబాటులో ఉన్నవారు నిర్ణయాలు చేసి, అమలు చేయవచ్చు. తర్వాత జరిగే పూర్తిస్థాయి సమావేశంలో ఆమోదం పొందవచ్చు. అందుబాటులో ఉన్నవారంటే ఎవరు? తక్షణం అప్పటికప్పుడే చేయాల్సిన నిర్ణయమైతే ఆ క్షణంలో అందు బాటులో ఉన్నవారిని సంప్రదించి నిర్ణయించడం అనివార్యం. అట్లా కానప్పుడు, అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నవారిని కూడా భాగస్వాములను చేయాలి. అందుకే అందుబాటులో ఉన్నవారి సమావేశాలను ప్రత్యేకంగా పిలవాలి. దీనివల్ల అవకాశం ఉన్న మేరకు వెసులుబాటు కల్పించుకుని హాజరు కావడానికి, నిర్ణయాల్లో భాగస్వాములు కావడానికి తోడ్పడుతుంది. అందుబాటులో ఉన్నవారి సమావేశం గురించి తెలియజేయడం వల్ల నిర్ణయాలు చేయవలసిన ముఖ్యమైన అంశాలు ఉన్నాయని అర్థం చేసుకుంటారు. ఏమాత్రం అవకాశం ఉన్నా, హాజరు కావడానికి ప్రయత్నిస్తారు. సమస్య స్వభావాన్ని బట్టి కొన్ని సందర్భాలలో అవసర మైతే ఫోన్ ద్వారా కూడా సంప్రదించవచ్చు. ఇవన్నీ సమిష్టి తత్వాన్ని, కామ్రేడ్స్ మధ్య సుహృద్భావాన్ని పెంపొందిస్తాయి. అందుబాటు లో లేరనడం సులభం. అందుబాటులోకి తెచ్చు కునేందుకు ప్రయత్నించడం ఉపయోగం. అందుకే ఇదొక కళ.

> **"సమిష్టితత్వం అంటే, నిబంధనావళికి లోబడిన సమిష్టి తత్వంగానే భావించాలి. అది కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో అంతర్భాగం కావాలి. ఒక వ్యక్తికి బదులు, కొంత మంది కలిసి చేసే నిర్ణయాలన్నీ సమిష్టి నిర్ణయాలుగానే పరిగణిస్తే, అవి నిబంధనావళికి వెలుపల కూడా చేయవచ్చు. తాను భాగస్వామిగా ఉన్న కమిటీలో కాకుండా, వెలుపల ఇతరులతో కలిసి చేసే నిర్ణయాలను సమిష్టి నిర్ణయాలుగా పరిగణించకూడదు."**

సమిష్టితత్వం అంటే, నిబంధనావళికి లోబడిన సమిష్టితత్వంగానే భావించాలి. అది కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో అంతర్భాగం కావాలి. ఒక వ్యక్తికి బదులు, కొంత మంది కలిసి చేసే నిర్ణయాలన్నీ సమిష్టి నిర్ణయాలుగానే పరిగణిస్తే, అవి నిబంధనావళికి వెలుపల కూడా చేయవచ్చు. తాను భాగస్వామిగా ఉన్న కమిటీలో కాకుండా, వెలుపల ఇతరులతో కలిసి చేసే నిర్ణయాలను సమిష్టి నిర్ణయాలుగా పరిగణించకూడదు. కమ్యూనిస్టు దృక్పథంలో ఇది సమిష్టితత్వం కాదు. ఇది నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. అరాచకానికి అవకాశం ఇస్తుంది. ముఠాతత్వానికి పునాదులు వేస్తుంది. అందుకే నిర్ణయాలు ఎప్పుడూ – నిర్ణయాలు చేయడానికి ఉద్దేశించిన కమిటీలు, శాఖలలోనే చేయాలి. నిర్ణయాలు చేయడానికి సమావేశం కావాలి. అప్పటికే చేసిన నిర్ణయాలకు ఆమోదం పొందేందుకు కాదు. అనేక సందర్భాల్లో నిర్ణయాలు చేయవలసిన కమిటీల, సంస్థల వెలుపల జరగవలసిన సంప్రదింపులు కూడా ఉంటాయి. ఫ్రాక్షన్ కమిటీలు, సబ్ కమిటీలు, నిపుణులతో సంప్రదించి నిర్ణయం చేయవలసిన సందర్భాలు ఉంటాయి. అలాంటప్పుడు అనుసరించే రెండు పద్ధతులు మనకు తారసపడుతుంటాయి. "ఫోరంలోకి పోతే సిద్ధాంతాలు వస్తాయి... మీరంతా చెప్పండి. కాదంటే ఏం చేయాలో చూద్దాం" అనడం ఒక పద్ధతి. "మీ ప్రతిపాదనలు ఇవ్వండి. కమిటీ ముందు పెడతాం. తుది నిర్ణయం చేసే ముందు మీ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటాం" అనడం మరో పద్ధతి. మొదటిది పొరపాటు పద్ధతి. తనను తాను ఫోరం నుండి వేరు చేసుకుని మాట్లాడడమే. "నేను మీతోనే ఉన్నాను" అన్న సంకేతాలివ్వడమే. రెండవది తనను తాను నిర్ణయాలు చేసే కమిటీలో భాగంగా పరిగణించుకుని మాట్లాడడం. నిర్ణయాలు చేసే సంస్థ పట్ల నిబద్ధత ప్రదర్శించడం. ఇది సరైన పద్ధతి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం.

సమిష్టి పని విధానాన్ని సూత్రప్రాయంగా అందరూ అంగీకరిస్తారు. అయినప్పటికీ, ఆచరణలో తప్పటడుగులు పడుతుంటాయి. ఇందుకు పునాదులు మన ఆర్థిక వ్యవస్థలోనే ఉన్నాయి. వ్యక్తి ఆరాధన నాయకుల్లోనూ, కార్యకర్తల్లోనూ అహంభావం పెంచుతాయి. ఇది సమిష్టి పని విధానానికి ఆటంకం అవుతుంది. భూస్వామ్య భావజాలం బలంగా ఉన్న సమాజం మనది. దాని పర్యవసానమే వ్యక్తి ఆరాధన లక్షణాలు. వ్యక్తిగత స్వార్థం కూడా సమిష్టి పని విధానానికి హాని కలుగజేస్తుంది. పార్టీలో పైకి ఎగబాకాలన్న తాపత్రయం కానీ, ఉన్న స్థానాన్ని కాపాడుకోవాలన్న ప్రయత్నం కానీ, ఇతరేతర స్వప్రయోజనాలు కానీ సమిష్టితత్వం పట్ల నిబద్ధత లేకుండా చేస్తాయి. తప్పుడు మార్గాలు అన్వేషించడానికి అవకాశం ఇస్తాయి.

బూర్జువా–భూస్వామ్య పార్టీలు ఈ వ్యవస్థను యథాతథంగా కొనసాగించే ప్రయత్నంలో ఉన్నాయి. వాటి నాయకత్వాలు కూడా ఆయా వర్గాల నుండే ఉంటాయి. బలమైన భూస్వామ్య సంబంధాల ఫలితంగా వ్యక్తి ఆరాధన, కుటుంబ పాలన ఆయా పార్టీలకు సర్వసాధారణం. కుటుంబ పాలనకు తమ పార్టీ చాలా దూరమని చెప్పుకునే బిజేపీలో కూడా వ్యక్తి ఆరాధనే ప్రధానం. మొన్నటిదాకా వాజ్‌పేయ్ పట్ల ప్రదర్శించిన ఆరాధన భావమే, ఇప్పుడు మోడీ పట్ల కూడా ప్రదర్శిస్తున్నారు. అన్ని పార్టీల్లోనూ కొందరు నాయకులను ఆకాశానికెత్తుతున్న నేపథ్యంలో, కమ్యూనిస్టు పార్టీలో కూడా ఒక నాయకుడిని ముందుకు తేవాలనే వాదనలు వింటుంటాము. ఓడించాల్సిన భూస్వామ్య భావజాలాన్నే ఒంటబట్టించుకోవడమిది. ఇలాంటి ధోరణులకు కీర్తికండూతి గల నాయకులు, కార్యకర్తలు, భజనపరులు, స్వార్థ ప్రయోజనాలను ఆశించేవారు మొగ్గుతారు. తగిన అవగాహన లేనివారు కూడా సులభంగా లోనవుతారు. నిబద్ధత గలవారు, దూరదృష్టి గలవారు, సరైన అవగాహన కలిగినవారు అంత సులభంగా బతికున్న నాయకులను ఆకాశానికి ఎత్తేందుకు అంగీకరించరు. ఎందుకంటే, ఇలా ఆకాశానికెత్త డం వల్ల కూడా మంచి నాయకులు దారితప్పే ప్రమాదముంది. తమ శక్తి సామర్థ్యాలను ఎక్కు వగా ఊహించుకునే అవకాశం ఉంది. తాము పార్టీకన్నా అతీతులమని భావించి దారితప్ప వచ్చు. వరంగల్ జిల్లాలో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఓంకార్ అనుభవం గమనించదగింది. వ్యక్తిగత పని విధానం, వ్యక్తి ఆరాధన వరంగల్ జిల్లాకు, ముఖ్యంగా నర్సంపేట ప్రాంతానికి చేసిన నష్టం చిన్నదికాదు. చివరకు ఇది పార్టీకి తెలయకుండా దాడులు, హత్యలు చేయించేవరకు దారితీసింది. సమిష్టితత్వం లోపించిన ఫలితం ఇది. దారితప్పడానికి స్థాయిభేదం లేదు. ఓంకా ర్ సాధారణ కార్యకర్త కాదు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు. సభ్యులు–కార్య కర్తలే కాదు, కష్టజీవుల ప్రేమ పాత్రుడు. పార్టీలో గౌరవనీయుడు. దారి తప్పే నాటికి రాష్ట్ర కార్యదర్శివర్గంలో సీనియర్ సభ్యుడే. అందుకే ప్రశ్నించే తత్వం లోపిస్తే, సమిష్టితత్వమూ లోపిస్తుంది. నాయకులను గౌరవించాలి కానీ అనుచరులుగా మారకూడదు. పొగడ్తలకు పొంగిపోవడం, వాటిపట్ల చూసీచూడనట్లు వ్యవహరించడం, మౌనంగా ఉండడం కూడా వాటిని ప్రోత్సహించడమే. కార్యకర్తలకు ఇది తప్పుడు సంకేతాలు ఇస్తుంది. వ్యక్తి ఆరాధనకు పాల్పడుతున్నవారి కంటే, దాన్ని అనుమతిస్తున్న నాయకుల ధోరణి వల్ల జరిగే నష్టమే ఎక్కువ. ఇది పార్టీలో ఆంతరంగిక ప్రజాస్వామ్యాన్ని నీరుగారుస్తుంది. కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో కేంద్రీకృతమే మిగులుతుంది. ప్రజాస్వామ్యం నీరుగారుతుంది. గౌరవం, అభిమానం, భయం పేరుతో సహచరులు అనుచరులుగానూ, నాకెందుకులెమ్మని తలవంచుకుపోయే వారు గానూ మారుతుంది. 'సమిష్టి నిర్ణయం– వ్యక్తిగత బాధ్యత' అన్న మార్క్సిస్టు సూత్రం వక్రీకరించబడి 'వ్యక్తిగత నిర్ణయం–సమిష్టి బాధ్యత'గా అది మారుతుంది.

సాధారణంగా శక్తిసామర్థ్యాలు ఉన్నవారే వ్యక్తి ఆరాధనకు లోనవుతారు. సామర్థ్యంతో పాటు, సమానంగా పొరపాటు ధోరణులు కూడా ఉన్నప్పుడే అది సాధ్యం. సామర్థ్యాన్ని మాత్రమే చూడడం సహజ లక్షణం. భూస్వామ్య సమాజంలో జరిగేది అదే. లోపాలను కూడా చూడడం, ప్రశ్నించడం చైతన్యానికి సంబంధించినది. తన సామర్థ్యాన్ని మాత్రమే చూసుకుని పొంగిపోవడం, అహంభావం పెంచుకోవడం సులభం. తన లోపాలను కూడా గమనించి సరిదిద్దుకోవడం, నమ్రతను పాటించడం, సమిష్టితత్వం అలవర్చుకోవడం చైతన్యపూరితమైనది. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ సూత్రాల్లో ముఖ్యమైనది. ఇందుకు ప్రయత్న పూర్వకమైన కృషి అవసరం. భూస్వామ్య సమాజపు పునాదుల మీద నిర్మితమవుతున్న పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఉన్నాం. అందుకే వాటి ప్రభావాలు పార్టీని కూడా వెన్నాడుతూనే ఉంటాయి. వాటిని ప్రతిఘటించే క్రమంలో వాటి ప్రభావాలకు లోనుకాకుండా చూసుకోవడం కూడా అవసరం.

జరిగిన కథలు

# మా కథలు వింటారా!



రచయిత ఢిల్లీకి చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు. తెహల్కా, ఔట్‌లుక్, ఇంకా ఇతర అనేక పత్రికల్లో పనిచేశారు.

**శివమ్ విజ్**

**ఇటీవల గుర్‌గావ్‌లోని మారుతీ మనేసర్ కంపెనీలో కార్మికుల ఆందోళన గురించిన వార్తలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. కార్మికుల విధ్వంసక చర్యల వలన ఉత్పత్తి దెబ్బతింటోందని కార్పొరేట్ మీడియా గగ్గోలు పెడుతోంది. కానీ అది వాస్తవం కాదనీ, మానెసర్ కంపెనీలో కార్మిక యూనియన్ ఏర్పాటును భగ్నం చేయడానికి యాజమాన్యమే ఇటువంటి ప్రచారాలకు పాల్పడుతోందనీ కార్మికులు వాస్తవాలను వెల్లడించారు. ఆ వాస్తవ గాథలు చదవండి...**

నా పేరు .... అలా ఉండనివ్వండి. మారుతి సుజుకి మటుకు నన్ను వదలదు. నేనేదో నేరం చేసానని కాదు. వాళ్ళు ప్రతి కార్మికుడుని జైల్లో పెట్టాలని చూస్తున్నారు. మేనేసర్ ప్లాంట్‌లో జులై 18న జరిగిన ఘర్షణ సమయంలో పనిలో లేని 3వ షిఫ్ట్ కార్మికులను కూడా వెంటాడుతున్నారు. ఆ గొడవ జరిగిన రోజున నేను కూడా ఉన్నాను. ఏమి జరిగిందో మీకు చెప్తాను. కాని మొత్తం ఘటన మీకు అర్థం అవ్వాలంటే మొదట జరిగిన విషయాలు మీకు తెలియాలి.

బ్రేకులు పెడల్స్ జతపరచటమే కార్మికుల లక్ష్యం అయితే రోజంతా వారు అదే పనిలోనే ఉంటారు. ప్రతి కారుకి 8 నుండి 10 బోల్డ్‌లు పెడుతూ కారు తర్వాత కారు... ప్రతి కారు నలభై సెకండ్లలో పూర్తి చేస్తూ ఉంటారు. అది ఒక రకమైన నాటకం ఆడుతున్నట్లు ఉంటుంది. ఎటువంటి అంతరం లేకుండా ఎనిమిది గంటల పాటు కొనసాగుతుంది. నాకు తెలిసినంత వరకు మనేసర్ ప్లాంట్, ప్రపంచంలోనే అత్యంత వేగవంతగా కార్లను ఉత్పత్తి చేసే టెక్నాలజీ ఉన్న పరిశ్రమ. అక్కడ కన్వేయర్ బెల్ట్ ఎప్పుడూ ఆగదు. మేము కూడా దానితో పాటు పరిగెడుతూ ఉంటాము.

నాకు 26 సంవత్సరాలు. పానిపట్ దగ్గర ఒక గ్రామం నుండి వచ్చాను. మా నాన్నగారు రోజువారి కూలీ చేసుకునేవాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి అయిన తర్వాత పానిపట్‌లో ఐటిఐలో చేరాను. రెండు సంవత్సరాల శిక్షణ అయిన తర్వాత గుర్గావ్‌లోని మారుతి ప్లాంట్‌లో చేరేటప్పుడు ఒకరకమైన ఉద్వేగం నాలో ఉంది. ఎందుకంటే పానిపట్ నుండి నాకన్నా ముందు చేరిన వారు చాలా మంది ఉన్నారు. వారందరూ నాకు చెబుతుండేవారు. అక్కడ పని ఒత్తిడి చాలా ఎక్కువ ఉంటుంది, నువ్వు తట్టుకోలేవని చెప్పేవారు. వారు చెప్పింది కొంత కాలానికి నాకు అర్థమయింది. పని ఒత్తిడి అనేది ఎలా ఉంటుందో వివరించటం కష్టమని దానిని అనుభవిస్తేనే అర్థమవుతుందని.

పరిశ్రమలో చేరే ప్రక్రియలు పూర్తి చేయటానికి రెండు రోజుల సమయం తీసుకున్నారు. తర్వాత రెండు రోజులు అప్రెంటిస్ విభాగంలో శిక్షణ ఇప్పించారు. దాని తర్వాత వేరే అంశాలలో ఒకటి రెండు రోజులు శిక్షణ ఇచ్చి ఆ మర్నాటి నుండి నేరుగా పని అప్పగించేసారు. నేనంతట నేను పని చేసుకుంటు పోవాలి. అసలు అప్రెంటిషిష్ అంటేనే శిక్షణ. కానీ నాకు అటువంటి శిక్షణ ఇవ్వలేదు. మారుతి సుజుకీకి అప్రెంటిస్ కార్మికులంతా ఉచితంగా లభించిన శ్రమ శక్తి. ఎందుకంటే వారికిచ్చే స్టయిఫండ్ అంతా ప్రభుత్వమే భరిస్తుంది. ఐటిఐలలో ఉత్తర్ణులైన వారికి ఉపాధి కల్పించే పేరుతో ప్రభుత్వమే నెలకు 2800 స్టయిఫండ్‌గా ఇస్తోంది.

ఈ ఫ్యాక్టరీలో మేము కార్లను తయారు చేస్తాము. కార్ల విడి బాగాలన్నీ అనేక ఇతర పరిశ్రమలలో తయారు చేయబడి వస్తాయి. వందల మంది కార్మిక వర్గం అనేక ప్రాంతాలలో ఆ విడి భాగాలను మారుతి కోసం తయారు చేస్తారు. మేము వాటన్నింటిని ఒక చోట బిగించి కారు రూపం తెస్తాము.

### దిగ్భ్రాంతికర వాస్తవాలు

మొత్తంమీద మేము అప్రెంటిస్ నుండి పర్మినెంట్ కార్మికులుగా మారాము. 8 గంటలపాటు నిర్విరామంగా ఎటువంటి భోజన విరామం లేకుండా పనిచేయాలి. మధ్యలో మాకు 7 నిమిషాల పాటు రెండుసార్లు టీ, బిస్కెట్లు తీసుకోవటానికి కనీసం ఒకటిన్నర నిముషాలు పడుతుంది. తాగితే టీ అన్నా తాగాలి లేదంటే టాయిలెట్‌కి వెళ్ళాలి. కొద్దికాలంనే మేము రెండిటిని ఒకేసారి చేసేలా తయారయ్యాము. ఒక చేత్తో టీ కప్పుతో టాయిలెట్‌లోకి వెళ్ళటం అలవాటయింది. మళ్ళీ పనిలోకి వచ్చేముందు టీ కప్పు కడిగి లాకర్‌లో పెట్టి రావాలి.

నేను ఐ టి ఐ పూర్తిచేసుకుని పనిచేయటం కోసం గుర్గావ్ వచ్చాను. కాని ఇలా ఎనిమిది గంటలపాటు నడుములు విరిగేలా పనిచేయాల్సి ఉంటుందని కలలో కూడా అనుకోలేదు. కనీసం వచ్చే జీతం కూడా పనికి తగ్గట్టుగాలేదు. కాని నేను పనిచేయటం కోసం ఇక్కడికి వచ్చాను. జీవితం ఇలాగే ఉంటుంది. అది జీర్ణంచేసుకుని కొనసాగటానికి నిశ్చయించాను. ఒక సంవత్సర కాలం తర్వాత అప్రెంటీస్‌షిప్ పూర్తియిందని నాకు మనీసర్ ప్లాంట్‌లో ఉద్యోగం ఇచ్చారు. అవి ప్రారంభమై కొద్దినెలలే అయ్యింది. మనీసర్‌లో కూడా పని పద్ధతులు అవే. రోజూ ప్రొద్దునే 4.30 నిమిషాలకి లేస్తాను. మమ్మల్ని తీసుకెళ్ళటానికి వచ్చే బస్సు 5.20 నిమిషాలకి వస్తుంది. అది ఫ్యాక్టరీకి 6.30 నిమిషాలకి చేరుకుంటుంది. కార్మికులంతా ఎక్కువగా నివసించే గుర్గావ్ నుండి ఫ్యాక్టరీ 25 నుండి 30 కిలోమీటర్లు ఉంటుంది. ఉదయం 7 గంటలకు షిఫ్ట్ ప్రారంభమవుతుంది.

కొన్ని నెలల క్రితం నుండి ఉదయం షిఫ్ట్ సమయాన్ని 6.30 నిమిషాలకి మార్చారు. మేము ఇంకా పొద్దున్నే లేవాల్సివచ్చేది. దీనికి కారణం కొంత మంది కార్మికులు ఢిల్లీ నుంచి కూడా వస్తున్నారు. వారు ఉదయం ఢిల్లీ – గుర్గావ్ మధ్య ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఉండాటానికి తెల్లవారుజామునే బయలుదేరటంకోసం షిఫ్ట్ సమయాన్ని మార్చారు. బస్సులో ప్రయాణం ఉచితం కాదు నెలకి ఐదువందల రూపాయలు మాజీతంలో తగ్గిస్తారు. మధ్యా

హ్నాం భోజనము, టీ మటుకి సబ్సిడీ రేటుకి ఇచ్చి, నెలకు రూ 350 వసూలు చేస్తారు. మేము ఏ షాపు ఫ్లోర్లో పనిచేస్తామో దాని పక్కనే ఉన్న విశ్రాంతి ఏరియాలో టీ వసతి కల్పించబడింది. కాని లంచ్‌కి మటుకు క్యాంటిన్‌కి చేరాలంటే దూరం నడవాల్సిఉంటుంది. మాకున్న 30 నిమిషాలలో క్యాంటిన్ చేరి భోజనం చేసి అవసరమయితే టాయిలెట్‌కి వెళ్ళాలంటే ఆ సమయం సరిపోదు. ఒక్క కార్మికుడు లేటుగా వచ్చినా, మొత్తం కన్వేయర్ బెల్ట్ ఆగిపోవాల్సి ఉంటుంది. అది జరిగితే మేనేజర్లనుండి ఆ కార్మికుడికి అనేక రకాల ఆవమానాలు, బెదరింపులు ఉంటాయి. ఇప్పుడు మేము ఉదయం 3.45 నిమిసాలకే లేస్తున్నాము. షిఫ్టు 6 గంటలకే ప్రారంభమవుతుంది. ముందు మీటింగ్ పెడతారు. ఆ తర్వాత వ్యాయామాలు పావుగంటసేపు చేయిస్తారు. ఇదంతా మా సమయంలో కాదు. షిఫ్టు ఎనిమిది గంటలలో భాగం కాదు. ముందే చేయిస్తారు. ఉదయం సమావేశపు ముఖ్య ఉద్దేశ్యం అందరి పేర్లు తీసుకోవటంతోపాటు ఎంత మంది తప్పులు చేసారు, ఏఏ తప్పులు చేసారు. ఏ పార్ట్‌ని ఎవరు వదులుగా వదిలేసారు. కన్వేయర్ బెల్ట్‌లో ఒక భాగాన్ని ఎవరు వదిలేసారు? ఈ రకంగా ప్రతిరోజు మాపని అవమానాలతో, దూషణలతో ప్రారంభమవుతుంది. నువ్వు అది చేసావు, ఇది చేసావు, మాకు రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలి, మరొకసారి పొరపాటు జరిగితే నీకు వార్నింగ్ లెటర్ ఇస్తాము, ఈ రోజు మాకు ఐడి కార్డు కావాలి...ఇవన్నీ అయిన తర్వాత షాపు ఫ్లోర్‌లో వ్యాపారం ప్రారంభమవుతుంది. కాసేపు అయ్యక బెల్టు నొక్కబడుతుంది.

నేను విడిభాగాల అమర్చే పనిలో ఉన్నాను. కొందరు చెకింగ్‌లోనూ, రిపేర్ భాగాలలో ఉన్నారు. ముందుగా యంత్రాల సహాయంతో మెటల్ షీటుని కారు బాడీ రూపం తెస్తారు. దానిని వెల్డింగ్ షాపులో కార్మికులు పొందిక చేస్తారు. అక్కడ నుండి అది పెయింట్ షాపుకి వెల్తుంది. పెయింటింగ్ విధానము సగం యంత్రాల ద్వారా జరుగుతుంది. అసెంబ్లింగ్ యూనిట్‌లో అన్ని భాగాలు అమరిక జరుగుతుంది. సైగింగ్, మెష్టింగ్ ఆ తర్వాత బ్రేకులు, పెడల్స్, స్టీరింగ్ అలా వరుసగా అమర్చబడతాయి. కన్వేయర్ బెల్టు ద్వారా కార్లు కార్మికుల దగ్గరకు వస్తాయి. ఎవరు దేనిని అమర్చాలో వారు ఆ పని చేయాలి. అవే రోజంతా చేయాలి. సుమారుగా 35 నుండి 40 సెకండ్ల పాటు కారు కార్మికుల దగ్గర ఆగుతుంది. ఒక కార్మికుడు బ్రేకు, పెడల్ అమర్చే పని అయితే అదే రోజుంతా చేస్తూ ఉండాలి. 8 నుండి 10 బోల్టులు ప్రతి కారుకి.. కారు తర్వాత కారు నలభై సెకండ్లకొక కారు చొప్పున 8గంటల పాటు అలా చేస్తూనే ఉండాలి. అది ఒక నాట్యంలా ఉంటుంది. ఆ నాట్యం నిరం తరం 8 గంటల పాటు చేయాలి. స్క్రూ గన్ చేతిలో పెట్టుకుని అమర్చటం వెనక్కి పరిగెత్తటం ఇంకొక బోల్ట్‌ని అందుకోవటం మళ్లీ కారు దగ్గరికి పరిగెత్తటం ఒక రకంగా అవి ఎరోబిక్స్ లాగా ఉంటాయి.

మెనేసర్ ప్లాంట్ నాకు తెలిసినంత వరకు ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా కార్లను ఉత్పత్తి చేసే కార్మగారం. నిజానికి కన్వేయర్ బెల్ట్ ఎక్కడా ఆగదు. మేము దానితో పాటు కదులుతూ, మళ్లీ ఇంకొక పని అందుకోవటానికి వెనకకు పరిగెడతాము. మేము మెషిన్‌ని నియంత్రించం. మెషిన్ మమ్మిల్ని నియంత్రిస్తుంది. దానికి తగ్గట్లు మేము నాట్యం చేయాలి. అందువలన మంచి నీళ్ళు త్రాగాలన్నా వీపు గొక్కావాలన్నా గ్యారంటీగా ఒకటి రెండు కార్లు అందకుండా పోతాయి. ఇటువంటి పనిపద్ధతిలో నిజంగా నీకు దాహం వేసి నీళ్ళు తాగాలంటే కార్లు మిస్సవకుండా నీళ్ళు తాగాలంటే కనీసం 45 నిమిషాలు పడుతుంది. కన్వేయర్ బెల్ట్ మీద కార్మికులకు మంచి నీళ్ళు బాటల్స్‌ని పంపుతూ ఉంటారు.

ఈ సమస్య వింటుంటే హాస్యస్పదంగా ఉంటుంది. కాని కారు మిస్సయితే మటుకు పరిస్థితి హాస్యస్పదంగా ఉండదు. ఒక్కసారి ఊహించండి! డ్యూటీ అయిన తర్వాత సూపర్ వైజర్ మమ్మల్ని ఒక్క కారు ఎందుకు మిస్సయిందిని ప్రశ్నంచాడానుకోండి! ఏమని చెబుతావు. నేను వీపు గొక్కవడానికి నాలుగు సెకన్ల కాలం వాడుకోవటం వలన కారు మిస్సయిందని చెబుదామా? అంతకన్నా దౌర్భాగ్య పరిస్థితి మనిషికి ఇంకేమన్నా ఉంటుందా? తిట్ల పురాణాలు దూషణలు వార్నింగ్ లెటర్లు దర్శనిమిస్తాయి.

మనిషి తప్పు చేయటం అనేది అసంభవం. నువ్వు ఎందుకు పని చేయలేక పోతున్నావు. మిగితా వారందరు పని చేస్తున్నారు కదా? నువ్వే ఎందుకు టాయిలెట్ కు వెళ్ళాలి? మాములుగానే ఈ పరిస్థితి ఒక వేళ కడుపులో తేడా వచ్చి విరోచనాలు పట్టుకుంటే మమ్మల్ని భగవంతుడే కాపాడాలి. కార్మికులను మంచి నీళ్లు తాగనివ్వండని వేడుకోవాలి.

మేనేజర్లు, సూపర్‌వైజర్లని ఆదేశిస్తారు. ఒకవేళ ఎవరయినా మంచినీళ్లు తాగే సమాన్ని రాబట్టుకుని తాగితే, వారిని గుర్తించి మర్నాడే వారి పనిబారాన్ని మరింత పెంచుతారు. సి.సి. కెమేరాల ద్వారా నిరంతరం మమ్మల్ని గమనిస్తూ, మరింత శ్రమని పిండటానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. నీకు ఎంత ధైర్యం ఉంటే ఐదు సెకండ్ల కాలాన్ని సంపాదించి, మంచినీళ్లు తాగుతున్నావు? అది వారికి రుచించదు. నిజంగా మలమూత్రములకి వెళ్లాలని కార్మికుడు అభ్యర్ధించినా, సూపర్‌వైజర్ అంగీకరించడు. నువ్వెలాగైనా చేసుకో, నేను మటుకు పంపను అంటాడు. దాని ఫలితంగా కార్మికుడు దుస్తులలోనే మూత్ర విసర్జన చేయటం, కొన్ని సందర్బాలలో మలవిసర్జన కూడా అనివార్యమవుతుంది. ఈ పని పరిస్థితులకి కార్మికుల దగ్గర ఉన్న సమాధానం, మార్గం అదొక్కటే. యాజ సిద్ధాంతం ప్రకారం ఓవర్‌టైమ్ అంటే రేటు కేవలం రూ. 17 మాత్రమే. నువ్వు గంట లేదా రెండు గంటలు చేయి, నీకిచ్చేది రూ. 17 మాత్రమే. పనిచేసే ఎనిమిది గంటలలోగాని, అదనపు గంటలలోగాని ఒక్క మిల్లీసెకను కూడా పనికి రాకుండా పోకూడగని మారుతీ నిర్ణయం. కాని వారిచ్చేది రూ. 17 మాత్రమే. ఓవర్‌టైమ్ పనిని రెండు భాగాలుగాచేసి, ఒకే గంట షిఫ్టు ముందు ఒక గంట షిఫ్టు తర్వాతి చేయిస్తాయి. ఈ అదనపు పనికి కూడా ఒక సెకను ఆలస్యంగా వచ్చినా, ఆ రోజు జీతంలో సగం కోత కోస్తారు. చలికాలంలో ఓవర్‌టైమ్ చేసిన కార్మికుడికి, తరుచుగా హోండాచౌక్ వద్ద జరిగే

> **"మెనేసర్ ప్లాంట్ నాకు తెలిసినంత వరకు ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా కార్లను ఉత్పత్తి చేసే కార్మగారం. నిజానికి కన్వేయర్ బెల్ట్ ఎక్కడా ఆగదు. మేము దానితో పాటు కదులుతూ, మళ్లీ ఇంకొక పని అందుకోవటానికి వెనకకు పరిగెడతాము. మేము మెషిన్‌ని నియంత్రించం. మెషిన్ మమ్మిల్ని నియంత్రిస్తుంది. దానికి తగ్గట్లు మేము నాట్యం చేయాలి. అందువలన మంచి నీళ్ళు త్రాగాలన్నా, వీపు గొక్కావాలన్నా గ్యారంటీగా ఒకటి రెండు కార్లు అందకుండా పోతాయి."**

**“ శెలవు అడగటం ఒక పెద్ద నేరం. ఒకవేళ కార్మికుడి తండ్రి కనుక చనిపోయి అతను ఇంటికి పరిగెత్తాలని ఆదుర్దాగా కనిపిస్తే అతనికొచ్చే సమాధానం, “ఎలాగూ వచ్చావు. షిఫ్టు పూర్తి చేసుకుని వెళ్లు. నువ్వు ఇప్పుడు బయల్దేరినా, ఇంటికి చేరేసరికి అంత్యక్రియలకు అందుకోలేవు.” ఒకవేళ నీకు అత్యంత ఆప్తులెవరయినా చనిపోతే నీకు లభించే శెలవులు మూడు మాత్రమే. అవి దాటితే నిన్ను ఫోను ద్వారా వెంటాడుతూ ఉంటారు. ”**

ట్రాఫిక్ జామ్‌ల వలన ఇంటికి ఆలస్యంగా చేరటం వలన కేవలం 6 గంటల విశ్రాంతి మాత్రమే దొరుకుతుంది.

శెలవు అడగటం ఒక పెద్ద నేరం. ఒకవేళ కార్మికుడి తండ్రి కనుక చనిపోయి అతను ఇంటికి పరిగెత్తాలని ఆదుర్దాగా కనిపిస్తే అతనికొచ్చే సమాధానం, ఎలాగూ వచ్చావు. షిఫ్టు పూర్తి చేసుకుని వెళ్లు. నువ్వు ఇప్పుడు బయల్దేరినా, ఇంటికి చేరేసరికి అంత్యక్రియలు అందుకోలేవు. ఒకవేళ నీకు అత్యంత ఆప్తులెవరయినా చనిపోతే నీకు లభించే శెలవులు మూడు మాత్రమే. అవిదాటితే నిన్ను ఫోను ద్వారా వెంటాడుతూ ఉంటారు. జీవితాంతం నువ్వు నీ గ్రామంలో ఉండిపోదల్చుకున్నావా? అని మొదటి ప్రశ్నవస్తుంది.

ఇతర పరిశ్రమలు కొంచెం మెరుగైన వసతులు కల్పిస్తున్నాయి. అప్పుడప్పుడు మారుతిని కాపీ చేసే ప్రయత్నం చేస్తుంటాయి. మారుతే తన విధానాలను నమ్ముకోండా ఇతర పరిశ్రమల మీద ప్రభావం చూపుతోంది. ఇటువంటి పరిస్థితులలో మేము మారుతి కోసం కార్ల ఉత్పత్తి చేస్తున్నాము. అది మారుతి స్విఫ్ట్, స్విఫ్ట్ డిజైర్, ఏ–స్టార్ మొదలైనవి.

ఈ రకమైన నిర్బంధకర పనివిధానం మాకు యూనియన్ పెట్టాలనే ఆలోచనకు దారితీసింది. మాకు ఇప్పటికే ఒక యూనియన్ ఉంది. దానిని మేం యాజమాన్య తొత్తుల యూనియన్‌గా పిలుచుకుంటాము. అదంతా వారి మనుషుల నుంచి ఉంటుంది. ఎప్పుడూ ఎన్నికలు జరగలేదు. ఈ యూనియన్ నిజానికి గుర్గావ్‌ప్లాంట్‌లో ఉంటుంది. మేము పనిచేసేది మనేసర్‌లో. అయినా మా చేత కాగితాలమీద సంతకాలు చేయించుకుని సభ్యత్వం చూపిస్తారు. అందువలనే మేము మాకొక యూనియన్ కావాలనుకున్నాము. మా సమస్యలను అది పరిష్కరించాలని కోరుకున్నాము. కాని, దాన్ని మారుతి వద్దని కోరుకుంది. అందుకు జరిగిన పరాణామమే ఈ అమానుష మార్గము. అప్రెంటిస్‌షిప్ కాలంలో నన్ను ఎన్నోసార్లు శిక్షించారు. నిరంతరం ఆడుతూనే ఉండేవారు. అప్పుడప్పుడూ వార్నింగ్ లెటర్లు ఇచ్చేవారు. నిజంగా నేను అంతపనికిమాలిన వాడిని అయితే నాకు ఉద్యోగం ఎందుకు ఇచ్చారు? ఇదంతా ఎందుకు చేస్తారంటే, నాకు యజమాని ఉన్నాడనీ, అతనికి గులామ్‌గిరి చేయటం వంటి బుట్టాలనీ, తల వంచి పనేఇచేయాలనీ. అందుకే మేము యూనియన్ పెట్టాలనీ, ఇన్ని సంవత్సరాలుగా వారు మాపై చూపిన నిరంకుశ వైఖరిని మార్చాలనీ నిర్ణయించుకున్నాము. మారుతీ విధానం లేదా మారుతీ మార్గం అవి ఏదైతే అమలవుతోందో దానిని మార్చాలని తలచాము.

మనేసర్ ప్లాంట్‌లో నేను 2007లో చేరినప్పుడు నా ప్రారంభ జీతం రూ. 3,500. 2008లో నాకు 4,500, 2009లో 5,500 ఇచ్చారు. ప్రతి సంవత్సరం వెయ్యి రూపాయలు పెంచారు. ఈ మూడు సంవత్సరాలు నేను ట్రైనీలాగే ఉన్నాను (ఉంచారు). మీరు ఎప్పుడయినా, ఇలాంటి 3 సంవత్సరాల ట్రైనింగ్ గురించి విన్నారా? హక్కుల గురించి మాట్లాడే రకమో కాదో చూసుకోవటానికి, ఎప్పుడు పడితే అప్పుడు తొలగించటానికి ఈ ట్రైనింగ్ విధానం – వారి లెక్కల ప్రకారం ఒక కార్మికుడిని అంచనావేసి, వారికనుగుణంగా మార్చుకోవటానికి కనీసం 3 సంవత్సరాలు పడుతుందని. అదీ లెక్క?

ఆర్థిక సంవత్సరం అవగానే కార్మికుడి పనితీరుని లెక్క వేస్తారు. దాని ప్రకారం చాలా మంది కార్మికులు 3 లేదా 4 సంవత్సరాలు ఒకే పనిలో ఉండిపోతారు. దానిని మొదటి శిక్షణాకాలంగా పరిగణిస్తారు. లేదా టెక్నీషియన్ ట్రయినింగ్ అంటారు. జీతం రూ. 3,500 మాత్రమే ఉంటుంది. ఒక విద్యార్థి పదే పదే తప్పితే ఎలా ఉంటుందో అలాగ దీని తర్వాత వారిని తొలగిస్తారు. దాదాపు 30 శాతం మంది ఇలా శిక్షణా కాలంలోనే తొలగించబడతారు. ఇంకొక పదిశాతం ఉండలేక వెళ్లిపోతారు. 2010 సంవత్సరంలో నన్ను పర్మినెంట్ చేసారు. ఇప్పుడు నా జీతం పదిహేనువేలు. అప్పటి నుండి పెరగకుండా అలాగే ఉంది. కానీ ఈ పదిహేను వేలు కూడా శాశ్వతం కాదు. నా బేసిక్ జీతం కేవలం రూ. 5001. ఇన్‌సెంటివ్ పేరుతో రూ. 8,000 ఉంటుంది. ఈ వసతి నువ్వు ఫ్యాక్టరీలో ఎన్ని కార్లని ఉత్పత్తి చేశావు అన్నదానిమీద ఆధారపడి ఉంటుంది. కాని అదే సందర్భంలో అసలు కార్మికుడికి తాను ఎన్నికార్లని ఉత్పత్తి చేశాడో అవగాహన ఉండకపోవటం, అసలు ఈ ఇన్‌సెంటివ్ విధానానికి ఉన్న ప్రమాణాలు వాటి మతలబులు తెలియక పోవటం వలన పెద్ద మొత్తంలో నష్టపోతుంటాడు. మా జీతాలు బ్యాంక్ అకౌంట్‌లో పడుతుంటాయి. పడిన దానిని గురించి ప్రశ్నించే తత్వం ఉండకూడదని కూడా మాకు బోధిస్తారు.

ఈ ఉద్యోగాన్ని వదిలేద్దామన్న ఆలోచన నాకెప్పుడూ రాలేదు. వేరే ఏదో చేయగలననే ఆలోచన కూడా నాకు లేదు. ఎక్కడికి వెళ్లగలను? రెండు సంవత్సరాలు ఐ.టి.ఐ.లో శిక్షణ పొంది ఈ ఉద్యోగం సంపాదించాను. నాకొక్కటే కోరిక. మామీద రుద్దబడుతున్న మానసిక ఒత్తిడిని ఎలాగయినా తగ్గించాలని. ఉద్యోగం వదిలేసి మళ్లీ గ్రామానికి వెళ్లాలన్నా కుదరని పని. ఎందుకంటే నాకు మనేసర్‌లో ఉద్యోగం రాగానే పెళ్లి చేసుకున్నాను. పెళ్లి ముందురోజే నేను మా ఊరుకి వెళ్లగలిగాను.

కంపెనీ మాకు తొమ్మిది సాధారణ లీవులు, పన్నెండు సీక్ లీవులిస్తుంది. కాని మా జీతంలోని రూ. 8000 ఇన్‌సెంటివ్ ఎలా రూపొందించారంటే. నీకు కనుక ఒక రోజు లీవుపెడితే, ఆ 8 వేలలో రూ. 1500 కోత విధిస్తారు. అందువలన కాగితం మీద ఒక 21 సెలవులు కనిపించినా, ఆ భారీ కోతలను చూసి లీవు పెట్టడానికి భయపడే పరిస్థితి కల్పించారు. దీనికన్నా రోజువారి కూలీ చేసుకునే వాడికే మంచిది. ఎందుకంటే వాడు ఏరోజు మానేస్తే ఆరోజే వేతనం రాదు. కాని ఇక్కడ నెలలో పొరపాటున 3రోజులు సెలవు పెడితే నీ ఇన్‌సెంటీవ్ మొత్తం లేదా నీ జీతంలో సగం కోత పడిపోతుంది. ఒకవేళ ఎలక్ట్రానిక్ యంత్రం నీరాకను ఒక సెకను తేడాగా చూపినా ఆ రోజు నీకు సగం వేతనమే. అంతేకాదు అదనంగా 3గంటలు పనిచేయాలి. కాని దానికి మటుకు వారిచ్చేది రూ. 171 మాత్రమే.

మొదటి నుండి ఈ రకమైన పని విధానం అలాగే కొనసాగుతోంది. కాని 2011 వచ్చే

సరికి ఇక మేము భరించలేకపోయాము. దీనిని ఎదుర్కోడానికి నిర్ణయించుకున్నాము. ప్రభుత్వం మీద కూడా ఒత్తిడి తేవాలని ఆలోచించాము. 2012 జూన్ 3వ తేదీ హర్యానా ప్రభుత్వం కార్మిక శాఖలో మా యూనియన్ రిజిస్ట్రేషన్‌కి దరఖాస్తు చేసాము. ఆ మర్నాడే మారుతీ ఫ్యాక్టరీలో యూనియన్ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించింది. మేము ఇన్నాళ్లుగా అడుగుతున్నా పట్టించుకోలేదు. కాని మధ్యాహ్నం పన్నెండు కల్లా  మళ్లీ మనసు మార్చుకున్నారు. కార్మికులందరికీ ఒక కాగితం అందించారు. అందులో సారాంశం, మీ యూనియన్‌కి ఎన్నికలు అవసరం లేదని, ఉన్న యూనియన్ బాగా పని చేస్తోందని సూపర్‌వైజర్లు ఒక్కొక్క కార్మికుని గదిలోకి పిలిచి సంతకమైనా చేయి లేదా రాజీనామా చేయి అని బెదిరించటం ప్రారంభించారు.

ఏ నాయకత్వాన్ని మేము ఎంచుకుని వారి ద్వారా సమస్యలు మీద పోరాటం చేయాలనుకున్నామో, వారి  ప్రతిపాదన మేరకు మేమే మొట్టమొదటిసారి జూన్4వ తేదీ 2011న సమ్మెలోకి వెళ్లాము. యజమాన్యానికి మేము పెట్టిన డిమాండు ఒక్కటే: మీరు పంపిన కాగితం వెనక్కి తీసుకోండి, బలవంతంగా కార్మికుల చేత సంతకాలు చేయించకండి. అలాగయితే మేము సమ్మె విరమించుకుంటామని తెలిపాము. అలా సమ్మె 13 రోజులపాటు జరిగింది. కాంట్రాక్ట్ నుండి శాశ్విత కార్మికులు సుమారు 300 మంది సమ్మెలో పాల్గొన్నారు. మా షిఫ్టు సమయంలో షాప్ ఫ్లోర్‌లోకి వెళ్లి అక్కడే కూచుని పనిచేయకుండా సమ్మె చేశాము. యాజమాన్యం టీ, భోజనం ఆపేసింది. మంచినీళ్లు తాగడానికి అనుమతించారు. అలా షాప్ ఫ్లోర్‌లో 13 రోజుల పాటు కూచోవడం వింతగా ఉంది. అయినా తప్పలేదు. పట్టుదలతో చేసాము. ఎందుకంటే బయట ఉండేదానికన్నా ఇదే సరి అయినది. ఒక రకంగా అలా కూచోటం వలన యాజమాన్యం వేరే కాంట్రాక్ట్ కార్మికులను తెచ్చి పని చేయించడానికి కూడా కుదరని పరిస్థితి అది కల్పించాము.

మా నాయకుడు సోనూ గుజ్జాల్. అతనే అందరినీ కదిలించాడు. కార్మిక శాఖలో దరఖాస్తు  కూడా అతనే చేశాడు. సమన్వయ కమిటీలో నాయకుడిగా అతడు, కార్యదర్శిగా శివకుమార్ ఉన్నారు. 13వ రోజున యాజమాన్యం మా యూనియన్ రిజిస్ట్రేషన్‌కి తాము ఇక అడ్డు రాబోమని ప్రకటించింది. మా ప్రధాన డిమాండ్ నేరవేరింది. కాబట్టి సమ్మె విరమించి పనిలోకి వచ్చాము. అప్పుడు అర్థమయింది

**“మొట్టమొదటిసారి మేము జూన్4వ తేదీ 2011న సమ్మెలోకి వెళ్లాము. యజమాన్యానికి మేము పెట్టిన డిమాండు ఒక్కటే: మీరు పంపిన కాగితం వెనక్కి తీసుకోండి, బలవంతంగా కార్మికుల చేత సంతకాలు చేయించకండి. అలాగయితే మేము సమ్మె విరమించుకుంటామని తెలిపాము. అలా సమ్మె 13 రోజులపాటు జరిగింది. కాంట్రాక్ట్ నుండి శాశ్విత కార్మికులు సుమారు 300 మంది సమ్మెలో పాల్గొన్నారు.”**



**యంత్రాలకు నట్లూ, బోల్టులు బిగించి కార్మికులు కూడా యంత్రాల్లా మారిపోయారు**

మాకు. 2011 నుండి మారుతిలో ఏం జరుగుతుందో అర్థం చేసుకోవాలంటే ముందు మాకు గుర్గావ్ ఫ్యాక్టరిలో 2000లో ఏం జరిగిందో తెలియాలి. అందుకనే నా మిత్రుడు రాజీష్ గోస్వామిని మీకు పరిచయం చేస్తాను. 2000 సంవత్సరంలో అతను ఫ్యాక్టరీ నుండి తొలగించబడ్డాడు.

**రాజేష్ కథ**

నేను హర్యానాలో సోనేసట్ వాసిని. మారుతి కంపెనీ 1983లో గుర్గావ్‌లో ప్రారంభమయింది. నేను 1992లో దానిలో చేరాను. ప్రారంభంలో సుజుకి వాటా 26 శాతం గాను ప్రభుత్వ వాటా 74 శాతంగా ఉండేది. దేశంలో అప్పటికి చిన్నకారు లేదు. మారుతి 800కి ప్రత్యామ్నాయం లేదు. ఐదు సంవత్సరాలలోనే దిగ్విజయంగా నిలదొక్కుకుంది. ప్రపంచ కార్ల ఆగమనం 91 సరళీకృత ఆర్థిక విదానాలు వచ్చిన తరువాతే ప్రారంభమయ్యాయి. అందు వలన మారుతి గుత్తాధిపత్యం చాలాకాలం కొనసాగింది. ఈ మధ్యకాలంలోనే కార్మిక సంఘం ఏర్పడింది. యాజమాన్యం మంచిగా ఉండడం వలన చాలా తక్కువ సమస్యలే ఉండేవి.

1992లో సుజుకీ వాటా 50 శాతానికి, 2002లో 54.2 శాతానికి పెరిగింది. దానితో మెజారిటీ వాటాదారునిగా మారింది. ఇది జరగనంతకాలం కార్మికుల వాణి వినిపించేది, ఆలకింపబడేది. 80వ శకంలో ఇన్‌సెన్‌టివ్ ప్రకటించినపుడు, యాజమాన్యం, యూనియన్ సభ్యులతో చర్చించి, కార్మిక హక్కులు, చట్టాలకనుగుణంగా పాలసీని ప్రవేశ పెట్టింది. సంవత్సరానికి ఒక్కొక్క కార్మికుడు 25 కార్లను ఉత్పత్తి చేయాలని. ఆపై నుండి అతనికి అదనపు పారితోషికం ఇవ్వబడుతుందని ఒప్పందం. ఆ తర్వాత కాలంలో యాజమాన్యం ఏకపక్షంగానే పారితోషిక విధానాలను మారుస్తూ వచ్చింది. 1995లో ప్రభుత్వ వాటా కుదింపుకు వ్యతిరేకంగా రెండు రోజుల పాటు సమ్మె జరిగింది. కాని అప్పటికే కార్మిక సంఘాలు కూడా యజమాని తొత్తులుగా మారిపోయాయి. ఈ సమయంలోనే వారు ఫ్యాక్టరీల సంఖ్య ఒకటి నుండి మూడుకి పెంచారు. 1993 వరకు

> **"నాకు ఆ సన్నివేశాలు, రోజులు దాదాపుగా గుర్తున్నాయి. ఎందుకంటే నేను ఇప్పటికీ కోర్టులో కేసు వేసి పోరాటం చేస్తున్నాను. అక్టోబరు 12వ తేదీ 2000న యాజమాన్యం ఒక అంగీకార పత్రం ఫ్యాక్టరీ గేటు బయటపెట్టింది. మొత్తం ఏరియా అంతా పోలీసుల పహారాలో ఉంది. ఢిల్లీ-గుర్గావ్ రోడ్డులో ట్రాఫిక్‌ను ఆపివేశారు. మారుతీ కార్మికుడు ఆ అడ్డుకుంలను దాటుకుని ఫ్యాక్టరీలోకి వెళ్ళాలంటే, ఆ కాగితం మీద సంతకం చేసి వెళ్ళాలి."**

అందరు కార్మికులు శాశ్వత ఉద్యోగస్తులుగా మారారు. ప్రొబేషన్ కాలం కేవలం ఆరు నెలలే ఉండేది.

1993లో కార్ల మార్కెట్ విస్తరణ వేగంగా పెరిగింది. యాజమాన్యం చేతిలో కార్మికులకు వేధింపులు ప్రారంభమయ్యాయి. అప్పుడే రెండు సంవత్సరాల శిక్షణాకాలం అనే వ్యవస్థ ప్రారంభమయ్యింది. రెండు సంవత్సరాల ఐ.టి.ఐ. శిక్షణ పొంది మూడో సంవత్సరం ట్రైనీగా ఉన్న మాకు మళ్లీ రెండు సంవత్సరాలు శిక్షణా కాలం ఎందుకు? కేవలం చౌకగా మా శ్రమ శక్తిని కొల్లగొట్టడానికి తప్ప వేరే లేదు. దీనిని ఎవరూ వ్యతిరేకంచలేదు. ఎవరినైతే ఈ పద్ధతిలో తీసుకుని ఉన్నారో వారు వ్యతిరేకించలేదు. దురదృష్టవశాత్తు శాశ్వత ఉద్యోగులు ఇది తమ సమస్య కాదని వదిలేశారు. 1995 నుండి తమ ఖర్చులు తగ్గించుకోవడానికి పెద్ద ఎత్తున కాంట్రాక్ట్ ఉద్యోగులను తీసుకోవటం ప్రారంభించారు. వీరందరు మాలాగే సమీప గ్రామాల నుండి, ఐ.టి.ఐలో శిక్షణ పొంది, మరో సంవత్సరం ట్రైనీగా శిక్షణ పొందిన వారే. వారికి అప్రెంటిస్‌గా ప్రభుత్వం రూ.500, మారుతీ రూ.1000 ఇచ్చేది.

1997 వచ్చేసరికి, ఇక శాశ్వత ఉద్యోగులందరినీ తొలగించి, ఖర్చులు తగ్గించుకోవాలని, మొత్తం ఉత్పత్తి చౌకగా వచ్చే కాంట్రాక్ట్ కార్మికులతో చేయించాలని అలా చేస్తే ఇక దోపిడీ గురించే ప్రశ్నించే వారు ఉండరనీ అనుకుంది. అప్పుడు వచ్చింది స్వచ్ఛంద విరమణ పథకం (సివిఆర్‌ఎస్). కొద్ది మంది అది తీసుకుని వెళ్ళిపోయారు. 2000 నాటికి యాజమాన్యం వేధింపులు తీవ్రతరం చేసింది. ఇన్‌సెంటివ్‌లో తీవ్రమైన దోపిడీ పద్ధతులు ప్రవేశపెట్టింది. అప్పుడు మొదలయింది తిరుగుబాటు. నినాదాలు, నిరాహార దీక్షలు, పనిముట్లు పక్కన పెట్టడం మొదలయ్యాయి. యాజమాన్యం ఒక్కొక్క కార్మికుడిని తొలగించటం ప్రారంభించింది. కార్మికుల పోరాటం సంఘటితమవ్వడం ఆరంభమయింది.

నాకు ఆ సన్నివేశాలు, రోజులు దాదాపుగా గుర్తు ఉన్నాయి. ఎందుకంటే నేను ఇప్పటికీ కోర్టులో కేసు వేసి పోరాటం చేస్తున్నాను. అక్టోబరు 12వ తేదీ 2000న యాజమాన్యం ఒక అంగీకార పత్రం ఫ్యాక్టరీ గేటు బయటపెట్టింది. మొత్తం ఏరియా అంతా పోలీసుల పహారాలో ఉంది. ఢిల్లీ-గుర్గావ్ రోడ్డులో ట్రాఫిక్‌ను ఆపివేశారు. మారుతీ కార్మికుడు ఆ అడ్డుకుంలను దాటుకుని ఫ్యాక్టరీలోకి వెళ్ళాలంటే, ఆ కాగితం మీద సంతకం చేసి వెళ్ళాలి. దాని ప్రకారం, మేము సమ్మె విరమించాలనీ, పనికి హాజరు కావాలనీ, డిమాండ్లు గురించి మాట్లాడేదేమీ లేదనీ రాసి ఉంది. మేము వ్యతిరేకించాము. సమ్మె దాదాపు 89 రోజులు జరిగింది. మా స్వతంత్ర కార్మిక సంఘం నిర్వీర్యమైంది. నాయకులందరు యాజమాన్యం వైపు మారిపోయారు. యాజమాన్యం కొత్త రిజిస్ట్రేషన్‌తో ఇంకొక యూనియన్ వీరితో ప్రారంభించింది. అయినా కూడా మొత్తం ఆరువేల మందిలో కేవలం 500 మంది మాత్రమే ఫ్యాక్టరీలోకి వెళ్ళారు. అంతకుమించి వారు ఏమీ చేయలేకపోయారు. మారుతీ మీడియా ద్వారా అబద్ధాల ప్రచారం ప్రారంభించింది. కార్మికులకు ఇప్పుడే రూ.23 వేల ఇస్తున్నామనీ, ఇప్పుడు రూ.33 వేలు ఇస్తామని ప్రతిపాదించామనీ, కాని వారు రూ. 42 వేలు డిమాండు చేస్తున్నారనీ సారాంశం.

ఈ కాలంలో మా సమ్మె శిబిరాన్ని సందర్శించని రాజకీయ పార్టీ లేదు. దేవగౌడ, వి.పి.సింగ్, చంద్రశేఖర్, వామపక్షాలు వారు అందరూ వచ్చారు. పార్లమెంటులో కూడా మూడు, నాలుగుసార్లు చర్చ జరిగింది. సి.పి.ఎమ్ నాయకులు బాసుదేవ్ ఆచార్య నాయకత్వంలో అఖిలపక్ష నాయకులు లోక్‌సభ స్పీకర్ జి.ఎమ్.సి.బాలయోగి సమక్షంలో చర్చలు జరిపి, కార్మికులు ఆ కాగితం మీద సంతకం చేయక్కర్లేదనీ, తొలగించిన వారినందరిని వెనక్కు తీసుకోవాలనీ నిర్ణయించారు. ఈ అంగీకారం స్పీకర్ ఛాంబర్‌లోనే జరిగింది. ప్రపంచంలోనే మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం, అత్యంత గౌరవప్రదమైన మన పార్లమెంట్, దానికి గురువైన స్పీకర్, మరో పక్క సుజుకీ. అది ప్రపంచంలో ఉన్న అనేక ఆటోమొబైల్ కంపెనీలలో కేవలం ఒక కంపెనీ మాత్రమే. ఎవరు సాధించారు? సుజుకీ అంగీకార పత్రాన్ని వెనక్కు తీసుకుంది. కాని తొలగించిన 36 మందిని తిరిగి తీసుకోలేదు.

2001 జనవరి 8వ తేదీన యాజమాన్యం, యూనియన్‌తో ఒప్పందం చేసుకుంది. ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు ఎటువంటి కేసులు వేసుకోరాదని, ప్రస్తుతం కాలం ఎటువంటి ఆర్థిక డిమాండ్లు ప్రస్తావించరాదని పేర్కొన్నారు. ఇది ఒక శాంతి ఒప్పందం. సమ్మెకాలం మూడు నెలల వేతనాలు కూడా అడగకూడదు. ఇన్ని ఒప్పుకున్నా జనవరి 9న కార్మికులు ఫ్యాక్టరీకి వెళ్ళగానే వారిపై వేధింపులు ప్రారంభమయ్యాయి. ఒప్పందాన్ని మరునాటి నుంచే ఉల్లంఘించింది యాజమాన్యం. తక్కువ కాలం సెలవులు తీసివేయబడ్డాయి. కార్మికులను తీసుకువచ్చే బస్సులను ఆపేశారు. 15 సంవత్సరాల పాటు వాటికి అలవాటు పడ్డ మేము స్వంతంగా రావటానికి ప్రయత్నం మొదలు పెట్టాము. వారి ఉద్దేశం మటుకు మేము లేటుగా రావడం, తద్వారా సగం వేతనం తగ్గించటం. కాని అది సగం కోల్పోవటం కాదు, దాదాపు మూడొంతులు పోగొట్టుకోవటమే. మీరు అనొచ్చు, 3/4 వంతులు జీతం పోతున్నప్పుడు, ఆ పూట పనే మానెయొచ్చు లేదా సెలవు పెట్టచ్చు కదా అని. కాని అలా పెడితే ఒకటిన్నర రోజు ఇన్‌సెంటివ్ కోతవేస్తారు. ఈ విధంగా నాకు దాదాపు రూ.1,500 నుండి రూ.2,000 వేల వరకు కత్తిరిస్తారు. దీనికి ఎటువంటి హేతుబద్ధత లేదు. యాజమాన్యం దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటుంది. ఇటువంటి ప్రశాంతత కోసమే మేము సంతకాలు చేయాల్సి వచ్చింది. ఆ రోజుకి కూడా గుర్గావ్‌కి బస్సు సౌకర్యం లేదు.

అంతకుముందు మాకు సంవత్సరానికి 16 సెలవులు ఉండేవి. అవి దాటితేనే ఇన్‌సెంటివ్‌లో కోత ఉండేది. ఒక అదనపు లీవుకి ఒక రోజు ఇన్‌సెంటివ్ కోత పడేది. అలా కోత పడ్డ డబ్బంతా ఒక ఉమ్మడి ఖాతాలో వేసేవారు. ఆ ఆర్థిక సంవత్సరం అయిపోయిన తరువాత ఆ డబ్బుని అందరికీ సమానంగా పంచేవారు.

ఈ సమ్మెకాలంలో పాల్గొన్న కార్మికులపైన ఎటువంటి చర్యలు తీసుకోబోమని చెప్పిన

యాజమాన్యం దానిని కూడా అతిక్రమించింది. దాదాపు 800 మందిపై అభియోగాపత్రాల మోపి ఎంక్వైరీ జరిపింది. ఒక్కొక్కళ్ళని పిలిచి, ఎంక్వైరీ ఎదుర్కొంటారా లేక స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తారా అని బెదిరించారు. మాతో పోట్లాడాలనుకుంటే రండి, చూసుకుందాం, ఇదీ వారి ధోరణి. వ్యాయామాలు సరిగ్గా చేయటం లేదనీ, టాయిలెట్స్‌కి ఎక్కువగా వెళుతున్నారనీ, వైద్య, ఆరోగ్య వసతులు తొలగించటం ప్రారంభించారు. ఇదంతా మమ్మల్ని బయటికి పంపడానికే.

> "ఈ సమ్మెకాలంలో పాల్గొన్న కార్మికులపైన ఎటువంటి చర్యలు తీసుకోబోమని చెప్పిన యాజమాన్యం దానిని కూడా అతిక్రమించింది. దాదాపు 800 మందిపై అభియోగాలు మోపి ఎంక్వైరీ జరిపింది. ఒక్కొక్కళ్ళని పిలిచి ఎంక్వైరీ ఎదుర్కొంటారా లేక స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తారా అని బెదిరించారు. మాతో పోట్లాడాలనుకుంటే రండి, చూసుకుందాం, ఇదీ వారి ధోరణి."



యాజమాన్యం వేధింపులు తాళలేక సమ్మెలోకి దిగిన మారుతి మానెసర్ ప్లాంటు కార్మికులు

నేను ఇప్పటికీ స్వచ్ఛంద విరమణ అంగీకరించలేదు. కోర్టులో పోరాడుతున్నాను. దాదాపు 1200 మంది కార్మికులు స్వచ్ఛంద విరమణ తీసుకుని వెళ్ళిపోయారు. వేరే ప్రత్యామ్నాయం ఏమీ చేయలేక నేడు వారందరి జీవితాలు ఛిద్రమైపోయాయి. కొన్ని సంవత్సరాల పాటు నట్లు, బోల్టులు బిగించిన తరువాత నువ్వు ఏ వ్యాపారం చేయడానికీ పనికిరావు. ఈ విధంగా యాజమాన్యం యూనియన్ అనే భావజాలాన్ని ఫ్యాక్టరీలో సర్వనాశనం చేసింది. 2002 ఆగస్టు 26, ఫ్యాక్టరీలో నా ఆఖరి రోజు.

**మళ్ళీ మొదటి పోరాటానికి వద్దాం:**

13 రోజుల సమ్మె తరువాత, మారుతీ యూనియన్ గుర్తిస్తానని చెప్పగానే మేము సమ్మె విరమించి పనిలోకి వచ్చాము. దాదాపు నెలన్నర కాలం ప్రశాంతంగా నడిచింది. అప్పుడు తెలిసింది మాకు, మారుతి కార్మిక శాఖను ప్రభావితం చేసి మా రిజిస్ట్రేషన్ దరఖాస్తును రద్దు చేయించిందని. మేము మళ్ళీ దరఖాస్తు చేశాము. వెంటనే యాజమాన్యం సమన్వయ కమిటీలో నలుగురిని సస్పెండ్ చేసింది. మేము నిరసన ప్రారంభించగానే, యాజమాన్యం మీరు నెల రోజులు బాగా పని చేయండి అప్పుడు వారిని వెనక్కి తీసుకుంటాము అని చెప్పారు. కనురెప్పలు కూడా ఆర్పకుండా దాదాపు రెండు నెలలు పని చేశాము. అయినా వారిని తీసుకోలేదు. మళ్లీ ఆగస్టులో మేము రెండవ సమ్మె ప్రారంభించాము. ఆ ఆదివారం, ఫ్యాక్టరీ మొత్తాన్ని జి.ఐ.షీట్‌తో కప్పేసి, ఒకే ఒక ద్వారం తెరచి ఉంచారు. మళ్లీ "మంచి నడవడిక" పత్రాన్ని పెట్టి సంతకాలు చేయమన్నారు. మేము చేయలేదు. పరిస్థితి మొదటికి వచ్చింది. దాదాపు 100 మంది కార్మికులను సస్పెండ్ చేసి లిస్టు అంటించారు. అయినా మేము 33 రోజుల పాటు సమ్మె కొనసాగించాము. అప్పుడు యాజమాన్యం లంగివచ్చి, మమ్మల్నందరినీ మళ్ళీ పనిలోకి అంగీకరించింది. కానీ, ఈసారి నేరుగా కార్మిక శాఖ అధికారి వచ్చి, మా అందరి చేత ఆ పత్రంపై సంతకాలు చేయించారు. మీరు దరఖాస్తు చేసిన యూనియన్ గుర్తింపు పత్రం నా దగ్గరే ఉంది. మీరేమి చేసినా, నేను గుర్తింపు ఇవ్వను. మర్యాదగా సంతకాలు చేయండి, లేదా తొలగటానికి సిద్ధమవ్వండి. ఇదీ ఆవిడిచ్చిన పిలుపు. ఇదీ కార్మిక శాఖ కమిషనర్.

తప్పనిసరి పరిస్థితుల్లో మేము మళ్లీ పనిలోకి వెళ్ళాము. కానీ ఈసారి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను లోపలికి అంగీకరించలేదు. మీరు రెండు లేదా మూడు రోజులు బాగా పని చేయండి. అప్పుడు వారిని తీసుకుంటాం అన్నారు. వారం రోజులయింది తీసుకోలేదు. మేము మళ్ళీ సమ్మె ప్రారంభించాం. పర్మినెంట్ అయినా, కాంట్రాక్ట్ అయినా అందరం ఒకే పని చేస్తున్నాం. అలాంటప్పుడు వారికి మేము మద్దతివ్వాలి కదా! వారు బయట కూచుని సమ్మె చేశారు. మేము లోపల కూచుని సమ్మె చేశాము. ఈసారి 17 రోజుల పాటు జరిగింది. ఈసారి యాజమాన్యం పోలీసులను కూడా తెచ్చింది. ఒకరోజు దాదాపు ప్రతి కార్మికుడికి ఏడు మంది పోలీసులు ఉన్నారు. హర్యానా రవాణా సంస్థ బస్సులను కూడా తెచ్చారు. బహుశా మమ్మ ల్నందరిని తీసుకెళ్ళి, లాకౌట్ ప్రకటించేలా ఉన్నారు. జిల్లా పోలీసు కమీషనర్, కార్మిక శాఖ కమీషనర్, ఇతర పోలీసు అధికారులందరూ వచ్చారు. మమ్మల్ని ఆ ప్రాంతం ఖాళీ చేయమని లేదంటే లాఠీఛార్జి చేస్తామని ప్రకటించారు.

మా సమన్వయ కమిటీ నాయకులు బయట ఉండటం వలన, మేము లోపల వేరే కమిటీ ఎంచుకున్నాము. బయట నుండి వారు మమ్మల్ని ఖాళీ చేయమని సందేశం పంపారు. పోలీసులు కూడా కోర్టు ఆర్డర్ తీసుకువచ్చి మమ్మల్ని ఖాళీ చేయమన్నారు. అక్టోబర్ 13, 2011న ఈ చర్యలు ప్రారంభమయ్యాయి. మేము 17వ తేదీన బయటికి వచ్చాము. 18వ తేదీ కర్వాచౌత్

> **"మేము సమ్మెలు చేసినప్పడల్లా, మారుతీ యాజమాన్యం మమ్మల్ని జీతం ఎంత పెంచమంటారో చెప్పండి అని అడిగేది. ఎంతకావాలో తీసుకోండి కానీ, యూనియన్ గురించి మాట్లా డవద్దనేది. మా ఇళ్ళకు, తల్లిదండ్రుల దగ్గరకు, భార్యా పిల్లల దగ్గరికి మనుషులను పంపేది. మీ అబ్బాయి లాఠీఛార్జికి గురి అవుతాడు, ఉద్యోగం పోతుంది, కేసులు పెడతారు అని బెదిరించే వారు. అలాగే కులాలు, మతాలు, ప్రాంతాల వారీగా కూడా విడగొట్ట టానికి ప్రయత్నం చేసేవారు."**

కావటం వలన, రెండు రోజుల తర్వాత మేము సమావేశమయ్యాము. ఈ రెండు మూడు రోజుల లోనే మేము గ్రహించే లోపే ఏదో జరిగింది. మా సమన్వయ కమిటీ సభ్యులను కొనేశారు. సోను గుజ్జార్, శివకుమార్ ఇంకా ఇతరులతో యాజమాన్యం చెప్పిందేమిటంటే, మిమ్మల్ని ఎలాగూ తీసుకోము కాబట్టి, మీరు డబ్బులు తీసుకుని వెళ్ళిపోండని మభ్యపెట్టింది. నిజంగా ఎంత తీసుకున్నారో తెలీదం కాని, మాకు తెలిసిన దాని ప్రకారం ఒక్కొక్కరికి 16 లక్షలు ముట్టాయని, దాంతో వారు మాయమయ్యారని అర్థమయింది. సమ్మె మళ్లీ విచ్ఛిన్నమయింది. మళ్ళీ మేము పనిలోకి వెళ్ళిపోయాము.

మళ్ళీ భవిష్యత్తులో యూనియన్ రిజిస్ట్రేషన్ జరగకూడదనీ, సమన్వయ కమిటీలు ఏర్పడకూడ దనీ భావించి, మమ్మల్ని యాజమాన్యం పని ప్రదేశాలను, షిఫ్టులను మార్చివేసింది. అసెంబ్లీ కార్మికులను పెయింటింగ్ విభాగానికి, పెయింటింగ్ వారిని వెల్డింగ్ దానికి మార్చివేశారు. కాని నవంబరు 3వ తేదీన మళ్లీ కొత్త సమన్వయ కమిటీ వేసి, మళ్ళీ యూనియన్ రిజిస్ట్రేషన్ దరఖాస్తు కార్మిక శాఖకు పంపాము. మా మీద చాలా పర్యవేక్షణ ఉండటం వలన చాలా సీక్రెట్‌గా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశాము. విజిలెన్స్ వారు, పోలీసు వారు మమ్మ ల్ని వెంటాడుతూనే ఉన్నారు. అర్ధరాత్రులలోను, షిఫ్ట్‌ల మధ్యకాలంలో కార్మికుల సంతకాలు సేకరించాము.

యూనియన్ రిజిస్ట్రేషన్ తప్పదు. కాని దానిని కాకుండా పొడిగించడం ఒక లక్ష్యంగా యాజ మాన్యం పని చేసింది. షాప్ ఫ్లోర్‌లో మా మీద జులుం తగ్గించింది. చట్ట ప్రకారం 45 రోజులు దాటి పోయినా, ఇవాళో, రేపో అవుతుందనే నమ్మకంతో మేము వేచి ఉన్నాము. ఎట్టకేలకు కార్మిక శాఖ మారుతి సుజుకీలో మా యూనియన్ ఫిబ్రవరి 2012 ఆఖరులో గుర్తించి రిజిస్ట్రేషన్ నెంబరు వచ్చింది (రి.జె.నె.1927). ఈ కాలమంతా మేము ఎటువంటి కార్యక్రమాలు ఫ్యాక్టరీలో చేయలేదు. మొత్తం కాలం కార్మిక శాఖ అధికారుల మీద ఒత్తిడి పెంచేలా చేశాము.

మేము సమ్మెలు చేసినప్పుడల్లా, మారుతీ యాజమాన్యం మమ్మల్ని జీతం ఎంత పెంచ మంటారో చెప్పండి అని అడిగేది. ఎంతకావాలో తీసుకోండి కాని, యూనియన్ గురించి మాట్లాడ వద్దనేది. మా ఇళ్ళకు, తల్లిదండ్రుల దగ్గరకు, భార్యా పిల్లల దగ్గరికి మనుషులను పంపేది. మీ అబ్బాయి లాఠీఛార్జికి గురి అవుతాడు, ఉద్యోగం పోతుంది, కేసులు పెడతారు అని బెదిరించే వారు. అలాగే కులాలు, మతాలు, ప్రాంతాల వారీగా కూడా విడగొట్టటానికి ప్రయత్నం చేసేవారు.

ఏదైతేనే మొత్తానికి యూనియన్ రిజిస్ట్రేషన్ అయ్యింది కాబట్టి, 23 డిమాండ్లతో వినతిపత్రాన్ని సమర్పించాము. మాకు రిలీవర్స్ పెట్టుకునే సౌకర్యం ఒక్కదానికే యాజమాన్యం అంగీకరించింది. మా మీద కొంత ఒత్తిడి తగ్గింది. ఓవర్‌టైమ్ చేయాలనే ఒత్తిడి కూడా మా మీద లేదు. మా ప్రధాన డిమాండు మటుకు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని. ఆ తర్వాత డిమాండు మా జీతాల గురించి. 1998లో మారుతీ కంపెనీ సంవత్సరానికి 80వేల కార్లను ఉత్పత్తి చేసినపుడు కార్మికుడి జీతం 18 వేలు ఉండేది. ఇప్పుడు మారుతీ 15 లక్షల కార్లు ఉత్పత్తి చేస్తుంటే, మా జీతం 15 వేలే ఉంది (2012కి) అందుకని మా బేసిక్ జీతం 25 వేలు ఉండాలని, ఆపైనే ఇన్‌సెంటివ్ ఉండాలని మా డిమాండ్. కాని పత్రికలు, మీడియా మా డిమాండ్లను వక్రీకరిం చాయి. ప్రతి కార్మికుడికి లక్ష రూపాయలు అడుగుతున్నారని ప్రచారం చేశాయి. మీ అందరికీ తెలుసు, ద్వైపాక్షిక రాయబారాలలో ఎప్పుడూ ఎక్కువ మొత్తంతో ప్రారంభమై, ఆ తర్వాత క్రిందకు వచ్చి ఎక్కడో ఒక చోట ఒప్పందాలు జరుగుతాయని. మారుతీని వదిలి హోండాలో చేరిన కార్మికులకి ఈ రోజు 32 వేల వేతనం లభిస్తోంది. రవాణా సౌకర్యం, రిలీవర్స్, లీవులు, 8 గంటలు పనిలో 15 నిమిషాలు విశ్రాంతి కోరాము.

సాలీనా జరిగే సమీక్ష తరువాత ఏప్రిల్‌లో మా జీతాలలో ఎటువంటి మార్పులు రాకపోయే సరికి, మే నెలలో మా డిమాండ్లను అందజే శాము. ఇప్పుడు యాజమాన్యం మమ్మల్ని అడగటం ప్రారంభించింది. ఏంటి మీరు సమ్మెలోకి వెళ్ళటం లేదా? అని. ఈ కార్మికులకి యూనియన్ గుర్తింపు ఇచ్చినా, వీళ్ళు సమ్మెలు చేస్తూనే ఉన్నారని ప్రపంచానికి ప్రచారం చెయ్యటానికి మమ్మల్ని రెచ్చగొడుతోంది. యాజ మాన్యాలు ఎప్పుడూ సమ్మె వలన జరిగే తాత్కా లిక నష్టం గురించి ఆలోచించవు. దీర్ఘకాలి కంగా ఆ సమ్మెల వలన ఒప్పందాలు జరిగితే మాకిచ్చే వేతనాల వలన వారికొచ్చే నష్టం గురించి ఆలోచిస్తాయి. ఇక ఎట్టి పరిస్థితులలో యూనియన్ ఉంచకూడదని నిర్ణయించుకుని ప్రచారం మొదలు పెట్టారు. మా యూనియన్ అధ్యక్షుడు రామ్‌మెహర్, కార్యదర్శి సరబ్‌జిత్ అమ్ముడుపోయాడని ప్రచారం చేశారు. కాని అలా జరగలేదు. మేము కూడా ఒత్తిడి పెంచటం వలన ప్రతి సోమవారం, గురువారం చర్చలు జరపటం ప్రారంభించారు. అలా దాదాపు 17 నుంచి 18 సమావేశాలు జరిగాయి. ఊరికినే సమయం గడపటం తప్ప వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రతి సమావేశంలో అన్ని డిమాండ్లు చదవటం, వాటిపై చర్చించి మరల వచ్చే సమావేశంలో చెప్తామనటం? కాంట్రాక్టు కార్మికులు, ఈ ఒప్పందాలలోకి రారు కాబట్టి చర్చే లేదనటం. ఇలా ఏ ఒక్క డిమాండుని అంగీకరించలేదు. వారి టీములో మానవ వనరుల శాఖ అధికారి అవినాష్ కుమార్ మరో 15 మంది అధికారులు, మావైపు నుండి ఎనిమిది మంది కమిటీ సభ్యులు పాల్గనే వారు.

మా ఆఖరి సమావేశం జులై 16న జరిగింది. అందులో వారిచ్చిన పరిష్కారం సంవత్సరానికి పదివేలు పెంచగలమని. అదీ ఇతర పారితోషికాలైన బూట్లు, బట్టలు, దీపావళి బహుమతులు అన్ని కలిపి ఆ పదివేలలోనే ప్రకటించారు. బేసిక్ జీతంలో పెరుగుదల రూ.400 మాత్రమే. మేమిచ్చేది ఇంతే, ఇక మీరేం చేసుకుంటారో చేసుకోండని అన్నారు. మేము, మధ్యేమార్గంగా ఇద్దరికీ అంగీకారంగా ఉండేలా ఓ ఒప్పందం చేసుకుందామని అన్నాము.

జులై 18, బుధవారం మా డ్యూటీ సమయం కావడానికి ముందు మేము ఏమీ చేయకుండా ఉందామని నిర్ణయించాము. అక్కడే కూచుని డ్యూటీ సమయం అవగానే లేచి నిలబడి అప్పుడు సమావేశాలు, ఉదయపు వ్యాయామాలు చేసి

పని ప్రారంభించాము. మొదటి టీ విరామ సమయంలో సూపర్‌వైజర్స్ వచ్చి కార్మికులను పట్టుకుని, ఉదయం జరిగిన దాని గురించి ప్రశ్నించటం ఆరంభించారు. అందరం వ్యతిరేకించాము. ఒక సూపర్‌వైజర్ ఒక కార్మికుడిని ఎప్పుడూ ఇష్టపడేవాడు కాడు. అతని పేరు జియాలాల్. ఈ సందర్భంలో అతనితో తగాదాకు దిగి కులం పేరుతో దూషణలు మొదలు పెట్టాడు. జియాలాల్ ఒక దళితుడు.

అదే సూపర్‌వైజర్ వెళ్ళి జియాలాల్ మీద యాజమాన్యానికి కంప్లైంటు ఇచ్చాడు. మధ్యాహ్నానికల్లా జియాలాల్‌ను సస్పెండ్ చేశారు. యూనియన్ నాయకత్వం వెంటనే వెళ్లి సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరింది. మేము ఒత్తిడి తెచ్చేసరికి యాజమాన్యం ఆ సూపర్‌వైజర్‌ను లీవులో ఇంటికి పంపింది. ఆ సూపర్‌వైజర్ తిరిగి వచ్చేంత వరూకు మేము జియాలాల్‌ను వెనక్కి తీసుకోలేమని ప్రకటించింది. మేము కూడా జియాలాల్ సస్పెన్షన్ ఎత్తివేసే దాకా వదలకూడదని నిర్ణయించాము. సాయంత్రం ఆరు గంటల దాకా చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. యాజమాన్యం పోలీసులనూ, అలాగే 40 నుండి 50 మంది బౌన్సర్‌నూ (ప్రయివేటు గూండాలు) పిలిపించింది. ఈ బౌన్సర్స్‌ని చూసి మేము భయపడి మా డిమాండు వదులుకుంటామని భ్రమపడ్డారు. ఇంతలోనే బౌన్సర్స్ మా యూనియన్ నాయకులందరిని భౌతికంగా కొట్టడం ప్రారంభించారు. మా నాయకులు సహాయం కోసం కేకలు వేశారు. కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు కాబట్టి, వెంటనే అందరూ పైకి వెళ్ళి ప్రయివేటు గూండాలతో తలపడ్డారు. పోలీసులు, కంపెనీ సీనియర్ అధికారులు బయటే ఉండిపోయారు. ఎవ్వరూ లోపలికి వెళ్ళటానికి ధైర్యం చేయలేదు. ఆ సమయంలో సుమారు రాత్రి 7-15 నిమిషాలకి ఫ్యాక్టరీలో షాట్ సర్క్యూట్ జరిగింది. కార్మికులందరు ఫ్యాక్టరీని ఖాళీ చేశారు. ఇది ఎలా జరిగిందంటే, ఒక యాజమాన్యం ప్రతినిధి, కొంతమంది బౌన్సర్స్‌కి, కార్మికుల బట్టలు తొడిగింది. యాజమాన్యం ఉండే ఏరియాకి తీసుకెళ్ళారు. ఆ తర్వాతే ఈ షాట్ సర్క్యూట్ జరిగింది. అప్పుడే మంటలు అన్ని వైపులా వ్యాపించాయి. హెచ్.ఆర్ అధికారి అవినాష్ కుమార్ మెట్లు దిగి క్రిందకి రావడం, మేము గేటు దాటేటప్పుడే గమనించాము. అతను ఎలా చనిపోయాడనేది ఇప్పటికీ మాకు మిస్టరీగానే ఉంది. పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం ఆయన ఊపిరి ఆడక మరణించాడని ఉంది. కాని మీడియా మటుకు కార్మికులే ఆయనని కత్తితో పొడిచి చంపేశారని ప్రచారం చేసింది.

**“ నేను కూడా ఇక్కడ అజ్ఞాతంలో ఉన్నాను. ఎందుకంటే నేను దొరికితే, వాళ్ళు నన్ను సంతోషంగా జైలులో పెడతారు. ఇంతలోనే మా బ్యాంక్ ఎకౌంట్స్‌లో రూ.50వేలు జమ చేయబడ్డాయి. దాని తర్వాత ఏ నోటీసు, ఎంక్వైరీ లేకుండానే టెర్మినేషన్ లెటర్లు వచ్చాయి. దాదాపు 500 మందిని టెర్మినేట్ చేశారని వాళ్లు చెబుతున్నారు. కాని ఆ సంఖ్య ఇంకాఎక్కువే ఉంటుంది. 1880 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారు. ”**

నేను అవినీష్ కుమార్ గురించి చాలా బాధపడుతున్నాను. వ్యక్తిగతంగా ఆయన మంచివాడు. కేవలం యజమానికి నమ్మిన బంటులా ఉన్నాడనే తప్ప, అతని పాత్ర వేరే ఏమీ లేదు. కొంతకాలంగా ఉద్యోగానికి రాజీనామా చేయాలని కూడా ప్రయత్నించాడు. అతని భార్య మీడియాతో మాట్లాడుతూ జూన్‌లో అతను రాజీనామా చేశాడని తెలిపింది. దాదాపు వారం రోజుల పాటు యాజమాన్యం నుండి అతని కుటుంబాన్ని కలవటానికి ఎవరూ వెళ్ళలేదు.

మూడవ షిఫ్టుకు చెందిన సి. -షిఫ్టు కార్మికులు యథావిధిగా ఆ రాత్రి డ్యూటీకి వచ్చారు. పోలీసులు వారిలో చాలా మందిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన జరిగినపుడు వారెవ్వరూ లేకపోయినా అరెస్టులు జరిగాయి. ఇప్పటికీ 146 మంది జైలులో ఉన్నారు. యూనియన్‌కమిటీలో ఉన్న సభ్యులు అందరు వారంతట వారే పోలీసు స్టేషన్‌కి వెళ్ళి లంగిపోగా, పోలీసులు మటుకు వారు పారిపోతుంటే, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలలో వేరువేరు ప్రాంతాల నుండి పట్టుకుని తెచ్చామని మీడియాకు ప్రకటించారు. మా మీద అన్ని రకాల తప్పుడు కేసు పెట్టారు. ఉదా: మేము నిరంతరం ఫ్యాక్టరీలోకి ఆయుధాలు తీసుకువెళ్తామని. పోలీసుల దగ్గర వీరు ఫలానా నిందితులు అనే జాబితా ఇప్పటికీ లేదు. ఎవరు, ఎక్కడ దొరికితే వారిని తెచ్చి నిందితులుగా పేర్కొంటున్నారు.

నేను కూడా ఇక్కడ అజ్ఞాతంలో ఉన్నాను. ఎందుకంటే నేను దొరికితే, వాళ్ళు నన్ను సంతోషంగా జైలులో పెడతారు. ఇంతలోనే మా బ్యాంక్ ఎకౌంట్స్‌లో రూ.50వేలు జమ చేయబడ్డాయి. దాని తర్వాత ఏ నోటీసు, ఎంక్వైరీ లేకుండానే టెర్మినేషన్ లెటర్లు వచ్చాయి. దాదాపు 500 మందిని టెర్మినేట్ చేశారని వాళ్లు చెబుతున్నారు. కాని ఆ సంఖ్య ఇంకాఎక్కువే ఉంటుంది. 1880 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారు. సుమారు 500 మంది పర్మినెంట్ వర్కర్లు ఉండి ఉండవచ్చు. 146 మంది జైలులో ఉన్నారు. ఇంకొంతమంది అజ్ఞాతంలో ఉన్నారు. అందువలన దాదాపు 3000 మంది కార్మికశక్తి కనబడకుండా పోయింది. ఆగస్టు 21 నుండే మళ్లీ ఆ ప్లాంట్‌పని చేయడం ఆరంభించింది. ఎలా? గొడవ జరిగిన మర్నాటి నుండే వాళ్ళు పెద్ద ఎత్తున రిక్రూట్‌మెంట్ ప్రారంభించారు. మరో రకంగా చెప్పాలంటే వారనుకున్న విధంగా యూనియన్‌ని నాశనం చేయటం, మెజారిటీ కార్మికులను తొలగించటం, రెండూ సాధించారు. మీడియా మటుకు జరిగిన గొడవకి మమ్మల్నే కారకులుగా ప్రచారం చేస్తోంది. కాని ఈ గొడవ వలన ఎవరు లాభం పొందారని మటుకు అడగదు. మా ఉద్యోగాలు పోయాయయని మేము బాధపడటం లేదా?

మాకు కుటుంబాలు లేవా? పిల్లలను బడికి పంపాలి గదా? వారిని పోషించాలి కదా? ఒకవైపు అవినాష్ కుమార్ మృతికి కారణం కార్మికుల హత్యాకాండ అని ప్రచారం చేస్తున్నారే? మరి 2000 సంవత్సరంలో ఫ్యాక్టరీలో జరిగిన పోరాటంలో ఇద్దరు కార్మికులు మరణించారు. ఆ రోజు ఎవరూ మాట్లాడలేదు. ఇంత హడావిడి చేయలేదు. ఎంక్వైరీ లేదు. న్యాయమూ జరగలేదు.

అవును. నిజమే. కార్మికులు ఆ రోజు ఏడు గంటలకు మాత్రమే సి.సి. కెమేరాలను ధ్వంసం చేశారు. అప్పటిదాకా జరిగినవన్నీ రికార్డు అయి ఉన్నాయి. మరి, రికార్డు అయిన వాటిని చూపించండి, నిజంగా ఆ దాడులు చేసింది ఎవరో తెలుసుకుందామని అంటే, చూపించరే? కారణం ఏమిటంటే, వారంతట వారే ఉదయం 11 గంటలకే సి.సి. కెమేరాలను ఆపివేశారు. వారు తీసుకువచ్చిన బౌన్సర్స్ (ప్రయివేటు గూండాలు) రికార్డులలోకి రాకూడదని. ఇదే మా ఆఖరి పోరాటం కానే కాదు.

మళ్ళీ ర్యాలీలు తీస్తాము, మళ్ళీ ధర్నాలు చేస్తాము. కోర్టులో న్యాయం కోసం పోరాడుతాం. ఈ పోరాటం ఆగదు, ఆగదు. చివరిదాకా కొనసాగుతుంది.

**(అనువాదం: భారవి)**

# వెన్నాడుతున్న ఆర్థిక మాంద్యం



రచయిత న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్. ఆర్థిక వ్యవహారాలపై విస్తృతంగా రాస్తారు

**సి.పి. చంద్రశేఖర్**

ఆర్థికపతనం మరోసారి సంభవించనుందనే భయం ఆర్థికాభివృద్ధిని పెంపొందించాలంటే ప్రభుత్వాలు ద్రవ్య విధానపరమైన చొరవ తీసుకోవాలనే వాదనకు బలం చేకూరుస్తున్నది. కాని ప్రభుత్వాలు అటువంటి చర్యలు తీసుకోవటాన్ని ప్రపంచ ద్రవ్య పెట్టుబడి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. తన ప్రయోజనాలకు విఘాతం కలగనంత వరకే ప్రభుత్వాలు అప్పులు చేయటాన్ని ద్రవ్య పెట్టుబడి అనుమతిస్తుంది.

ఈ మధ్యనే జరిగిన అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐ.ఎమ్.ఎఫ్), ప్రపంచబ్యాంకుల వార్షిక సమావేశం ముగిసిన తర్వాత వచ్చిన ఒకేఒక్క వార్త అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను సంయుక్తంగా నిర్వహిస్తున్న నాయకులలో భిన్నాభిప్రాయాలు, గందరగోళం ఉన్నట్లు వెల్లడి చేసింది. మరొకసారి తీవ్రమైన మాంద్యంలోకి జారిపోతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపచేయటానికి ప్రభుత్వాలు తిరిగి ఆర్థిక విధానపరమైన చర్యలు తీసుకోవటానికి తిరిగివెళ్ళాలా, లేక ద్రవ్య పరమైన చర్యలకే పరిమితం కావాలా అనే అంశానికి సంబంధించి నాయకుల మధ్య ఏకాభిప్రాయలేమి, స్థిరమైన ఆలోచన లేకపోవటం అనేది ప్రత్యేకంగా కనిపించింది.

సంవత్సరాల తరబడి అనుసరించిన పరిమాణాత్మక సడలింపులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బాండ్లు కొనుగోలు చేయటంద్వారా ఆర్థిక వ్యవస్థలోకి పెద్ద మొత్తంలో డబ్బును ప్రవహింపచేయటం, ఇతర అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో కూడా ఇదే విధమైన చర్యలు తీసుకోవటం సంక్షోభానికి కారణమైన బ్యాంకులు తిరిగి లాభాలు సంపాదించటానికి దోహదం చేశాయి. కాని అది అంతే ముఖ్యమైన, అంతకన్నా ప్రాధాన్యత కల ఇతర సమస్యల పరిష్కారానికి దోహదం చేయలేదు. ఉదాహరణకు అది వినియోగదారులకు, ఇళ్ళ యజమానులకు రుణాలు అందించటానికి లేదా డిమాండ్‌ను పెంపొందించటానికి దారితీయలేదు. ఫలితంగా ద్రవ్య పెట్టుబడులు అభివృద్ధి చెందుతుంటే నిజ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతున్నది. ఆర్థికవ్యవస్థలోకి అదనంగా డబ్బును పంపే విధానం వలన ద్రవ్య లభ్యత విస్తృతం కావటంతో దేశాల సరిహద్దులను దాటి అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లలోకి వెల్లువెత్తుతున్న పెట్టుబడులు ఈ దేశాలలో మారకం రేట్లను, ద్రవ్య నిర్వహణను కష్టతరం చేస్తున్నాయి. సంక్షోభం ఎదురైనపుడు ఈ విధానాలు తమ ద్రవ్య, ఆర్థిక మార్కెట్ల స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయని వారు భయపడుతున్నారు.

ఫలితంగా కొత్తగా సంభవించబోతున్న ఆర్థిక దిగజారుడును అరికట్టాలంటే ఆర్థిక విధానాలపై ఎక్కువగా ఆధారపడాలని గతంలో కొద్దిమంది మాత్రమే అంగీకరించిన అంశం చుట్టూ ఇపుడు ఎక్కువమంది సమీకరించబడుతున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ఐ.ఎమ్.ఎఫ్‌లలో సభ్యులైన , అత్యంత శక్తివంతమైన దేశాలున్న అంతర్జాతీయ ద్రవ్య వ్యవహారాలు, అభివృద్ధికి చెందిన ఇరవై నాలుగు దేశాల ప్రభుత్వాల ప్రతినిధులున్న గ్రూపు (జి.24) తన ప్రకటనలో ఈ విధంగా చెప్పింది: "అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో దీర్ఘకాలం తక్కువ వడ్డీరేట్లున్నప్పటికీ స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధించటం సాధ్యం కాలేదు. తీవ్రమైన వ్యవస్థాగత సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడులు పెట్టటంతో పాటు, ఆర్థికావసరాలకు అనుగుణమైన ద్రవ్య విధానాలను అనుసరించాల్సిన ఆవశ్యకతను ఇది తెలియజేస్తున్నది." ప్రకటనలో ఇంకా ఈ విధంగా చెప్పారు, "విధ్వంసం సృష్టించే పెట్టుబడుల ప్రవాహాలు, అభివృద్ధి చెందిన పెద్ద ఆర్థిక వ్యవస్థలున్న దేశాలలోని స్థిరత్వంలేని ద్రవ్య విధానాల వలన ఏర్పడుతున్న ద్రవ్య మారకం రేట్లలో ఉత్థానపతనాలు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అందువలన రిజర్వు కరెన్సీని విడుదల చేసే దేశాలు అభివృద్ధి చెందుతున్నమార్కెట్ ఆర్థిక వ్యవస్థలున్న, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికవ్యవస్థలు ఎదుర్కొంటున్న సమస్యలు, ద్రవ్య ప్రవాహాలు ఈ దేశాలపై వేస్తున్న ప్రతికూల ప్రభావాలకు అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలున్న దేశాలలోని విధాన నిర్ణేతలు తగిన ప్రాధాన్యత నివ్వాలని విజ్ఞప్తి చేశారు. వారు తమ విధానాలను సమర్థవంతంగా సమన్వయం చేయటానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు."

### కీన్స్ విధానాల వైపు చూపు

ఇది కేవలం అభివృద్ధి చెందుతున్న మార్కెట్ ఆర్థికవ్యవస్థలున్న, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలున్న (ఇ.ఎమ్.డి.సి.) దేశాల అభిప్రాయం మాత్రమే కాదు. ఐ.ఎమ్.ఎఫ్. చీఫ్ ఎకనామిక్ కౌన్సిలర్ ఆలీవర్ బ్లాన్‌కార్డ్ ఈమధ్య వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ పత్రికకు రాసిన ముందుమాటలో ఇదే విషయాన్ని చెప్పాడు. "యూరో ప్రాంతంలో జరుగుతున్న బలహీనమైన అభివృద్ధి ద్రవ్య విధానానికి సంబంధించి నూతన చర్చకు దారితీస్తున్నది. సావరిన్ బాండ్లు తగ్గటం ద్రవ్య స్థిరత్వం కోసం గత కొంతకాలంగా తీసుకుంటున్న చర్యలు ప్రస్తుతం అనుసరిస్తున్న ద్రవ్య విధానాలు సరైనవేననే విశ్వాసాన్ని ద్రవ్య పెట్టుబడిదారులలో పెంచాయి. ఎంతో పణంగా పెట్టి సాధించిన ఈ ప్రతిష్ఠను ప్రమాదంలో పడనివ్వరాదు. దీని అర్థం ఆర్థికాభివృద్ధి అవసరాలకు తగినట్లుగా ద్రవ్య విధానాన్ని వినియోగించుకోరాదని కాదు. చాప్టర్ 3లో మేము చెప్పినట్లుగా, ఉదాహరణకు మౌలిక సదుపాయాల అభివృద్ధిని అప్పు చేయటంద్వారా సాధించినప్పటికీ అది సరైనదే. అది తక్షణమే డిమాండ్‌ను పెంచటానికి, మధ్యకాలికంగా సరఫరాను పెంచటానికి ఉపయోగపడుతుంది. ఆర్థికాభివృద్ధి స్తంభించిపోతే ఇంకా తీవ్రమైన

చర్యలు తీసుకోవటానికి కూడా సిద్ధంగా ఉండాలి". ఆర్థికాభివృద్ధి సాధించటంకోసం ప్రభుత్వాలు లోటు బడ్జెట్లతో ఖర్చు చేయకూడదని దృఢంగా చెబుతున్న సంస్థ యొక్క ప్రముఖ ఆర్థికవేత్త వ్యవస్థాగత సంస్కరణలు చేయమని చెప్పటం ప్రత్యామ్నాయ విధానాలకు పెద్ద రాయి తీని ఇవ్వటమే. పొదుపు చర్యలు చేపట్టాలని, ఆర్థికవ్యవస్థలపై కంట్రోళ్ళను తొలగించాలని, లేబర్ మార్కెట్లను సరళీక రించాలనే విధానాలను అమలుజరపాలని చెబుతున్న సంస్థ ప్రతినిధి అవసరమైతే ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ విధానాలను అమలు జరపాలని చెబుతున్నాడు.

వాషింగ్టన్ డి.సి.లో జరిగిన ఐ.ఎమ్.ఎఫ్. గవర్నింగ్ బాడీ వార్షిక సమావేశంలో పాల్గన్న ప్రతినిధులలో కొందరు 'ఐ.ఎమ్.ఎఫ్.ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టటానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ సంస్కరణలకు తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నదన్న వాస్తవాన్ని చెబుతూ ఆశాభంగాన్ని వ్యక్తం చేసినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ (అక్టోబరు,13,2014)రిపోర్టు చేసింది. 'ఇదే అభిప్రాయాన్ని బలపరుస్తూ బ్రిటన్ ఖజానా ఛాన్సలర్ జార్జ్ వోస్‌బర్న్ ఐ.ఎమ్.ఎఫ్. చెబుతున్న అనిశ్చిత ద్రవ్య విధానం పట్ల తనకు సందేహాలు ఉన్నట్లు చెప్పాడని రిపోర్టు చేశారు. నిజ ఆర్థికవ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంలో ద్రవ్య విధానం సుదీర్ఘకాలం పాటు విఫలం అయినప్పటికీ, మాంద్యంలో చిక్కుకున్న పెట్టుబడిదారీ వ్యవస్థను అభివృద్ధి పథంలోకి తీసుకురావటానికి ప్రభుత్వం సానుకూలపాత్ర నిర్వహించాలని కీన్స్ చెప్పిన అంశాన్ని గట్టిగా వ్యతిరేకిస్తూ, ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలను కాపాడేవారి నోళ్ళు మూయించలేని స్థితే ఉంది.

ఈ విధమైన స్తబ్దత కొనసాగటం మంచిది కాదు. ద్రవ్య సంక్షోభం బట్టబయలై మహా మాంద్యానికి ప్రారంభం అయిన సెప్టెంబరు 15, 2008న చాప్టర్ 11 ప్రకారం లేహ్‌మాన్ బ్రదర్స్ దివాళా పిటీషన్ దాఖలు చేసి ఆరు సంవత్సరాలకు పైగా కాలం గడిచిపోయింది. అయినప్పటికీ తన వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ అక్టోబరు, 2014 సంచికలో ఐ.ఎమ్.ఎఫ్. ప్రపంచ ఆర్థికాభివృద్ధి సాధారణంగా ఉంటుందని ప్రకటిస్తూ, అభివృద్ధిపై తన అంచనాను మరోసారి అధోముఖంగా సవరించింది. బలమైన ఆర్థికాభివృద్ధిని సాధించటానికి 'నూతన మార్గాల కోసం' ఐదు సంవత్సరాల నుండి జరుగుతున్న అన్వేషణ నిష్ప్రయోజనంగానే ఉండిపోయింది.

> **" మొత్తంగా చూసినపుడు ప్రపంచ ఆర్థికాభివృద్ధి భిన్నమైన మార్గాలలో సాగుతున్నదని స్పష్టం అవుతున్నది. అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలున్న దేశాలు, జర్మనీ వేగంగా అభివృద్ధిని సాధిస్తుండగా అమెరికా కొంత మేరకు అభివృద్ధిని సాధిస్తుండగా, జర్మనీని మినహాయించి మిగిలిన యూరప్ దేశాల అభివృద్ధి నిరాశాజనకంగా ఉంది. "**




మాంద్యం ప్రారంభమయిన సంవత్సరం తర్వాత అనేక అభివృద్ధి చెందుతున్న మార్కెట్ ఆర్థికవ్యవస్థలున్న దేశాలు, (ముఖ్యంగా ఆసియాలో ఉన్న దేశాలు) జర్మనీ లాంటి కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు కొద్ది మేరకు పెరుగుదలను సాధించాయి. ప్రపంచవ్యాపితంగా అన్ని దేశాలు ఐక్యంగా, ఒక పద్ధతి ప్రకారం ఖర్చును పెంచటం, పన్నులు తగ్గించటం బెయిల్ అవుట్ ప్యాకేజీలివ్వటం, ద్రవ్య లభ్యతను పెంచటం తదితరాలు ఆర్థిక సంక్షోభ ప్రభావాల్ని పాక్షికంగా పరిహరించి, తిరిగి అభివృద్ధిని సాధిస్తామనే విశ్వాసాన్ని కలిగించాయి. అమెరికాలో ఆర్థికంగా కోలుకోవటం బలహీనంగానే ఉన్నప్పటికీ మాంద్యం నుండి బయటపడుతున్న సూచనలు అక్కడా కనిపిస్తున్నాయి. తీవ్రంగా ఆందోళన కలిగిస్తూ, సంక్షోభంలో ఉన్న ప్రాంతం యూరోపియన్ యూనియన్, ఆ ప్రాంత దేశాలు. అయినప్పటికీ ఆ ప్రాంతంలో కూడా జర్మనీ సాధిస్తున్న అభివృద్ధి సంతోషానికి కారణం అవుతున్నది.

**తలక్రిందులవుతున్న భవిష్యత్ అంచనాలు**

మొత్తంగా చూసినపుడు ప్రపంచ ఆర్థికాభివృద్ధి భిన్నమైన మార్గాలలో సాగుతున్నదని స్పష్టం అవుతున్నది. అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలున్న దేశాలు, జర్మనీ వేగంగా అభివృద్ధిని సాధిస్తుండగా అమెరికా కొంత మేరకు అభివృద్ధిని సాధిస్తుండగా, జర్మనీని మినహాయించి మిగిలిన యూరప్ దేశాల అభివృద్ధి నిరాశాజనకంగా ఉంది. కాబట్టి క్లిష్ట పరిస్థితిని అధిగమించటానికి అధిక అభివృద్ధిని సాధిస్తున్న దేశాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థను మాంద్యం నుండి గట్టెక్కిస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అనేక ప్రశ్నలు ఈ ఆశావహ దృక్పథాన్ని సవాలు చేస్తున్నాయి. మొదటిది యూరప్‌లో సంక్షోభం తీవ్రంగా ఉండటమేకాక, అది జర్మనీ అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నది. ఇతరచోట్ల, ముఖ్యంగా యూరప్‌లో ఆర్థికాభివృద్ధి నిదానంగా సాగటం వలన ఎగుమతులు తగ్గి, జర్మన్ ఆర్థికవ్యవస్థ కూడా మాంద్యపు అంచులకు చేరింది. రెండవ అంశం అమెరికా, బ్రిటన్‌లలో మాంద్యపు తీవ్రదశ నాటికన్నా మెరుగైన అభివృద్ధి జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో కోలుకోలేదు. అంచనాలకు తగిన విధంగా అభివృద్ధి జరగలేదు. చివరి అంశం వేగంగా అభివృద్ధి సాధిస్తున్న మార్కెట్ ఆర్థికవ్యవ

**"ఈ విధమైన ప్రభుత్వ ఖర్చును వ్యతిరేకిస్తూ, తేలికగా లాభాలు సంపాదించటం కోసం ఏ విధమైన ఆంక్షలు లేకుండా వస్తున్న ద్రవ్య పెట్టుబడుల ప్రవాహం వల్లనే ద్రవ్య సంక్షోభం ప్రారంభమై, అది మహా మాంద్యానికి దారితీసింది. ప్రస్తుతం మనం ఒక విచిత్రమైన పరిస్థితిలో ఉన్నాం. సంక్షోభానికి కారణమైన ద్రవ్యపెట్టుబడులు తిరిగి లాభాలు సంపాదిస్తూ అభివృద్ధి చెందుతుండగా, నిజ ఆర్థికవ్యవస్థ, మొత్తం వ్యవస్థ మాంద్యంలోనే కూరుకుపోయివుంది."**

స్థలున్న దేశాలు మిగతా దేశాలను మాంద్యం నుండి బయటికి లాగటానికి ఇంజన్లలాగా పని చేయటానికి మారుగా, ఇతరదేశాలలోని మాంద్యానికి బలిపశువులుగా మారుతున్నాయి. చైనా, భారతదేశాలలో పెరుగుదల తగ్గగా, బ్రెజిల్ లాంటి దేశాలలో తీవ్రంగా కుంచించుకుపోతున్నది. చైనా వార్షికాభివృద్ధి రేటు 2014 రెండవ త్రైమాసికలో 7.5 శాతం ఉండగా మూడో త్రైమాసికలో 6.8 శాతానికి దిగజారుతుందని భావిస్తున్నారు. బ్రెజిల్ గత సంవత్సరం 2.5శాతం అభివృద్ధిని సాధించగా, ఈ సంవత్సరం 0.3 శాతం అభివృద్ధి మాత్రమే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సంక్షోభం అనంతరం పుంజుకుంటు న్న క్రమం వేగంగా వెనుకపట్టు పట్టటానికి అభివృద్ధి చెందిన దేశాల ప్రభుత్వాలు, అంతర్జాతీయ ఆర్థికసంస్థలు అనుసరించిన విధానాలలో మార్పులే కారణం. మొదటగా సంక్షోభం ప్రారంభం కాగానే ప్రపంచవ్యాపితంగా ప్రభుత్వాలు మాంద్యాన్ని నిలువరించటానికి, వెనక్కుకొట్టటానికి ద్రవ్యపరమైన, ఆర్థిక పరమైన చర్యలు తీసుకున్నాయి. బ్యాంకులు, ద్రవ్యసంస్థల ఖాతా పుస్తకాలలో ఉండి, వత్తిడికి గురిచేస్తున్న, లేక ఏమాత్రం విలువలేని ఆస్తులను కొనుగోలు చేసి, వాటికి చౌకగా రుణాలు అందించటానికి వ్యవస్థలోకి పెద్ద మొత్తంలో ద్రవ్యాన్ని ప్రవహింపచేశారు. ప్రభుత్వం ఖర్చు పెట్టటం, ప్రైవేటు సంస్థలు ఖర్చుపెట్టటానికి ప్రోత్సాహకాలివ్వటం ఈ విధానంలో ముఖ్యమైనవి. ఇందుకోసం బడ్జెట్ల నుండి నిధులను కేటాయించారు. మాంద్యంలో పన్నులను పెంచలేదు కాబట్టి అనేక దేశాలలో ద్రవ్యలోటు పెరిగి, జి.డి.పి. ప్రభుత్వ రుణ నిష్పత్తి పెరిగింది. ఈ అంశాన్ని తగిన సమయంలో పరిష్కరించాల్సివుంది. అవసరమైన ఫలితాలొచ్చేవరకూ ఆ విధానాలను కొనసాగించలేదు. ద్రవ్య పెట్టుబడులకు అవసరమైన మేరకు మాత్రమే ఆ విధానాలను కొనసాగనిచ్చారు.

ద్రవ్యపరమైన చర్యలలో భాగంగా బ్యాంకులు దివాళా తీయకుండా, వాటి చెల్లింపుల సామర్థ్యాన్ని నిలబెట్టేందుకు ప్రభుత్వాలు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలతోనే వాటి షేర్లను కొని, సంక్షోభం నుండి బ్యాంకులను బయటపడవేశాయి. ఒకసారి ఇది జరిగిన తర్వాత పెద్దమొత్తంలో ప్రభుత్వాలకు రుణాలిచ్చివున్న బ్యాంకులు ప్రభుత్వ రుణాలు, జి.డి.పి.నిష్పత్తి ప్రభుత్వాల చెల్లింపుల సామర్థ్యానికి ప్రమాదం కలిగించే స్థాయికి చేరాయనే పేరుతో ప్రభుత్వాలు మరింతగా రుణాలు తీసుకోవటాన్ని వ్యతిరేకించాయి. బ్యాంకుల చెల్లింపుల సామర్థ్యాన్ని నిలబెట్టటానికి ప్రభుత్వాలు అప్పులు చేయటాన్ని స్వాగతించాయి. కానీ ఆర్థికమాంద్యం నుండి బయటపడి ఆర్థికాభివృద్ధి సాధించటానికి ప్రభుత్వాలు అప్పులు చేయటానికి అగీకరించలేదు.

పరస్పర విరుద్ధమైన ఈ చర్యల వెనుకవున్న పాక్షిక దృక్పథం స్పష్టంగా అర్థమౌతున్నది. జి.డి.పి., ప్రభుత్వ రుణాల నిష్పత్తి పెరుగుతున్నపుడు ద్రవ్యసంస్థల నుండి కేంద్రబ్యాంకులు కొనుగోలు చేసిన ఏమాత్రం విలువలేని ఆస్తులకు కొంత మార్కెట్ విలువను కల్పించటానికి, ప్రపంచవ్యాపితంగా పెట్టుబడులు పెట్టి లాభాలు సంపాదించటం కోసం బ్యాంకులకు చౌకగా, విస్తారంగా ద్రవ్యాన్ని అందుబాటులో ఉంచటానికి ఈ విధానాలను ఆమోదించారు. ఉదాహరణకు ఫెడరల్ రిజర్వ్ ఆస్తులు, ఆదాయాల పట్టికలో ఉన్న ఆస్తులు గానీ, ద్రవ్య సంస్థల నుండి కొనుగోలు చేసినవి గానీ 2008లో 800 శతకోటి (బిలియన్) డాలర్లుండగా, ఈ మధ 4 లక్షకోట్ల (ట్రిలియన్) డాలర్లకు పైగా పెరిగాయి. ఇది ద్రవ్య పెట్టుబడుల ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది కాబట్టి వారికి సమస్యగా కనిపించలేదు. ప్రభుత్వ రుణం పెరగటం వారి ప్రయోజనాలకు విరుద్ధం కాబట్టి దానిని సమస్యగా చేస్తున్నారు.

ప్రభుత్వం అప్పులు చేసి ప్రజావసరాల కోసం ఖర్చు పెట్టటం కొత్తకాదని, 1990వ దశాబ్దంలో, సంక్షోభానికి ముందు 2000 దశాబ్దంలో కూడా ఉందని వాదించేవారున్నారు. ఆ సమయంలో కార్మికుల వేతనాలు తక్కువగా ఉన్నప్పటికీ, వారి వినియోగానికి, ఇళ్ళు కొనుగోలు చేయటానికి రుణాలు లభించాయి కాబట్టి మార్కెట్‌లో డిమాండ్ తగ్గలేదు.

పెరుగుదలను తగ్గకుండా చూడటానికి అప్పులు చేయటం ద్వారా ప్రభుత్వం పెడుతున్న ఖర్చుకు ప్రత్యామ్నాయంగా ప్రైవేటు ఖర్చు పెంచటానికి రుణాలిచ్చారు. ఆ విధమైన రుణభారాన్ని భరించలేకే సంక్షోభం వచ్చిందని రుజువవుతున్నది. ఇపుడు గృహస్థుల ఖాతాలలో రుణాలు పెరిగిపోవటంతో వారికి అదనంగా రుణాలివ్వటానికి బ్యాంకులు సిద్ధపడటంలేదు. గృహస్థులు కూడా ఇంకా అప్పులు చేయటానికి సిద్ధంగా లేరు. ఇటువంటి పరిస్థితులలో పెరుగుదల సాధించటానికి గృహస్థులను మరింత రుణగ్రస్థులుగా చేయటం కాకుండా, వారి ఆదాయాలను పెంచి, రుణభారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలి. ఈ విధంగా రుణాలివ్వటం ద్వారా ప్రైవేటు వినియోగాన్ని పెంచటం కాకుండా, ఇతర చర్యలు కూడా తప్పనిసరిగా అటువంటి పెరుగుదలను సాధిస్తాయి. కాబట్టే రుణాలు చేయటం ద్వారా ప్రభుత్వ ఖర్చును పెంచటం తప్పనిసరి అవుతున్నది.


ఈ విధమైన ప్రభుత్వ ఖర్చును వ్యతిరేకిస్తూ, తేలికగా లాభాలు సంపాదించటం కోసం ఏ విధమైన ఆంక్షలు లేకుండా వస్తున్న ద్రవ్య పెట్టుబడుల ప్రవాహం వల్లనే ద్రవ్య సంక్షోభం ప్రారంభమై, అది మహా మాంద్యానికి దారితీసింది. ప్రస్తుతం మనం ఒక విచిత్రమైన పరిస్థితిలో ఉన్నాం. సంక్షోభానికి కారణమైన ద్రవ్యపెట్టుబడులు తిరిగి లాభాలు సంపాదిస్తూ అభివృద్ధి చెందుతుండగా, నిజ ఆర్థికవ్యవస్థ, మొత్తం వ్యవస్థ మాంద్యంలోనే కూరుకుపోయివుంది. ఆంక్షలు తొలగించటం, ఆ తర్వాత ద్రవ్య పెట్టుబడులు విస్తృతంగా విస్తరించి, తద్వారా లభించిన అపారమైన శక్తితో మిగిలిన వాటన్నింటినీ నష్టపెట్టటం ద్వారా ప్రతిదానిని తనకు అనుకూలంగా మలచుకున్నది. ఆ విధమైన శక్తిని సవాల్ చేయనంతవరకు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఆర్థిక అభివృద్ధి సాధ్యం కాకపోవటంతో ఐ.ఎమ్.ఎఫ్. తన పెరుగుదల అంచనాలను నిర్దిష్టకాలంలో తగ్గించాల్సిన పరిస్థితులకు నెట్టబడుతున్నది. వాస్తవానికి మనం మరో మాంద్యాన్ని ఎదుర్కోబోతున్నాం.

**(అనువాదం.ఎ.కోటిరెడ్డి)**

గ్రంథ పరిచయం

## లెనిన్ ప్రసిద్ధ రచన

# 'రాజ్యం-విప్లవం'




**ఎన్.వి.యస్. నాగభూషణ్**

లెనిన్ రాసిన ప్రసిద్ధ గ్రంథాల్లో ఒకటి 'రాజ్యము-విప్లవము'. దీన్నాయన 1917 ఫిబ్రవరిలో జరిగిన బూర్జువా విప్లవానంతరం అజ్ఞాతంలో వుంటూ, 1917 ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రాశాడు. ఆ సమయంలో ఆయన రాజధాని పెట్రోగ్రాడ్‌కి అనతి దూరంలో గల రజ్లీవ్ సరస్సు ఒడ్డునున్న చిట్టడివిలో కొన్ని రోజులూ, ఫిన్లాండ్ రాజధాని 'హెల్సింగ్ ఫర్స్' పట్టణం సమీపంలో కొన్ని రోజులూ, అటు తర్వాత 'హెల్సింగ్‌ఫర్స్'లో కొన్ని రోజులూ, ఆపై పెట్రోగ్రాడ్‌లోగల పార్టీ సెంట్రల్ కమిటీతో సంప్రదింపులు జరిపేందుకు అనువుగా వుండటం కోసం సరిహద్దు పట్టణమైన 'వీబోర్గ్'లో మిగిలిన రోజులూ వున్నాడు. మొదట ఆయన ఈ గ్రంథానికి ఏడు ప్రకరణాల పథకం వేసుకున్నాడుగానీ, ఆరు ప్రకరణాలు రాశాక, విప్లవంలో స్వయంగా పాల్గొనడం, దానికి నేతృత్వం వహించడంలో నిమగ్నమై, ఏడో ప్రకరణానికి '1905, 1917 రష్యన్ విప్లవాల అనుభవం' అనే పేరు పెట్టి కూడా ఆపేశాడు. ఈ గ్రంథ ప్రచురణ విప్లవానంతరం, 1918లో జరిగింది.

గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థగా రూపాంతరం చెందే ప్రక్రియను సామ్రాజ్యవాద యుద్ధం త్వరిత పరిచిందనీ, ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగుతూ, ప్రజల స్థితిని దుర్భరం చేసిందనీ, సర్వశక్తివంతమైన పెట్టుబడిదారీ సంఘాలతో అంతకంతకూ మిళితమౌతున్న రాజ్యం శ్రామిక ప్రజలమీద చేసే పైశాచిక పీడనను తీవ్రం చేస్తోందనీ, అందువల్ల ప్రపంచ కార్మికవర్గం ఐక్యమౌతోందనీ, అందుచేత కార్మికవర్గ విప్లవానికి రాజ్యంతో గల సంబంధం ఎలాంటిదనే సమస్య ఆచరణాత్మక ప్రాముఖ్యం సంతరించుకున్నదనీ పీఠికలో లెనిన్ పేర్కొన్నాడు. శాంతియుతంగా అభివృద్ధి జరిగినకాలంలో అవకాశవాదం, జాతీయ దురహంకారం పెరిగి, అధికారిక సోషలిస్టు పార్టీలపై పెత్తనం చేస్తున్నాయని, ఫలితంగా ఆపార్టీలు మాటల్లో సోషలిజం, చేతల్లో జాతీయ దురహంకారమూ ప్రదర్శిస్తున్నాయని చెబుతాడు. ఈ సోషలిస్టు నాయకులు తమ జాతీయ బూర్జువా వర్గ ప్రభుత్వాలను బలపరుస్తూ యుద్ధానికి మద్దత్తు తెలుపుతున్నారని చెబుతాడు. సామ్రాజ్యవాద యుద్ధం చిన్న, దుర్భర జాతుల్ని దోచుకుంటూ ఇలాంటి దోపిడీ సొత్తును పంచుకోవడానికీ, తిరిగి పంచుకోవడానికీ జరిగే యుద్ధమే కాబట్టి, శ్రామిక ప్రజల్ని బూర్జువా వర్గ ప్రభావం నుండి విముక్తం చేయటానికి పోరాడాలనీ, 'రాజ్యం' గురించి ఉన్న అవకాశవాద దురభిప్రాయాల మీద పోరాడకుండా ఆ పోరాటం విజయవంతం కాదనీ ఆయన చెబుతాడు. అందులో భాగంగా మొదట మార్క్స్, ఏంగెల్స్‌ల రాజ్య సిద్ధాంతాన్ని పరీక్షించి, ఈ సిద్ధాంతంలో ఏయే అంశాలను అవకాశవాదులు ఉపేక్షిస్తున్నారో లేదా వికృతం చేస్తున్నారో పరిశీలించి, చివరగా 1905, 1917 నాటి రష్యన్ విప్లవానుభవాల్ని క్రోడీకరిద్దామని అంటాడు లెనిన్.

చరిత్రలో పీడిత వర్గాలకోసం పోరాడే విప్లవకారుల్నీ, వారి ఆలోచనల్నీ తీవ్రంగా అణచివేసిన పీడక వర్గాలు, ఆ విప్లవకారులు చనిపోయాక మాత్రం పీడితుల్ని మోసగించటానికి ఆ విప్లవకారుల్ని ప్రమాద రహిత దేవతా విగ్రహాలుగా మార్చడానికి, వారి పేర్లకు కొంత గొప్పతనం ఆపాదించడానికి ప్రయత్నిస్తూ, వారి సిద్ధాంతాల్లో బూర్జువా వర్గానికి అంగీకారయోగ్యమయ్యేవాటిని ముందుకు తీసుకువస్తారని గ్రంథారంభంలో లెనిన్ చెబుతాడు. ప్రస్తుతం మార్క్సిజానికి అలాంటి గతి పట్టించేందుకు సోషల్ జాతీయ దురహంకారులు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యం గురించి మార్క్స్ నిజంగా బోధించినదాన్ని పునఃస్థాపించడం మన కర్తవ్యంగనుక, అందుకోసం మార్క్స్, ఏంగెల్స్‌లనుంచి పలు దీర్ఘ ఉల్లేఖనలు అవసరమౌతాయనీ చెబుతాడు.

మొదట ఏంగెల్స్ "కుటుంబమూ, సొంత ఆస్తి, రాజ్యమూ పుట్టుక" అనే గ్రంథంలో రాజ్యానికిచ్చిన సుప్రసిద్ధ నిర్వచనాన్ని విశ్లేషించాడు. రాజ్యం అనేది రాజీపడలేని వర్గ వైరుధ్యాల ఫలితమూ, వ్యక్తీకరణా అనీ, వర్గ వైరుధ్యాలు ఎప్పుడు, ఎక్కడ, ఏ మేరకు రాజీపడలేవో అప్పుడు, అక్కడ రాజ్యం ఉద్భవిస్తుందన్న ఏంగెల్స్ అభిప్రాయాన్ని లెనిన్ వివరించాడు.

**❝ ప్రజాతంత్ర వ్యవస్థలో ఉద్యోగులకు సూటిగా లంచం ఇవ్వడం ద్వారా, ప్రభుత్వానికీ, స్టాక్ ఎక్ఛేంజ్‌కీ మధ్య పొత్తుద్వారా పెట్టుబడి తన అధికారాన్ని పరోక్షంగా నిర్వహిస్తుందన్న ఏంగెల్స్‌ని ఉదహరించి, ఆ రెండు పద్ధతుల్ని సామ్రాజ్యవాదము, బ్యాంకుల పెత్తనమూ అపురూపమైనకళగా అభివృద్ధి చేశాయని లెనిన్ అంటాడు. ❞**

మార్క్స్ ప్రకారం, రాజ్యం-ఒక వర్గం మరొక వర్గాన్ని పీడించడానికి ఉన్న ఒక అంగం. వర్గాలమధ్య ఘర్షణను అదుపులో ఉంచటం ద్వారా ఈ పీడనను చట్టబద్ధం చేసి, స్థిరపరిచే 'సువ్యవస్థ'ను ఇది స్థాపిస్తుంది. మార్క్సిజం యొక్క వికృతీకరణ ఈ ముఖ్యమైన అంశం మీదనే ప్రారంభమౌతుందని లెనిన్ అన్నాడు. వర్గ వైరుధ్యాలూ, వర్గ పోరాటాలూ ఉన్నచోటనే రాజ్యం వుంటుందని చారిత్రక వాస్తవాల వల్ల ఒప్పుకోవలసి వచ్చిన బూర్జువా, పెటీ బూర్జువా సిద్ధాంతవేత్తలు, రాజ్యం వర్గాల రాజీకి ఏర్పడ్డ అంగంగా కనిపించేట్టు మార్క్స్‌ని దిద్దుతారని లెనిన్ వివరించాడు.

రాజ్యం యొక్క రెండో విశిష్ట లక్షణం ఒక సామాజికాధికారం స్థాపించబడటం. దీనిలో భాగంగా సాయుధ భటులు మాత్రమేగాక, జైళ్ళూ, రకరకాల నిర్బంధ సంస్థలూ వుంటాయని ఏంగెల్స్ చెప్పాడు. అలాగే ప్రతి రాజ్యానికీ ఒక గుణంగా వున్న ఈ సామాజికాధికారం, ప్రజానీకం అంతా సాయుధులుగా వ్యవహరించే వ్యవస్థతో ఏకీభవించదంటాడు ఏంగెల్స్. ఆయన ఇదంతా చెప్పింది యూరోపియన్లకు. వారిలో మెజారిటీకి ఇది అర్థం కాలేదు. మరయితే రాజ్యానికి సాయుధ భటుల ప్రత్యేక దళాలు (పోలీసులు, సైన్యమూ) కలిగి వుండటం ఎందుకని అడిగితే, ఏవేవో అరువు తెచ్చుకున్న మాటలు తప్ప, సమాజం రాజీపడజాలని విరుద్ధ వర్గాలుగా చీలిపోయిందనీ, అందువల్లే ఈ అవసరం ఏర్పడిందనీ చెప్పరు. ప్రతి గొప్ప విప్లవమూ సామూహిక కార్యాచరణ స్థాయిలో మన ఎదుట లేవనెత్తే సమస్య-సాయుధ భటుల ప్రత్యేక దళాలకూ, సాయుధ ప్రజానీకపు కార్యాచరణకు మధ్యగల సంబంధమనీ, దీన్ని ఏంగెల్స్ లేవనెత్తాడనీ చెబుతూ, ఈ సమస్యను యూరోపియన్, రష్యన్ విప్లవాల అనుభవం ఆధారంగా నిర్దిష్టంగా ఎలా సిద్ధాంతీకరించవచ్చునో చూద్దామని లెనిన్ చెప్పాడు. ఏంగెల్స్ ఈ విషయాన్ని చెప్పిన 1891లోనే పరదేశాల్ని జయించడంలో యూరప్ దేశాల మధ్య గల పోటీ సామ్రాజ్యవాదం వైపు మలుపు తిరుగుతోందని గుర్తించాడనీ, ఈ పోటీ గొప్ప రాజ్యాల విదేశాంగ విధానంలోని ముఖ్యాంశాల్లో ఒకటిగా చెప్పాడనీ, రష్యాలో అయితే సోషల్ జాతీయ, దురహంకార బద్మాషులు, ఈ పోటీ సామ్రాజ్యవాద యుద్ధాన్ని తీవ్రం చేసినప్పట్నుంచీ, తమ సొంత బూర్జువా వర్గపు పరభక్షణాత్మక ప్రయోజనాల్ని సమర్థిస్తూ, ఆ సమర్థనకు 'పితృదేశ రక్షణ, రిపబ్లిక్ విప్లవాల రక్షణ' అనే ముసుగు వేస్తున్నారని లెనిన్ వివరించాడు.

ప్రజాతంత్ర వ్యవస్థలో ఉద్యోగులకు సూటిగా లంచం ఇవ్వడం ద్వారా, ప్రభుత్వానికీ, స్టాక్ ఎక్ఛేంజ్‌కీ మధ్య పొత్తుద్వారా పెట్టుబడి తన అధికారాన్ని పరోక్షంగా నిర్వహిస్తుందన్న ఏంగెల్స్‌ని ఉదహరించి, ఆ రెండు పద్ధతుల్ని సామ్రాజ్యవాదము, బ్యాంకుల పెత్తనమూ అపురూపమైనకళగా అభివృద్ధి చేశాయని లెనిన్ అంటాడు. ప్రజాతంత్ర రిపబ్లిక్‌లో పెట్టుబడి యొక్క సామర్థ్యం - రాజకీయ యంత్రాంగం యొక్క లోపాలమీద గానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క దోషభూయిష్టమైన రాజకీయ పైపెంకు మీద గానీ ఆధారపడదనీ, ఎందుకంటే, పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రజాతంత్ర రిపబ్లిక్ ఉత్తమమైన రాజకీయ రక్షణ కవచం కాబట్టి, ఒకసారి పెట్టుబడి ఆరక్షణ కవచాన్ని సొంత పరచుకుందంటే, అది తన అధికారాన్ని స్థిరంగా ప్రతిష్టించుకుంటుందనీ, అప్పుడు ఏ వ్యక్తులు గానీ, సంస్థలుగానీ, రాజకీయ పార్టీలతో వచ్చే ఏ మార్పులుగానీ దాన్ని కదిలించలేవనీ లెనిన్ వివరిస్తాడు. ఇక సార్వజనీన ఓటింగ్ హక్కు బూర్జువా పాలనను బలపరిచే సాధనమని ఏంగెల్స్ పేర్కొన్న విషయాన్ని లెనిన్ గుర్తు చేస్తాడు. అయితే రష్యాలో ఎస్.ఆర్.లూ (సోషలిస్టు రివల్యూషనరీలు), మెన్షివిక్కులూ తదితరులు మాత్రం ఈ సార్వజనీన ఓటింగ్ హక్కును శ్రామిక ప్రజలలోని మెజారిటీ యొక్క అభీష్టాన్ని వెల్లడించడానికీ, సాధించడానికీ సామర్థ్యం వున్నదనే తప్పుడు అభిప్రాయాన్ని ప్రజలకు కలిగిస్తున్నారని లెనిన్ విమర్శించాడు.

విప్లవానంతరం కార్మికవర్గం రాజ్యాధికారాన్ని కైవసం చేసుకొని, మొట్టమొదట ఉత్పత్తి సాధనాలను రాజ్యం ఆస్తిగా మారుస్తుంది. ఆపై సకల వర్గ విభేదాలనూ, వర్గ వైరుధ్యాలనూ రద్దుచేసి రాజ్యాన్ని కూడా రాజ్యంగా రద్దుచేస్తుంది. ఆపై రాజ్యం జోక్యం అనవసరమైపోయి, తనంతతానే కృశించిపోతుందని ఏంగెల్స్ 'ఆంటీడూరింగ్' అనే గ్రంథంలో చెప్పాడు. అందులో ఆయన రాజ్యం 'రద్దవుతుందనీ, కృశించిపోతుందనీ రెండు విషయాలు చెప్పాడు. అయితే అవకాశవాదులు రాజ్యం కృశించిపోతుందన్న ఒక్క విషయాన్నే స్వీకరించి, మార్క్సిజాన్ని కత్తిరించారని లెనిన్ విమర్శించాడు. ఈ 'ఆధునిక' సోషలిస్టులు 'రాజ్యాన్ని రాజ్యంగా రద్దు చేస్తుంది' అన్నమాటలకు అర్థమేమిటన్నదాని గురించి ఆలోచించరు. ఏంగెల్స్ కార్మికవర్గం రాజ్యాధికారాన్ని కైవసం చేసుకొని, రాజ్యాన్ని రాజ్యంగా రద్దు చేస్తుందని చెప్పాడు. ఈ మాటలు 1871 నాటి పారిస్ కమ్యూన్ అనుభవాన్ని టూకీగా చెబుతాయి. కార్మికవర్గ విప్లవం బూర్జువా రాజ్యాన్ని రద్దు చెయ్యడం గురించి ఏంగెల్స్ ఇక్కడ చెబుతున్నాడు. ఇక రాజ్యం కృశించిపోవడానికి సంబంధించిన మాటలు సోషలిస్టు విప్లవం తర్వాత వుండే కార్మికవర్గ రాజ్యపు అవశేషాలకు వర్తిస్తాయి. ఆయన అభిప్రాయంలో బూర్జువా రాజ్యం కృశించిపోదు, విప్లవ గతిలో కార్మికవర్గం చేత రద్దు చేయబడుతుంది. ఈ విప్లవం తర్వాత కార్మికరాజ్యం కృశించిపోతుంది. బూర్జువా రాజ్యాన్ని కార్మికరాజ్యం తొలగించడం బలాత్కార విప్లవం లేకుండా అసాధ్యం. ఇక కార్మికరాజ్యం రద్దుకావడం 'కృశించి పోవడం' ద్వారా తప్ప, అసాధ్యం అంటూ మార్క్స్, ఏంగెల్స్‌లు చెప్పిన ఈ విషయాల్ని లెనిన్ విశదీకరించాడు.

రాజ్యం,అనగా పాలకవర్గంగా సంఘటిత పడిన కార్మిక రాజ్యం" అనే మార్క్స్‌చెప్పిన అంశం చరిత్రలో కార్మికవర్గంయొక్క విప్లవ కరపాత్రకు సంబంధించిన ఆయనసిద్ధాంతం అంతటిలోనూ ముడిపడివుంది. ఆ పాత్రయొక్క శిఖరదశే కార్మికవర్గ నియంతృత్వం. బూర్జువా వర్గం తనకోసం సృష్టించుకున్న రాజ్యయంత్రాంగాన్ని మొదట రద్దు చెయ్యకుండా, ధ్వంసం చెయ్యకుండా,కార్మికవర్గ నియంతృత్వాన్ని అమలు జరిపే రాజ్యయంత్రాన్ని కార్మికవర్గం సృష్టించగలదా?

**“రాజ్యం,అనగా పాలకవర్గంగా సంఘటితపడిన కార్మిక రాజ్యం” అనే మార్క్స్ చెప్పిన అంశం చరిత్రలో కార్మికవర్గం యొక్క విప్లవకరపాత్రకు సంబంధించిన ఆయనసిద్ధాంతం అంతటిలోనూ ముడిపడివుంది. ఆ పాత్రయొక్క శిఖరదశే కార్మికవర్గ నియంతృత్వం. బూర్జువావర్గం తనకోసం సృష్టించుకున్న రాజ్యయంత్రాంగాన్ని మొదట రద్దు చెయ్యకుండా, ధ్వంసం చెయ్యకుండా,కార్మికవర్గ నియంతృత్వాన్ని అమలు జరిపే రాజ్యయంత్రాన్ని కార్మికవర్గం సృష్టించగలదా?**



కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్

బ్యూరాక్రటిక్, మిలటరీ యంత్రాంగం బలపడటం అనేది ఫ్యూడలిజం పతనమైనప్పటి నుండి యూరప్‌లోని పలు బూర్జువా విప్లవాలన్నింటా కొనసాగింది. ముఖ్యంగా ఈ యంత్రాంగంద్వారా బడా బూర్జువాలవైపు ఆకర్షించబడేదానికి లొంగిపోయేది పెటీ బూర్జువాలు. రైతాంగంలోని పైశ్రేణులు, చిన్నచేతి వృత్తుల వాళ్లు, వర్తకులకు కూడా ఈయంత్రాంగం సాపేక్షంగా సుఖప్రదమైన, గౌరవప్రదమైన ఉద్యోగాలను సమకూర్చి, వారిని పేదప్రజల కంటే మెరుగైన స్థితిలో ఉంచుతుంది. అందువల్లనే బూర్జువా పార్టీలకూ, పెటీబూర్జువా ప్రజాతంత్ర పార్టీలకు కూడా విప్లవకార్మిక వర్గంపట్ల దమనచర్యల్ని తీవ్రం చెయ్యడం అవసరమవుతుంది. సరిగ్గా అందువల్లనే విప్లవం బూర్జువా రాజ్యాధికారాన్నిరద్దు చేయటంపై తనశక్తులి కేంద్రీకరిస్తుంది.రాజ్యయంత్రాన్ని మెరుగుపరచడానికి బదులు, దాన్ని పటాపంచలుచేసి, ధ్వంసం చెయ్యడం తప్పని సరి అవుతుందని లెనిన్ చెబుతాడు.

మార్క్స ‘ కమ్యూనిస్టు ప్రణాళిక’ లో బూర్జువా రాజ్యాంగయంత్రం స్థానంలో “ పాలక వర్గంగా సంఘటితపడిన కార్మిక వర్గ రాజ్యాంగయంత్రాన్ని పెట్టాలని చెబుతాడు. అందువల్ల కమ్యూన్ అనుభవం స్వల్పమే అయినా, దాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు “ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం” అనే గ్రంథంలో అందులో ఆయన సామ్రాజ్యానికి పూర్తి విరుద్ధమైనది కమ్యూన్ అనీ, కమ్యూన్ యొక్క మొదటి శాసనం స్థాయీ సైన్యాన్ని రద్దుచేసి, దానిస్థానంలో సాయుధ ప్రజల్ని పెట్టిందని చెప్పాడు. ఈ విధంగా కమ్యూన్ పటాపంచలైన రాజ్యయంత్రం స్థానంలో పూర్ణతరమైన ప్రజాస్వామ్యాన్ని పెట్టినట్లు కనబడుతుంది. ఈ సందర్భంలో కమ్యూన్ తీసుకున్న కొన్ని చర్యల్ని మార్క్స నొక్కి చెప్పాడు. అవి: ఉద్యోగుల సకల అధిక సౌకర్యాలూ రద్దు సకల ప్రభుత్వోద్యోగుల జీతమూ ‘శ్రమజీవుల వేతనస్థాయికి తగ్గించడమూ తదితరాలు ముఖ్యమైనవి, మార్క్స నొక్కి చెప్పిన వీటిని అవకాశవాదులు పూర్తిగా ఉపేక్షించారు. మరో ముఖ్యమైన చర్య ఏమంటే–ఎటువంటి మినహాయింపులూలేకుండా సకల ఉద్యోగులూ ఎన్నుకోబడడమూ, ఎప్పుడంటే అప్పుడు దింపబడేట్లు ఉండటమూ–ఈ సరళ స్వయంవ్యక్త ప్రజాతంత్ర చర్యలు ఒకవైపు కార్మికులయొక్క, రైతుల్లో మెజారిటీ యొక్క ప్రయోజనాల్ని పూర్తిగా ఐక్యం చేస్తాయి. అదే సమయంలో పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజానికి తీసుకుపోయేవంతెనగా కూడా ఈ చర్యలు పని చేస్తాయి. అయితే ఇవి ఎప్పుడు ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటాయంటే, ఉత్పత్తి సాధనాలు సామాజీకరణ చెందినప్పుడు అంటాడు లెనిన్. పారిస్ కమ్యూన్‌ని పరిశీలించిన మార్క్స, చిన్నగ్రామమైనా సరే, ఆగ్రామ కమ్యూన్ జాతీయ కమ్యూన్‌కు ప్రతిరూపంగా వుంటుందనీ, కమ్యూన్‌లన్నీ కలిసి పారిస్ లో జాతీయ ప్రతినిధి వర్గాన్ని ఎన్నుకోవలసి వుంటుందనీ రాశాడు.

ఇక రాజ్యంరద్దు విషయమై మార్క్సిజానికీ, అరాచక వాదానికీ మధ్యగల సంబంధం గురించి ప్రస్తుత సోషల్ డెమోక్రాట్లు (అవకాశ వాదులు) పూర్తిగా వక్రీకరిస్తున్నారు గనుక, ఆ విషయంలో మార్క్స వారితో చేసిన ఒకానొక పోరాట స్వరూపం గురించి లెనిన్ వివరణ ఇచ్చాడు. రాజ్యంరద్దు లక్ష్యంగా ఉండటమనే సమస్యమీద మనం అరాజక వాదులతో విభేదించడం లేదనీ, వర్గాల రద్దుకు పీడిత వర్గపు తాత్కాలిక నియంతృత్వం అవసరమైనట్లుగానే, రాజ్యం రద్దును సాధించడానికి మనం దోపిడీ దారులకు వ్యతిరేకంగా రాజ్యాధికారపు పరికరాల్ని, పద్ధతుల్ని తాత్కాలికంగా వాడుకోవాలనీ లెనిన్ చెప్పాడు. మార్క్స ‘ఈరకం’ రాజ్యం రద్దు విషయంలోనే అరాచక వాదులతో పోరాడాడు తప్ప వర్గాలు అదృశ్యమైనప్పుడు రాజ్యం అదృశ్య మవుతుందన్న విషయాన్ని ఆయన వ్యతిరేకించనేలేదని లెనిన్ స్పష్టం చేశాడు.

రాజ్యం, ప్రజాస్వామ్యం – వీటి సంబంధంలో రాజ్యం రద్దయినప్పుడు ప్రజాస్వామ్యం కూడా రద్దవుతుందనీ, రాజ్యం కృశించిపోయినప్పుడు ప్రజాస్వామ్యం కూడా కృశించిపోతుందనీ చెప్పినప్పుడు, ఈ ఉద్ఘాటన మొదట ఆశ్చర్యకరంగా వుంటుందంటాడు లెనిన్. అలా చెప్పడం ద్వారా, మెజారిటీకి మైనారిటీ లొంగి వుండాలనే సూత్రాన్ని పాటించని సమాజవ్యవస్థ కోసం మనం ఎదురు చూస్తున్నట్లు ఎవరైనా అనుకోవచ్చుననీ, ఎందుకంటే ప్రజాస్వామ్యమంటే ఈ సూత్రాన్ని గుర్తిండమేనని చాలామంది అనుకుంటారనీ లెనిన్ చెబుతాడు. అయితే ప్రజాస్వామ్యమూ, మెజారిటీకి మైనారిటీ లొంగివుండాలనడమూ ఒకటి కాదని ఆయన చెబుతాడు. అలాలొంగి వుండటమే ప్రజాస్వామ్యమని

> **“ పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంనుండి అప్పడే వచ్చినట్టి, ప్రతివిషయంలోనూ పాత సమాజ ముద్రలను కలిగి ఉన్నట్టి కమ్యూనిస్ట్ సమాజాన్నే మార్క్స్ కమ్యూనిస్టు సమాజపు ‘మొదటి’ లేదా ‘నిమ్నదశ’అన్నాడు. ఆ దశలో ఉద్పత్తి సాధనాలు మొత్తం సమాజానికి చెందుతాయి. సమాజం లోని ప్రతిసభ్యుడూ సామాజిక శ్రమలో భాగ స్వామియై అందుకు ప్రతిఫలం పొందుతాడు. ”**

గుర్తించే రాజ్యం, అంటే ఒక వర్గంమీద మరో వర్గం, ప్రజానీకంలో ఒక భాగం మీద మరో భాగం క్రమపద్ధతిగా బలప్రయోగం చేసే సంస్థ అని చెబుతాడు. అలాంటి బలాత్కారాన్నంతటినీ, అనగా రాజ్యాన్ని రద్దు చేసే అంతిమలక్ష్యం మనది. అంతేతప్ప, మైనారిటీ మెజారిటీకి లొంగివుండటం మన లక్ష్యం కాదు. సోషలిజం కమ్యూనిజంగా అభివృద్ధి చెందుతుందనీ, ఒక మనిషి మరో మనిషి పై, ప్రజానీకంలో ఒక భాగం మరో భాగంపై బలప్రయోగం చేసే అవసరం లేకుండా, సమాజ జీవితపు ప్రాథమిక నియమాలను పాటించడానికి ప్రజలు అలవాటు పడతారని చెబుతాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంనుండి అప్పుడే వచ్చినట్టి, ప్రతివిషయంలోనూ పాత సమాజ ముద్రలను కలిగి ఉన్నట్టి కమ్యూనిస్ట్ సమాజాన్నే మార్క్స్ కమ్యూనిస్టు సమాజపు ‘మొదటి’ లేదా ‘నిమ్నదశ’అన్నాడు. ఆ దశలో ఉద్పత్తి సాధనాలు మొత్తం సమాజానికి చెందుతాయి. సమాజం లోని ప్రతిసభ్యుడూ సామాజిక శ్రమలో భాగ స్వామియై అందుకు ప్రతిఫలం పొందుతాడు. అయితే సమాజం యొక్క మొత్తం సామాజిక శ్రమ నుండి ఉత్పత్తి విస్తృతీకరణకు, యంత్రాల అరుగుదలను భర్తీ చెయ్యడానికి, వగైరాలకు ఒక రిజర్వు నిధిని తీయాలి. తర్వాత వినియోగ వస్తువుల నుండి పరిపాలన నిర్వహణ ఖర్చులు, పాఠశాలలు, వృద్ధుల వసతి గృహాలు వగైరాలకు ఒక నిధిని తీయాలి. ఈ విధంగా సామాజిక నిధికి పోయే శ్రమపరిమాణం తీసెయ్యబడ్డాక, ప్రతి కార్మికుడూ సమాజానికి తానెంత ఇచ్చాడో అంత సమాజం నుండి పొందుతాడు. ఇక్కడ సమానహక్కు వుందిగానీ, అదింకా బూర్జువా హక్కే. ప్రతి హక్కులో ఉన్నట్టే దీంట్లో కూడా అసమానత్వం ఇమిడివుంది. సమానత్వం అంటే, వాస్తవంలో ఒకలాగా లేని, ఒకరికొకరు సమానంకాని భిన్న వ్యక్తులకు సమానకొలతలు అన్వయింపజేయడం అన్యాయం. నిజానికి ప్రతి ఒక్కడూ మరొకడు చేసినంత సామాజిక శ్రమ చేసి, సామాజిక ఉత్పాదితంలో సమాన భాగాన్ని పొందుతాడు. ( పైన చెప్పిన తీసివేతల తర్వాత )

అయితే మనుషులంతా ఒకేలా వుండరు. ఒకరు బలంగా, మరొకరు బలహీనంగా ఉంటారు. ఒకడికి పెళ్లవుతుంది, మరొకరు ఒంటరిగా ఉంటారు. ఒకరికి పిల్లలెక్కువ, మరొకరికి తక్కువ మంది ఉంటారు. దీన్నుండి మార్క్స్ చేసిన నిర్ధారణ ఇలావుంది :“సమాన శ్రమ నిర్వహణతో, తత్ఫలితంగా సామాజిక వినియోగ వస్తునిధిలో సమాన భాగంతో వాస్తవంగా ఒకడు తనకవసరమైన దానికంటే తక్కువ, మరొకడు ఎక్కువ పొందుతాడు. ఈ లోపాల్ని తొలగించడానికి హక్కు సమానంగా గాక, అసమానంగా ఉండాలి’’. కనుక కమ్యూనిజం యొక్క మొదటిదశ న్యాయాన్నీ, సమానత్వాన్నీ ఇంకా సమాకూర్చలేదు. అన్యాయమైన విభేదాలు ఇంకా కొనసాగుతాయి. కానీ కమ్యూనిజం యొక్క మొదటిదశలో ఇది అనివార్యమేనని ఆయన చెప్పాడు.

కమ్యునిస్టు సమాజపు ఉన్నత దశలో, శ్రమ అనేది జీవనోపాధికి మాత్రమే గాక, జీవితపు ప్రాథమిక అవసరం అయిన తర్వాత, వ్యక్తి సర్వతోముఖ వికాసం జరిగి, ఉత్పాదక శక్తులు పెరిగి, సామాజిక ఐశ్వర్యం పెరిగాక, అప్పుడు బూర్జువాహక్కు సంపూర్ణంగా అధిగమించబడుతుంది. అపుడు“ప్రతి వాని నుండీ వాని సామార్థ్యాన్ని బట్టి, ప్రతి వానికీ వాని అవసరాన్ని బట్టి ” అని సమాజం తన పతాకమీద రాసుకోగలదు, అంటాడు మార్క్స్.

కమ్యూనిజం అభివృద్ధి అవుతున్న క్రమంలోరాజ్యం పూర్తిగా కృశించిపోతుంది. ఆ ఉన్నత దశలో శారీరక, మానసిక శ్రమల మధ్య భేదం తొలగిపోయి, ఆధునిక సమాజపు అసమానతల యొక్క ఒక ప్రధాన మూలం అంతర్ధానమవుతుంది. పెట్టుబడిదారుల ఆస్తిహరణం సమాజపు ఉత్పాదక శక్తులను అపారంగా అభివృద్ధి చేస్తుంది. అయితే ఈ అభివృద్ధి ఎంతవేగంగా జరుగుతుంది, శారీరక మానసిక శ్రమలమధ్య భేదం ఎంత త్వరగా రద్దయ్యేదీ మనకు తెలీదు అని లెనిన్ వ్యాఖ్యానించాడు.

తమ సామర్థ్యాన్ని బట్టి పనిచేసేంతగా మనుషులు సామాజిక సంబంధాల మౌలిక నియమాల్ని ఐచ్ఛికంగా పాటించడానికి అలవాటు పడినప్పుడు. మరొకనికంటే తాను కొంత సమయం ఎక్కువ పని చేశానా అని, మరొకని కంటే తక్కువ జీతం వస్తోందా అని హృదయరహితంగా లెక్కకట్టడం అధిగమించబడినపుడు రాజ్యం సంపూర్ణంగా కృశించిపోతుంది. అప్పుడు సరుకుల పంపకంలో పరిమాణాన్ని నియంత్రించే అవసరం సమాజానికుండదు. ప్రతివాడూ తన అవసరాన్ని స్వేచ్ఛగా తీర్చుకుంటాడని లెనిన్ వివరిస్తాడు.

ప్రస్తుతం జరిగే సామ్రాజ్యవాద యుద్ధంలో ఇరుపక్షాల దేశాలూ మిలటరీ రాక్షసులుగామారి, లక్షలాది జనాన్ని నిర్మూలించే సందర్భంలో, రాజ్యంతో కార్మికవర్గ విప్లవానికిగల సంబంధం ఏమిటనే సమస్యను వికృతపరచడమూ, మూసి పెట్టడమూ సరికాదని చెబుతాడు. కార్మికవర్గం విప్లవానికి నాయకత్వం వహించి బూర్జువా రాజ్యాంగయంత్రాన్ని నాశనం చేసి, దానిస్థానంలో కార్మికవర్గ రాజ్యాన్ని ఏర్పాటుచేసి, కమ్యూనిస్టు సమాజానికి బాటలు వేయాలని ఉద్భోధిస్తాడు. ●

## ‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

**ఈ మాసం ప్రత్యేకం**

# నెహ్రూ అభివృద్ధి నమూనా



**ప్రభాత్ పట్నాయక్**

**జ**వహర్‌లాల్ నెహ్రూ– మహల నోబిస్‌ల అభివృద్ధి వ్యూహంలో ఆహారోత్పత్తుల నుండి సాగుభూమిని దూరం చేసే ఎగుమతుల పెంపుదలను నిరుత్సాహపరుస్తూ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడి ఆర్థికాభివృద్ధిని సాధించటం కీలకమైన అంశం.

నెహ్రూ అభివృద్ధి వ్యూహం (ఆర్థికవేత్త సుఖమయ చక్రవర్తి చెప్పినట్లు నెహ్రూ–మహలనోబిస్ వ్యూహం) గురించి వివరించటం సహజంగానే వివరించేవారి యొక్క అవగాహన పరిధిననుసరించి ఉంటుంది. అది ఆ వ్యూహాన్ని రూపొందించినవారి అభిప్రాయాలతో కూడా ఏకీభవించాల్సిన అవసరం లేదు. వేరు మాటల్లో చెప్పుకోవాలంటే నెహ్రూ–మహలనోబిస్‌ల వ్యూహంలోని కీలకాంశాన్ని వారి దృక్పథానికి కూడా భిన్నంగా చూస్తేనే ఇది సాధ్యం అవుతుంది. దీనిననుసరించి నెహ్రూ–మహలనోబిస్‌ల అభివృద్ధి వ్యూహాన్ని వివరించటానికి నేను ఆ వ్యూహకర్తలు సాధారణంగా వ్యక్తం చేసిన, దాని సమర్థకులు, విమర్శకులు వ్యక్తం చేస్తున్న భావనలకు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాను. ఈ విధమైన ప్రత్యామ్నాయ అభివృద్ధి వ్యూహంలో కీలకాంశం భారతదేశం లాంటి దేశాలలో ఈ వ్యూహం ఈ రోజుకూ నిజమైన సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజానుకూల అభివృద్ధి వ్యూహంగా ఉంటుంది.

ఈ అంశాన్ని వివరించేముందు, ఈ వ్యూహానికి చెపుతున్న సాధారణ భాష్యాన్ని నేను వివరిస్తాను. ఆ వివరణ కూడా పూర్తిగా వాస్తవమైనదే. ఆర్థికవ్యవస్థలో ఎగుమతులకు అవకాశాలు నిరాశాజనకంగా ఉన్నస్థితిలో ఆర్థికాభివృద్ధిని సాధించటానికి అవసరమైన భారీ, మౌలిక పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవటంపై ఈ వ్యూహం ఆధారపడివుంది. ఈ వ్యూహానికి తర్కబద్ధ వివరణ సాధారణమైనదే. ఆర్థికాభివృద్ధికి పరస్పరం ఆధారపడిన రంగాలలో పారిశ్రామిక రంగంలో అభివృద్ధి తక్కువగా ఉండటంతో అది ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా పరిణమించింది. ఆర్థికరంగంలో మొత్తంగా అభివృద్ధిని పెంచాలంటే ఈ ఆటంకాన్ని తొలగించటానికి అత్యధిక నిధులను ఈ రంగంలో ఖర్చు పెట్టాలని చెప్పారు.

వాణిజ్యానికి అవకాశాలు ఎక్కువగా ఉంటే ఈ అవసరం ఉండదు. అప్పుడు ఏరంగంలోని ఉత్పత్తినైనా ఎగుమతి చేసి, దానికి బదులుగా మనకు ఏ రంగంలోనైతే వస్తువుల కొరత ఉందో ఆ వస్తువులను దిగుమతి చేసుకొని కొరతతీర్చుకోవచ్చు. కానీ ఎగుమతికి అవకాశాలు పరిమితంగా ఉన్నపుడు, మనకు కొరతవున్న రంగంలో ఉత్పత్తిని పెంచటం తప్పనిసరి. భారతదేశంలో మౌలిక, భారీ పరిశ్రమల రంగంలో (లేక యంత్రాలను తయారుచేసే రంగంలో) ఉత్పత్తులకు కొరత ఉందని గుర్తించారు. ఆ కొరతను అధిగమించి ఆర్థిక వ్యవస్థ మొత్తంగా అభివృద్ధిని సాధించాలంటే ఈ రంగాన్ని అభివృద్ధి చేయటానికి ప్రాధాన్యత ఇవ్వటం అవసరం అని భావించారు.

ఆర్థికరంగంలో 'వెనుకబాటు సిద్ధాంతం' (వెనుకబడిన ఆర్థికవ్యవస్థను అభివృద్ధి పథంలో నడిపే సిద్ధాంతం.) (టర్న్‌పైక్ థియరి) అనే సిద్ధాంతం ఉంది. (స్వయంపోషకత్వంపై ఆధారపడి ఆర్థికాభవృద్ధి కోసం ప్రయత్నిస్తున్న) ఎగుమతులు, దిగుమతులపై ఆధారపడని ఆర్థికవ్యవస్థలో దీర్ఘకాలికంగా అత్యధిక అభివృద్ధిని సాధించాలంటే అభివృద్ధిలో వెనుకబడిన రంగంలో వనరులను కేంద్రీకరించి కృషి చేయాలి. మారిస్ డాబ్(బ్రిటన్) నుండి లీఫ్ జాన్సన్ (నార్వే)వరకు అనేకమంది ఆర్థికవేత్తలు చెప్పినట్లుగా "వెనుకబాటు వ్యూహాన్ని" అమలు చేయటంలో నెహ్రూ–మహలనోబిస్ వ్యూహం ఒక ప్రత్యేకమైన ఉదాహరణ. ఎగుమతి దిగుమతులపై ఆధారపడని ఆర్థికవ్యవస్థలో అటువంటి వ్యూహాన్ని అనుసరించటం అంటే వాస్తవంగా ప్రపంచ వాణిజ్య అభివృద్ధిపై ఆధారపడకుండా ఆర్థికస్వయంసమృద్ధికి దారితీసే ఆర్థికవ్యవస్థను నిర్మించటానికి కృషి చేయటమే.

పి.సి. మహలనోబిస్1928లో సోవియట్ ఆర్థికవేత జి.ఎ.ఫెల్డ్‌మాన్ చేసిన అభివృద్ధి నమూనాను అనుసరించి, రెండవ పంచవర్ష ప్రణాళికను బలపరిచాడు. మౌలిక అభివృద్ధి వ్యూహంలో నెహ్రూ, మహలనోబిస్‌తో ఏకీభవించాడు.

ఈ వ్యూహానికి వ్యతిరేకంగా ప్రపంచ బ్యాంకు, నయా–సరళీకరణవాద ఆర్థికవేత్తలు చేసే విమర్శ ఏమంటే ఆర్థికవ్యవస్థకు అందుబాటులో ఉన్న వాణిజ్యావకాశాలను ఈ వ్యూహం తక్కువగా అంచనావేసిందంటారు. దాని అంతర్ముఖ స్వభావం వలన ఆ సమయంలో ప్రపంచ మార్కెట్, ప్రపంచ ఆర్థికవ్యవస్థ అందిస్తున్న అభివృద్ధి అవకాశాలను కోల్పోయిందని చెబుతారు. ఇందుకు భిన్నంగా తూర్పు ఆసియా ఆర్థికవ్యవస్థలు ఈ అవకాశాన్ని చేజిక్కించుకొని భారతదేశంకన్నా ఎక్కువ అభివృద్ధిని సాధించాయి. (భారతదేశం తన అంతర్ముఖ స్వభావాన్ని వదులుకోవటానికిముందు ఇది జరిగింది.)

ఇందుకు భిన్నంగా దేశంలో అభివృద్ధిలో వెనుకబడిన రంగం యంత్రాలను తయారు చేసేరంగం కాదనీ, వాస్తవంగా భారతదేశ ఆర్థికవ్యవస్థలో వ్యవసాయ రంగమే వెనుకబడి ఉందనీ, ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని వదిలి పారిశ్రామికరంగంపై కేంద్రీకరించటం వలన, ఆహారధాన్యాల ధరలు పెరగటానికి, దారిద్ర్యం నిరంతరంగా కొనసాగటానికి దారితీసిందని మరి కొందరు విమర్శిస్తున్నారు.

ఈ వ్యూహాన్ని బలపరచేవారు ఈరెండు విధాలైన విమర్శలనూ ఎదుర్కొన్నారు. మొదటి విమర్శకు సంబంధించి మహలనోబిస్ స్వయంగా చెప్పినట్లుగా ఈ వ్యూహపు లక్ష్యం దేశం తనకు తానుగా ఏకాకిగా ఉండిపోవటం కాకుండా స్వాతంత్ర్యం వచ్చిననాటి కన్నా భిన్నంగా, మారిన ఉత్పత్తి వ్యవస్థతో (తక్కువ వ్యవసాయోత్పత్తులతో) ప్రపంచ వాణిజ్యంలో పాల్గనాలని భావించామని చెప్పారు. ఇది ఎగుమతులు ఎక్కువగా పెరగటానికి దారితీస్తుందని చెప్పారు. ప్రపంచ వాణిజ్యంలో ఏ ఉత్పత్తులైతే ఎక్కువగా మారకం జరుగుతున్నాయో ఆ ఉత్పత్తులనే ఈ వ్యూహంతో దేశంలో ఉత్పత్తి

**"స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశ ఉత్పత్తిరంగంలో జనపనార, నూలుబట్టలు మాత్రమే ప్రధానంగా పారిశ్రామిక ఎగుమతులుగా ఉండేవి. అటువంటి పరిస్థితుల్లో అధిక ఆర్థికాభివృద్ధి రేటును సాధించటం కోసం ఎగుమతులను పెంచటం అంటే వ్యవసాయోత్పత్తులను మరింత ఎక్కువగా బయటికి పంపటంద్వారానే అది సాధ్యం అవుతుంది. అది భూమిని ఆహారధాన్యాల ఉత్పత్తి నుండి దూరం చేసి దేశ ఆహారభద్రతను ప్రమాదంలో పడవేస్తుంది."**

చేస్తున్నామని, అందువలన స్వాతంత్ర్యం వచ్చే నాటికి మనం చేస్తున్న ఉత్పత్తులతో కన్నా ఈ వ్యూహం వలన చేసే ఉత్పత్తులతో ప్రపంచ మార్కెట్లో వేగంగా ముందుకుపోగలమని చెప్పారు.

రెండవ విమర్శకు సంబంధించి భారీ, మౌలికరంగాలలో పెట్టుబడుల కేటాయింపుపై నొక్కిచెబుతున్నా ఈ వ్యూహం వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయలేదు. ఇతర విధానాల ద్వారా, ముఖ్యంగా పెట్టుబడులను శక్తివంతంగా వినియోగించుకోవటం ద్వారా వ్యవసాయోత్పత్తులను పెంచటానికి ప్రయత్నించింది. (దిగుబడులు,పెట్టుబడుల నిష్పత్తిని పెంచటం ద్వారా) ఆ సమయంలో వామపక్షాలు ఎత్తిచూపినట్లుగా అధిక ఉత్పత్తులను సాధించటానికి శక్తివంతంగా ఉపయోగపడే భూసంస్కరణల అమలును ఈ వ్యూహం తగినవిధంగా చేపట్టలేదు. అది ఈ వ్యూహానికి సంబంధించిన లోపానికి సూచిక కాదు. ప్రభుత్వం యొక్క వర్గ స్వభావానికి సంబంధించినది. (భూస్వాములను సంతృప్తి పర్చటానికి అలాచేశారు.)

నెహ్రూ-మహలనోబిస్ వ్యూహాన్ని భిన్న దృక్పథం నుండి అర్థం చేసుకోవటానికి ఆర్థిక, గణాంకవేత్త అయిన అశోక్ రుద్ర రూపొందించిన నమూనాను నేను ఉపయోగిస్తాను. ఆయన ఆనాటి భారత ఆర్థికవ్యవస్థను మూడు భిన్నరంగాలుగా వర్గీకరించాడు. వ్యవసాయం, వ్యవసాయాధారిత పరిశ్రమలుగాను, గనులు, గనులపై ఆధారపడిన పరిశ్రమలుగాను, సర్వవ్యాప్తమైన మధ్యంతరాలుగానూ (విద్యుచ్ఛక్తి లాంటివి) విభజించి, మొదటి గ్రూపు ఉత్పత్తి చేస్తున్న ప్రస్తుత ఉత్పత్తులను రెండవ గ్రూపులోని పరిశ్రమలు దాదాపుగా వినియోగించటం లేదనే ముఖ్యమైన అంశాన్ని కనుగొన్నాడు.

మొదటి రంగం రెండవరంగంలో పని చేస్తున్నవారితో కూడా కలిపి అందరికీ ఆహారాన్ని, బట్టలను ఇతర అవసరమైన వస్తువులను సరఫరా చేస్తున్నది. ఇవి ప్రస్తుతం ఆ పరిశ్రమల్లో ముడిసరుకులుగా ఉపయోగించటానికి కాక, వ్యక్తుల అవసరాలను తీర్చుకోవటానికి ఉపయోగిస్తున్నారు. అందువలన గనులు, గనులపై ఆధారపడిన పరిశ్రమలు విస్తరించటం వలన ఆహారం, బట్టలు కాకుండా ఇతర ఉత్పత్తులు కావాలనేవత్తిడి వ్యవసాయ రంగంపై ఉండదు. ఆహారభద్రతను ఏ విధంగానూ దెబ్బతీయకుండానే ఆ పరిశ్రమలు విస్తరించగలవు. ఈ పరిశ్రమల విస్తరణకు అవసరమైన పారిశ్రామిక ముడి సరుకుల ఉత్పత్తి కోసం భూములను ఆహార ఉత్పత్తులకు దూరం చేయటం జరగదు.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశ ఉత్పత్తిరంగంలో మొదటి గ్రూపు ప్రధానంగా ఉన్నది. అందుకనుగుణంగానే ఎగుమతుల విధానం కూడా ఉన్నది. జనపనార, నూలుబటలు మాత్రమే ప్రధానంగా పారిశ్రామిక ఎగుమతులుగా ఉండేవి. అటువంటి పరిస్థితుల్లో అధిక ఆర్థికాభివృద్ధి రేటును సాధించటం కోసం ఎగుమతులను పెంచటం అంటే వ్యవసాయోత్పత్తులను మరింత ఎక్కువగా బయటికి పంపటంద్వారానే అది సాధ్యం అవుతుంది. అది భూమిని ఆహారధాన్యాల ఉత్పత్తి నుండి దూరం చేసి దేశ ఆహారభద్రతను ప్రమాదంలో పడవేస్తుంది.

మనం బయటి ప్రపంచంతో సంబంధాలు పెట్టుకున్నట్లయితే తూర్పు ఆసియా దేశాలకు వచ్చిన విధంగా ఎగుమతుల కోసం ఉత్పత్తి చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయటానికి విదేశీ పెట్టుబడులు వచ్చివుండేవని కొందరు వాదిస్తున్నారు. ఈమార్గం భారతదేశం అనుసరించదగినదా, కాదా అనే చర్చను పక్కన పెట్టినా (ఈ విధానం కార్మికులపైనా ఇతర ప్రజాస్వామిక హక్కులపై అమలు జరిపే నిర్బంధాల వలన) దీనిలో రెండు సమస్యలున్నాయి. మొదటిది విదేశాలకు ఎగుమతులు చేయటం కోసం (దేశంలో అమ్మటం కోసం కాదు) తక్కువ వేతనాలున్న మూడవ ప్రపంచదేశాలలో విదేశాలు ప్రత్యక్షంగా పెట్టుబడులు పెట్టటం అప్పటికి అరుదుగా ఉన్నది. రెండవదిపైన చర్చించిన కారణాల వలన ఆ విధమైన విదేశీ పెట్టుబడులను ఆకర్షించే విధానాలను అనుసరించే ప్రభుత్వాలు దేశ ఆహారభద్రతకు ప్రమాదం కలిగిస్తాయి.

ఆహారభద్రత సమస్య తీవ్రతనూ, చారిత్రక పరిణామాలను దృష్టిలో పెట్టుకొని పరిశీలించాలి. జార్జి బ్లిన్ అంచనాలను అనుసరించి "బ్రిటిష్ ఇండియా"లో ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో ఆహారధాన్యాల లభ్యత సుమారుగా తలసరి 200 కిలోగ్రాములుగా ఉంది. 1945-46 నాటికి 136.8 గ్రాములకు తగ్గింది. 1939-44 మధ్య ఐదు సంవత్సరాల సగటును తీసుకున్నా తలసరి ఆహారధాన్యాల లభ్యత 148.5 కిలోలుగానే ఉంది. 1943లో 30 లక్షల మంది ప్రజల ప్రాణాలను బలిగొన్న బెంగాల్ మహా క్షామానికి వలస ప్రభుత్వం అనుసరించిన యుద్ధకాలపు లోటు బడ్జెట్ విధానాలు కారణమైనప్పటికీ, ఆహారధాన్యాల తలసరి లభ్యత తగ్గుదల, తగినంత ఆహారం దొరకనివారి సంఖ్య పెరుగుతున్న పూర్వ రంగంలోనే దీన్ని చూడాల్సివుంటుంది. (ఇందు వలన ఆహారలభ్యత మరింత తగ్గితే ప్రజలు తట్టుకోలేని పరిస్థితికి నెట్టబడ్డారు.) సాగుభూమి పెరగకపోయినా, పంటల దిగుబడి పెంచటానికి కృషి చేయకపోయినా ఆహారధాన్యాలు ఉత్పత్తి చేస్తున్న భూమిని వాణిజ్యపంటలు పండించటం కోసం మళ్ళించటమే ఆహారధాన్యాల లభ్యత తగ్గటానికి కారణం.

**భూవినియోగాన్ని, దిగుబడులను పెంచాలి**

ఇటువంటి పరిస్థితులలో తలసరి ఆహారధాన్యాల ఉత్పత్తిని, లభ్యతను పెంచటానికి భూమి వినియోగాన్ని, దిగుబడులను పెంచే చర్యలు తీసుకోవటం అవసరం. ఇందుకు సాగుభూమిని పెంచటం, నీటిపారుదల సదుపాయం కల్పించటం, దిగుబడులను పెంచే ఇతరచర్యలు తీసుకోవటంతోపాటు వాణిజ్య పంటలు పండించటం కోసం భూమిని మళ్ళించకుండా చేయటం, కనీసం ఎగుమతుల కోసం పంటలు పండించటాన్ని నిరోధించటమైనా చేయాలి. (ఆ విధంగా మళ్ళించటం ప్రజలకు బట్టలందించటానికి అయినపుడు దాన్ని గురించి ప్రశ్నించాల్సిన పనిలేదు.)

నెహ్రూ-మహలనోబిస్‌ల వ్యూహం దీన్ని ఖచ్చితంగా సాధించింది. భూమి నుండి ఎక్కువ దిగుబడులను సాధించే విధంగా పెట్టుబడులు పెట్టటంతోపాటు (నీటిపారుదల రంగంలో లాగా) వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను పెంచే ఎటువంటి ప్రయత్నాన్నయినా నిరుత్సాహపరిచారు. ప్రపంచబ్యాంకు, నయా-సరళీకరణవాదులు చెబుతున్న "బయటి ప్రపంచం వైపుకు చూసే" వ్యూహంలో ఈ విధమైన ఎగుమతుల

పెంపు ప్రధానమైనది. నా అభిప్రాయంలో నెహ్రూ–మహలనోబిస్ వ్యూహం సారాంశం గనులు, గనులపై ఆధారపడిన పరిశ్రమలను ప్రోత్సహించటం, వ్యవసాయోత్పత్తులపై, వ్యవసాయ పునాదిపై ఆధారపడని, గనులు, ఖనిజ ఉత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమలను నిర్మించటం ప్రధానం. ఆ వ్యూహంలో చెప్పిన "పారిశ్రామికీకరణ"లో ఈ గ్రూపులో చెప్పిన వ్యవసాయోత్పత్తులు తక్కువ అవసరమైన పరిశ్రమల నిర్మాణం ప్రధానమైనది.

**"నెహ్రూ-మహలనోబిస్ వ్యూహం సారాంశం గనులు, గనులపై ఆధారపడిన పరిశ్రమలను ప్రోత్సహించటం, వ్యవసాయోత్పత్తులపై, వ్యవసాయ పునాదిపై ఆధారపడని, గనులు, ఖనిజ ఉత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమలను నిర్మించటం ప్రధానం. ఆ వ్యూహంలో చెప్పిన "పారిశ్రామికీకరణ"లో ఈ గ్రూపులో చెప్పిన వ్యవసాయోత్పత్తులు తక్కువ అవసరమైన పరిశ్రమల నిర్మాణం ప్రధానమైనది."**

ఈరోజుకు కూడా "స్వేచ్ఛావాణిజ్యం", "మరింత సరళీకరించబడిన వాణిజ్యం" గురించి ప్రచారం చేస్తున్న ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లియు.టి.వో.) లాంటివి చేస్తున్న ప్రచారంలో అంతగా పట్టించుకోని ఒక మౌలిక సమస్య ఉంది. అన్ని దేశాలలోనూ మౌలికమైన వనరులు, నైపుణ్యం ఉన్నాయని (అన్ని దేశాలలో ఒకే మోతాదులో కాకపోయినా) కాబట్టి అన్ని దేశాలు సరుకులను ఉత్పత్తి చేయవచ్చునని, దానితో అందరికీ పూర్తి ఉద్యోగాలు లభిస్తాయని (ఆవిధంగా భారతదేశం లాంటి దేశాలలో జీవిత వాస్తవంగా మారిన "పారిశ్రామికరహితం" కావటాన్ని నిరోధించవచ్చునని) చెబుతారు. అన్నిదేశాలు అన్ని సరుకులను ఉత్పత్తి చేసేటపుడు ఏ దేశం ఏ సరుకులను ఉత్పత్తి చేయాలనేది ఆయా సరుకుల ఉత్పత్తిలో "ఇతర దేశాలకన్నా ఆ దేశాలకున్న ఆధిక్యత" ననుసరించి, వాణిజ్యంచేత నిర్ణయించబడుతుందని చెబుతారు. ఈవాదన పూర్తిగా అసంబద్ధమైనది. ఉష్ణమండల దేశాలలో ఉత్పత్తి అయ్యే వ్యవసాయ సరుకులు ఉష్ణమండల దేశాల్లోని భూముల్లో మాత్రమే పండుతాయి. సమశీతోష్ణమండల దేశాలలోని భూముల్లో పండవు. (అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలన్నీ ఈ ప్రాంతంలోనే ఉన్నాయి.)

ఉష్ణ మండల దేశాలలో భూములు పరిమితంగా ఉన్నాయి. ఇంతకు ముందే చెప్పినట్లుగా ఈ దేశాలలోని భూములలో దిగుబడులను పెంచటానికి (అందుకు నీటిపారుదల, దిగుబడులను పెంచే ఇతర చర్యలు తీసుకోవటానికి ప్రభుత్వ చొరవ తప్పనిసరిగా అవసరం. ఇటువంటి చర్యలను వలసవాద ప్రభుత్వం తీసుకోలేదు. ద్రవ్యలోటు పెరగకుండా చూడాల్సిన బాధ్యతల వలన నయా–సరళీకరణ విధానాలను అమలు జరిపే ప్రభుత్వం కూడా ఈ చర్యలను తీసుకోలేదు) తగిన చర్యలు తీసుకోని నేపధ్యంలో, ఉష్ణమండలదేశాలలో పండిన పంటల ఎగుమతులకు ప్రత్యక్షంగాకాని, పరోక్షంగాకాని (పారిశ్రామిక ఉత్పత్తులుగా



మార్చటం)డిమాండ్ పెరుగుతుంది. కాబట్టి స్థానిక ప్రజానీకానికి దేశీయవనరుల నుండి ఆహారధాన్యాల లభ్యత తప్పనిసరిగా తగ్గుతుంది.

ఇదేమీ పెద్ద సమస్య కాదని, వాణిజ్య పంటలను లేదా వాణిజ్యపంటలతో ఉత్పత్తి చేసిన పారిశ్రామిక సరుకులను ఎగుమతి చేయటం ద్వారా వచ్చిన విదేశీ మారకద్రవ్యంతో ఆహార ధాన్యా లను నిరంతరం దిగుమతి చేసుకోవచ్చునని చెబుతారు. కాని కనీసం మూడు కారణాలవలన ఇది సమ స్యాత్మకం అవుతుంది.

మొదటిది బియ్యం లాంటి ఆహార ధాన్యాలను (దేశంలో ఎక్కువ డిమాండ్ ఉన్న ఆహార ధాన్యం వరి) దిగుమతి చేసుకో వటానికి మనకు అవసరమైన మేరకు ప్రపంచ మార్కెట్లో దొరకవు. కాబట్టి భారతదేశం తన అవసరాలకు సరిపడా వరిధాన్యాన్ని పండించుకోవటం మినహా మరోమార్గం లేదు.

రెండవది ఆహారదిగుమతుల కోసం అభి వృద్ధి చెందిన దేశాలపై ఆధారపడటంతో వారు మనపై వత్తిడి తెచ్చి తమ స్వప్రయోజనాలు నెరవేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తారని "హరిత విప్లవం" ప్రారంభించటానికి ముందే ఇందిరా గాంధి ప్రభుత్వం గుర్తించింది. మూడవది ఆహారం చాలా కీలకమైనది కాబట్టి భారతదేశం లాంటి పెద్దదేశం దిగుమతులపై ఆధారపడి ఉండజాలదు. భారతదేశం ఆహారధాన్యాల కోసం ప్రపంచమార్కెట్లోకి వెళితే అక్కడ ధరలు పెరుగుతాయి. ఆహారధాన్యాలను తీసుకురావటం లో ఏమాత్రం ఆలస్యం జరిగినా అది వినాశకర పరిణామాలకు దారితీస్తుంది.

కాబట్టి ఉత్పత్తి పునాదిని గనులు, ఖనిజాలపై ఆధారపడిన పరిశ్రమలకు మళ్ళించటం అత్యవసరమేకాక, అత్యంత దూరదృష్టితో చేసినది. ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఆహారధాన్యాలు పండించే భూమిని ఎగుమతుల కోసం ఉద్దేశించిన పంటల కోసం మళ్ళించకుండా, ఆ ఉత్పత్తులను ఎగుమతుల పెంపుదల నుండి మినహాయించటానికి ప్రయత్నించారు. నెహ్రూ–మహలనోబిస్ వ్యూహంలోని కీలకాంశం ఇదే. ఐ.జి.పటేల్‌తో సహా అనేక మంది ఆర్థికవేత్తలు ఆ రంగాలలో "ఇతరుల కన్నా మనకు ఉన్న ఆధిక్యత" ప్రాతిపదికగానే

**"'బయటి ప్రపంచం వైపు దృష్టి సారించే వ్యూహంతో అబ్బురపరిచే అభివృద్ధిని సాధించాయని చెబుతున్న కొన్ని ఆసియా దేశాలు (జపాన్ కూడా వాటిలో ఉంది) ఈరోజు తీవ్రమైన ఆర్థికసమస్యల నెదుర్కొంటున్నాయి. వాటిలో చాలా దేశాలు వారి విదేశీ చెల్లింపుల సమస్యను పరిష్కరించు కోవటానికి వలస పాలనాకాలం నాటివలే ప్రాథమిక సరు కుల ఎగుమతులకు తిరిగి వెళ్ళాయి."**

నెహ్రూ-మహలనోబిస్‌ల వ్యూహాన్ని బల పర్చారు. మనకు అత్యధికంగా ఉన్న ముడి ఇనుపఖనిజం నిల్వలను దృష్టి పెట్టుకొన్నపుడు అది సరైనదే అవుతుంది. కానీ దానికి భిన్నంగా "ఇతరుల కన్నా మనకు ఆధిక్యత" అన్న అంశాన్ని వదులుకోవలసిన అవసరాన్ని గురించి నేను చెపుతున్నాను. నెహ్రూ-మహలనోబిస్‌ల వ్యూహాన్ని వ్యతిరేకించే వారు చెబుతున్నట్లుగా గనులు, ఖనిజాధారిత పరిశ్రమలలో మనకేమాత్రం ఆధిక్యత లేనప్పటికీ, అప్పటికి ఎగుమతులు జరుగుతున్న రంగాలలోనే మనకు ఆధిక్యత ఉన్నప్పటికీ, (నిరాశాజనకంగా ఉన్న ఎగుమతుల పరిస్థితే ఈ వ్యూహం సరైనదని చెబుతున్నది.) దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి అత్యంత తక్కువగా ఉన్న ఆహారలభ్యతను మరింత ప్రమాదంలోకి నెడుతూ, ఆహారధాన్యాలు పండించే భూమిని ఎగుమతులకు ఉద్దేశించిన పంటల కోసం భారతదేశం మళ్ళించజాలదు.

### తగ్గుతున్న ఆహారలభ్యత

నెహ్రూ-మహలనోబిస్‌ల వ్యూహం దేశ ఆహారధాన్యాల అవసరాన్ని, వ్యవసాయాన్ని పట్టించుకోకుండా భారీ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇచ్చిందని విమర్శించేవారున్నారు. వాస్తవంగా భారతదేశ ఆహారభద్రతకు ఇది అవసరం అనే దాని నుండే ఈ వ్యూహం యొక్క ప్రాధాన్యత పెరుగుతుందని నేను అభిప్రాయపడుతున్నాను. నిరాశాజనకంగా ఉన్న ఎగుమతుల వలన "అంతర్గత అవసరాలపై" దృష్టి పెట్టే స్వభావం పెరిగిందనే తప్పుడు అభిప్రాయం ఉన్నా, దేశ ప్రజల ఆకలిని తీర్చి, ఆహారభద్రతను కల్పించటానికి ఇది అత్యవసరం. బ్రిటిష్ వలస పాలనలో ఉన్నపుడు 1939-44 సంవత్సరాలలో తలసరి ఆహారలభ్యత 148.5 కిలోగ్రాములకు పడిపోగా, నెహ్రూ ప్రభుత్వ చివరి సంవత్సరాలలో ఆహారధాన్యాల తలసరి నికరలభ్యత 168.44 కిలోగ్రాములకు పెరిగింది. (1961 65 సంవత్సరాల మధ్య).

ఇది మరింతగా పెరగటానికి అవకాశం ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం భూస్వామ్యవర్గ వత్తిడికి లంగి భూ పునఃపంపకాన్ని తీవ్రస్థాయిలో అమలు జరపకపోవటంతో పాత సామాజిక వ్యవస్థ కొనసాగటంతో పాటు, వ్యవసాయరంగంలో ఉత్పాదక శక్తుల పెంపుదలను నిరోధించిందని వామపక్షాలు చేస్తున్న విమర్శ సరైనదేనని స్పష్టమౌతున్నది. నెహ్రూ-మహలనోబిస్‌ల వ్యూహం "బయటి ప్రపంచం వైపు దృష్టి సారించలేదని" చేస్తున్న విమర్శలో ఏమాత్రం పసలేదు. నెహ్రూ పాలనా కాలంనాటి కన్నా, నెహ్రూ వ్యూహం ప్రభావంలో ఉన్న సరళీకరణ విధానాల ప్రారంభానికి ముందుకాలం నాటి కన్నా సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత అధిక పెరుగుదల రేట్లు సాధించామని చెబుతున్నారు. 1980వ దశకంలో తలసరి ఆహారధాన్యాల లభ్యత సుమారుగా 180 కిలోగ్రాములకు పెరగగా, ప్రస్తుతం నెహ్రూ మరణించిన నాటి కన్నా చాలా తక్కువగా, తలకు 161 కిలోగ్రాములకు పడిపోవటం యాదృచ్ఛికం కాదు. ఎక్కువ మందికి అవసరమైనన్ని ఆహారధాన్యాలు లభించకపోవటం అనే సమస్య నెహ్రూ మరణించిన నాటి కన్నా ఈనాడు మరింత తీవ్రంగా ఉన్నది.

"బయటి ప్రపంచం వైపు దృష్టి సారించే" వ్యూహంతో భారతదేశం కన్నా ఆర్థిక పెరుగుదల రీత్యా చూసినపుడు అబ్బురపరిచే అభివృద్ధిని సాధించాయని చెబుతున్న కొన్ని ఆసియా దేశాలు (ఆసియాలో ఎగుమతులపై ఆధారపడి విజయవంతంగా అభివృద్ధిని సాధించిందని చెబుతున్న జపాన్ కూడా వాటిలో ఉంది) ఈరోజు తీవ్రమైన ఆర్థికసమస్యల నెదుర్కొంటున్నాయి. వాటిలో చాలా దేశాలు వారి విదేశీ చెల్లింపుల సమస్యను పరిష్కరించుకోవటానికి వలస పాలనాకాలం నాటివలే ప్రాథమిక సరుకుల ఎగుమతులకు తిరిగి వెళ్ళాయి. (థాయ్‌లాండ్, ఇండోనేషియాలు స్పష్టమైన ఉదాహరణలు).


నేను ఇంతకు ముందే వివరించినట్లుగా ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఆహారధాన్యాలు పండించే భూముల్ని ఎగుమతులకు అవసరమైన ఉత్పత్తుల కోసం మళ్ళించటాన్ని నిరోధించే నెహ్రూ-మహలనోబిస్‌ల వ్యూహం ఆనాడే కాక, ఏకాలంలోనైనా అనుసరించతగినది. ఏ విధమైన సామ్రాజ్యవాద వ్యతిరేక అభివృద్ధి వ్యూహంలోనైనా ఇది కీలకమైనది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడులు పోగుపడటంతో ఉష్ణమండల దేశాలలోని భూములలో పండే వివిధరకాల ఉత్పత్తులకు అక్కడ గిరాకి పెరిగింది. దీనితో ఆభూములను ఆహారోత్పత్తి నుండి దూరం చేయటంతో అక్కడి ప్రజలకు ఆహారధాన్యాల లభ్యత మరింత తగ్గే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి నుండి వెనక్కు మరలాలంటే ఆహారధాన్యాలను పండించే భూమిని ఎగుమతుల కుద్దేశించిన పంటల కోసం మళ్ళించకుండా ఉండటం, ఆహారధాన్యాల లభ్యతను తగ్గించని ఎగుమతులపై కేంద్రీకరించటం చేయాలి. అటువంటి వ్యూహాన్ని అమలు చేయాలంటే భూసంస్కరణలను అమలు చేయాలి. ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచటానికి అన్ని రకాలైన చర్యలూ తీసుకోవాలి. ఆహారభద్రతను ప్రమాదంలో పడవేసే ఎగుమతులనుండి దూరంగా ఉండటం ముఖ్యమైనది.

వాస్తవంగా చూడని వ్యూహాన్ని గురించి చదివి అర్థం చేసుకోవటం సాధ్యమేనా? ఒక వ్యూహాన్ని గురించి తనవరకు తాను అర్థం చేసుకోవటానికి, ఆ వ్యూహాన్ని రూపొందించిన తీరును తర్కబద్ధంగా అవగాహన చేసుకోవటానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవాలి. ఐన్‌స్టీన్‌తో తాను సమావేశం అయిన సందర్భంగా జరిగిన చర్చను గురించి జాన్ మేనార్డ్ కీన్స్ చెప్పిన కథ కన్నా ఈ వ్యత్యాసాన్నిగురించి మరెవరూ స్పష్టంగా వివరించలేరు. ఐన్‌స్టీన్ కీన్స్‌తో ఈవిధంగా స్పష్టంగా చెప్పాడు: "అర్థశాస్త్రాన్ని గురించి నాకేమీ తెలియదు. మార్క్స్ చెపుతున్నది సరైనదని మాత్రమే నాకు తెలుసు. ఎలా సరైనది అని నేను మీకు వివరించలేను." మార్క్స్‌ను గురించి ఐన్‌స్టీన్ అవగాహన సరైనదే. అదే తర్కంతో ఆయన ముందుకు సాగిపోయాడు. అదేవిధంగా స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో వ్యవసాయ ఉత్పత్తులను గానీ, వ్యవసాయాధారిత పరిశ్రమలలో తయారైన సరుకులను గానీ ఎగుమతి చేయరాదని చాలా మంది భావించినట్లుగా నేను నమ్ముతున్నాను. నెహ్రూ-మహలనోబిస్‌లు ఈ అవగాహనతో ఉన్నారు. ఈ అవగాహనను బలపర్చటానికి సరైన సిద్ధాంతం (అది నాకు తెలియదు) కోసం ఎవరైనా తగాదాపడ్డా, ఈ అవగాహన సరైనది కాదని ఎవరూ తగాదా పడలేరు.

**(అనువాదం. ఎ. కోటిరెడ్డి)**

సిద్ధాంతం

# మిత్రవర్గాల మధ్య వైరుధ్యాలను వైషమ్యాలుగా మారనీయకూడదు



**ఎ. రవి**

– ఈ కూలోళ్ళ పనే నయం. వాళ్ళ కూలీరేట్లు భరించలేకున్నాం.

– ఫ్యాన్లు క్రింద ఒళ్ళు కదలకుండా కూర్చుని ఉద్యోగం చేసే వాళ్ళకూ్కడా ఇంకా జీతాలు పెంచాలి?

– గిట్టుబాటు ధరంటూ ధాన్యం రేటు పెరుగుతుంటే బియ్యం రేటు పెరక్క ఏమౌతుంది?

ఈ మాటలు ఏ భూస్వాములో, పెట్టుబడిదారులో అంటే ప్రత్యేకంగా ఆలోచించక్కర్లేదు. నిత్యం శ్రమ దోపిడీతో తమ సౌధాలు నిర్మించుకునే వారు ఇంతకన్నా హీనంగానే యోచిస్తారు. కానీ ఇలాంటి వ్యాఖ్యలు శ్రామిక వర్గం మరొక శ్రామికవర్గంపై చేస్తున్నారు. బలమైన వాదనలు విన్పిస్తున్నారు! తాము కునారిల్లి పోవడానికి కారణం సాటి శ్రామిక ప్రజలేనన్న భావన బలంగా క్రమేపి సాటుకుపోతోంది. అందుకే ఇది కమ్యూనిస్టులకు చర్చనీయాంశం. ఈ భావనలు సాధరణ ప్రజలకే పరిమితంకాలేదు. పార్టీ సభ్యులు, వివిధ స్థాయి కార్యకర్తల్లో కూడా గూనీయంగా ఉన్నాయి. ఈ దరభిప్రాయాలను తొలగించేందును ఏ విధంగా కృషిచేయాలో యోచించాలి.

రైతుల కష్టాలకు కూలీలే కారణం.. తమ కోసం ప్రభుత్వం ఇంకా ఖర్చు చేయకపోవడానికి ఉద్యోగుల జీతాలే కారణం.. ఏ పని చేయాలన్నా కార్మికుల కూలీరేట్లు, జీతాలు, వేతనాలే అడ్డంకి.. ప్రభుత్వాలు ఓట్లకోసం పేదలకిచ్చే సబ్సిడీ, సంక్షాలు పథకాలు ఖజానాను ఖాళీ చేయాడంతో పాటు ప్రజల్ని సోమరులుగా మారుస్నున్నాయి.. ఇటువంటి మరెన్నోభావాలు తరచూ వ్యక్తమౌతున్నాయి. వీటిని పాలక వర్గాలే ఎలా ఎగదోస్తున్నాయో నూతన ప్రభుత్వాల వైఖరులే వెల్లడిస్తున్నాయి.

విజయవాడ పరిసరాల్లోనే రాజధానిని నిర్మిస్తాం. అందుకు అవసరమయ్యే భూములిచ్చేందుకు రైతులు ముందుకు రావాలి. లేనట్లైతే మరోచోట నిర్మించాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ ప్రకటనను స్వాగతించే వారికి రైతులకు విజ్ఞప్తిగాతోస్తుంది. వ్యతిరేకించే వారికి రైతులకు హెచ్చరికలా ఉంటుంది. రైతులు భూములిచ్చేందుకు ముందుకు రాకుంటే రాజధాని తరలిపోతుంది. మనకొచ్చే ఉపాధి, అభివృద్ధి అవకాశాలు వెనక్కుపోతాయి. అందుకు రైతులే కారణమౌతారు. ఇదే జరిగితే ముందుగా ఆగ్రహించేది ఆ ప్రాంత కార్మికులు ఉద్యోగులు, చిన్నవ్యాపారులు. ప్రస్థుతం పెన్షన్లు ఎక్కువగా బోగస్ లబ్ధిదారులు పొందుతున్నారు. ఫలితంగా వాస్తవ లబ్ధిదారులకు అందడంలేదు. వీటిని ఏరివేస్తామంటూ మంత్రి ప్రకటించారు. ఇది అర్హత కలిగి పెన్షన్ పొందని వారికి ఊరట కల్గించడమే కాదు. దాన్ని వారు నూటికి నూరుపాళ్ళ నిజమని భావిస్తున్నారు. తమకు పెన్షన్ రాకపోవడానికి బోగస్ లబ్ధిదారులే కారణం అనుకోవడంద్వారా ప్రభుత్వాల పాత్రను మార్చిపోతున్నారు. రైతు, డ్వాక్రరుణమాఫీ ఏమాత్రం పరిష్కారం కాదు. ఇందువల్ల ఖజానా ఖాళీ అవుతుంది తిరిగి పనులు కావాలంటే పన్నులు వేయకతప్పదని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు స్మార్ట్‌సిటీల నిర్మాణంపై మాట్లాడారు. మధ్యతరగతి ప్రజల్లో గుణనీయ ప్రజానీకం ఇది ముమ్మాటికీ నిజమని స్వాగతిస్తూ మాట్లాడుతున్నారు. మనపై పన్నులు, ధరాభారాలకు రైతులు, పేదలకిచ్చే అనేక సబ్సిడీలే కారణమని వాదిస్తున్నారు. పాలకవర్గాల వాదనల్నే తమ వాదనలుగా ప్రకటిస్తున్నారు.

తమ వ్యవసాయం కష్టాలసాగుగా మారడానికి కారణం పాలకవర్గాలేనన్న విషయాన్ని రైతాంగం గ్రహించే అవకాశాల కంటే కూలీలే కారణమన్న భూస్వాముల భావజాలం గ్రహించే అవకాశాలు ఎక్కువ. కానీ ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగడానికి, గిట్టుబాటు ధర దక్కకపోవడానికి, బ్యాంకులనుండి రుణ పరపతి అందకపోవడానికి పాలకవర్గాలే తప్ప వ్యవసాయ కార్మికులు కాదు. సాగులో కష్టాలు కౌలుదారులకు మిగిలితే, కాలురేటు, బ్యాంకు పరపతి, ప్రభుత్వ నష్టపరిహారాలు పేరుతో మిగులు భూయజమానులను చేరుతోంది. పేద మధ్యతరగతి రైతాంగానికి బ్యాంకుల్లో రుణాలందవు. భూస్వాములుకు నిరాటంకంగా అందుతాయి. సహకార సంఘాలు (సొసైటీలు)పై పూర్తి పెత్తనమంతా భూస్వాములదే. తమ కష్టాలకు కారకులు పాలకవర్గలన్న విషయాన్ని గ్రహించాలి. ఉల్లిరైతుకు కేజీ 5 రూపాయాలు దక్కితే మార్కెట్లో 30 రూపాయాలు అమ్ముతున్నారు. తద్వారా గిట్టుబాటుధర రైతులకు కాక మధ్యదళారులకూ, వ్యాపారులేకన్నది తెలుస్తుంది.

ఉద్యోగులు ఫ్యాన్లు క్రింద కూర్చుని పని చేసినా వేలకువేలు జీతాలందుతున్నాయి. ఏం చేయకపోయినా వారి జీతాలువారికి వచ్చేస్తున్నాయన్నది నేతిబీరలో నెయ్యిలాంటిది. వీరు కూడా కార్మికులు, వ్యవసాయ కార్మికుల్లా తమ శ్రమను అమ్ముకునే ఐతే ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా శ్రమలో నైపుణ్యాన్ని పొందుగలరు. నైపుణ్యశ్రమను అమ్ముకుంటున్నందు కూలీరేటుకంటే ఉద్యోగులు వేతనాలు ఎక్కువగా పొందగల్గుతున్నారు. అయితే వీరికి పెరిగిన ధరలకు తగ్గటుగా వేతనాలుండడం లేదు. ఉద్యోగుల్లో కూడా పలు కేటగిరిలు తెచ్చి ఒకే శ్రమకు వేర్వేరు వేతనాలు ఇస్తున్నారు. రేషనలైజేషన్ వంటి రూపాల్లో సిబ్బందిని రాను రాను తగ్గిస్తుండడంతో ఇద్దరు ముగ్గురు చేసే పనుల ఒకరిపైనే భారం మోపుతున్నారు. ఉదాహరణకు నగదు బదిలీ, జన్‌ధన్‌యోజన పేరుతో దేశప్రజలందరికీ బ్యాంకు ఖాతాలు తెరవమంటుంది. ఫలితంగా బ్యాంకు ఖాతాదారుల సంఖ్య 3, 4 రెట్లు పెరుగుతుంటే బ్యాంకు సిబ్బంది సంఖ్య గతంకంటే తగ్గుతున్నారు. పని భారం పెరుగుతన్నందునే బ్యాంకు ఉద్యోగులు ప్రజలపై రుసరుసలాడుతున్నారు. అయితే పై అధికారి క్రింది వానిపై రుబాబు చేస్తే ఆ రుబాబు ప్రజలపై చూపుతున్నదీ కూడా ఉంది. బ్యూరోక్రసీ నిచ్చెన మెట్లులాంటి వ్యవస్థలే ఇందుకు అవకాశమిస్తున్నాయి. ఉద్యోగుల్లో కొందరి అవినీతి కూడా ప్రజల ఆగ్రహానికి కారణమౌతున్నాయి. వాటిపై సముచిత రీతిలో స్పందిస్తూనే ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున

మేయదని గ్రహించాలి. డబ్బు సంపాదనే ఏకైక లక్ష్యంగా ఉన్న ప్రభుత్వ వ్యవస్థలో పైనుండి కిందికి అవినీతి వ్యవస్థీకృతమైంది. అవినీతినిర్మూలన వ్యవస్థ మార్పుతోనే సాధ్యం అవుతుందని గ్రహించాలి.

బ్యాంకు రుణమాఫీ, రూపాయికే కిలో బియ్యం, ఉపాధి హామీ పనులు, పెన్షన్లు ఇవ్వన్నీ ప్రజల్నీ సోమరి పోతులుగా మారుస్తున్నాయని ఉద్యోగులు వివిధ మధ్యతరగతుల ప్రజానీకం వాదిస్తున్నారు. కాబట్టి సబ్సీడి, సంక్షేమ పథకాలు వ్యర్థమని, రద్దు చేయాలన్న పాలక వర్గాల వాదనలకు వంత పాడుతున్నారు. ఈ వాదనలు వారిపై ఇంతగా ప్రభావితం కావడానికి మేధావుల పాత్ర తక్కువేమి కాదు. సాధారణ పరిపాలన మినహ ప్రజాసేవలన్నీ వినిమయ సరుకుగా మార్చలన్న ప్రపంచీకరణలో భాగమిది. సబ్సీడి పథకాల వల్ల శ్రామికులు సోమరు లైతే భూస్వాములు, పెట్టుబడిదారులు కష్ట జీవుల వ్వాలి. ఆచరణలో ఈ రెండు నిజం కాదు. రాష్ట్ర మంతటా రైతు రుణమాఫీ 8 వేల కోట్ల రూపాయలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కలు రోజురోజుకోరకంగా మారుతున్నాయి. చేసే వరకూ ఇంతని చెప్పలేం . కానీ బ్యాంకులకు కొన్ని కార్పొరేటు కంపెనీలు ఎగ్గొట్టిన బకాయిలు 1.50 లక్షల కోట్ల రూపాయిలు పై మాటే. కింగ్ ఫిషర్ అధినేత విజయ మాల్యా ఉద్దేశ్య పూర్వకంగా ఎగ్గొట్టిన మొత్తం 7 వేల కోట్లు. పైగా దేశానికి అన్నం పెట్టే రైతుకు రుణమాఫీలో సింహ భాగం 8 వేల కోట్లు, రుణమాఫీ చేస్తే సోమరులౌతారంటే కార్పొరేటు కంపెనీలు ప్రజల సొమ్ము కొట్టుకుని తింటున్న వారినేమనాలి. కానీ ఎక్కడా వీరి ప్రస్తావన ఎందుకు రావడం లేదు. కార్పొరేట్ కంపెనీ అధినేతలకు పంచభక్ష పరమాన్నాలు పెట్టి, సంపద సృష్టికర్తలకు గంజినీళ్ళు పోయడం ఏం న్యాయమో ప్రశ్నించాలి. చెరువులో మట్టి త్రవ్వి గట్టుమీద పోస్తే వర్షాలకు చెరువుల పడుతున్నప్పుడు ఉపాధి హామీ పథకం వల్ల ప్రయోజనమేంటి? గంట, రెండు గంటల పనికి 100, 200 రూపాయిలు ఇస్తున్నారు. వారిని సోమరి పోతుల్ని చేయడానికి కాకుంటే ఎందుకీ పథకం అని భూస్వాములతో మన మిత్ర వర్గాల ప్రజలే గొంతు కలుపుతున్నారు. పనిచేయకుండా కూలీ పొందే సంస్కృతిని మనం ప్రోత్సహించకూడదు. ఉపాధి కూలీల సమస్యలపై మనం పని చేయడం సరికాదని వాదించే పార్టీ కార్యాకర్తలు కూడా గణనీయంగా ఉన్నారు. దేశంలో గంట పనికి ఎంతకూలీ ఇవ్వాలనీ కొలబద్ద ఏమైనా ఉందా? ఉపాధి వేతనం 169 రూపాయలు ప్రకటించింది వేతనాలు ఎక్కడాఅమలు కావడం లేదు. అమలౌతుందనుకున్నా వంద రోజులకు 16900 రూపాయలు దక్కుతుంది. అంటే నెలకు 5500 రూపాయలవుతుంది. కానీ కార్పొరేటు కంపెనీల సిఈఓలకు ఏటా 10 నుండి 40 కోట్ల వేతనాలుగా దక్కుతున్నాయి. అంటే నెలకు కోటినుండి 3 కోట్లకు పైగా వేతనాలు అందుతున్నాయి. వీరేం చాకిరి చేస్తున్నారనీ, సంపద సృష్టిస్తున్నారని ఇంతేసి వేతనాలు ఇస్తున్నారు. ఎంఎల్ఏలకు 1.50 లక్షలు, ఎంపీలకు 2.50 లక్షల రూపాయలు వేతనాలు గౌరవంగా చెల్లిస్తున్నారు. వీరంత ప్రజా సేవకులే ఎవరికి తెలీదు. మరికూలీలు వేతనాలపై నే చర్చను ఎందుకు తెరపైకి తెస్తున్నారో యోచించాలి.

ఈ భావాలను నమ్ముతున్న శ్రామిక వర్గాలన్నీ భూ స్వాములు, పెట్టుబడిదారులు శ్రామిక దోపిడికి గురౌతున్నావారే. దోపిడీకి గురౌతున్న వర్గాల వారు తమతోటి వర్గ ప్రజల వల్లే తమ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని భావిస్తున్నారు. అందువల్ల మారాల్సింది సమాజం కాదు, నావ ముందున్న ఇతర శ్రామిక వర్గ ప్రజల ధోరణులేనని అనుకుంటున్నారు. మెజార్టీ ప్రజల్లో ధోరణులు ఇలానే ఉన్నాయి.

భారతదేశంలో విప్లవం ద్వారా వ్యవస్థను మార్చాలనుకుంటున్న కమ్యూనిస్టులకు ఇది సవాలు వంటిది. దేశంలో సామ్రాజ్యవాదులతో మిలాఖత్ అయ్యి భూస్వాములు, పెట్టుబడిదారుల దోపిడీకి గురౌతున్న మిగిలిన వర్గాల ప్రజానీకం ఏకమై విప్లవాన్ని తెస్తారని గుర్తిస్తున్నాయి. కార్మిక వర్గ నాయకత్వంలో వ్యవసాయకార్మికులు, పేదరైతులు ప్రధాన మిత్రుత్వంతో మిగిలిన వర్గాలన్ని ఐక్యమై విప్లవం సాగిస్తాయని శాస్త్రీయంగా నిర్ధారించుకున్నాం. ప్రపంచంలో కోటానుకోట్ల వైరుధ్యాలుంటాయి. మనిషికి మనిషికి మధ్య అనేక వైరుధ్యాలుంటాయి. అలాగే విప్లవ మిత్ర వర్గాల మధ్య వైరుధ్యాలుండడం సహజం. పాలకవర్గాలు వీటినే తమ మనుగడ కోసం వైషమ్యాలుగా మారుస్తున్నాయి. ఇందువల్ల దేశంలో పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఐక్యం కావాల్సిన మిత్రవర్గాలు భావాల పరంగా దూరంగా జరుగుతున్నాయి. ఇందుకు రాజకీయ పార్టీలు, కులం, మతం, తదితర సాంస్కృతిక రూపాల్ని వినియోగించుకుంటున్నాయి. వీరి చర్యల వల్ల ఆచరణలో ఐక్యంకాకుండా అవరోధాలుగా నిలుస్తాన్నాయి. ఇవి భౌతికంగా ఒక మిత్ర వర్గానికి మరొకవర్గం వ్యతిరేకంగా ప్రత్యక్ష కార్యాచరణలోకి రాకపోవచ్చు కానీ తమ దుర్గతికి సాటి ప్రజలేనని బలంగా భావించడం ద్వారా వాస్తవ దోపిడి వర్గాలకు వ్యతిరేక పోరాటాల్లో కలిసి రావడంలో మీమాంసలు వ్యక్తం అవుతున్నాయి.

నిర్థిష్ట వ్యవస్థలో పాలక వర్గాల భావజాలమే పాలిత వర్గాల భావజాలంగా తీర్చిదిద్దబడుతున్నట్లుగా అన్ని కాలాల్లో చూస్తున్నాం. అందరి భావజాలంపైనా పాలక వర్గాల అధిపత్యం వ్యవస్థీకృతం అవుతుంది. ఫలితంగా ప్రజానీకం పాలక వర్గాల దోపిడిని సూటిగా గుర్తించలేక పోతున్నారు. గుర్తిస్తే ప్రజానీకం తమ పోరాటాన్ని సూటిగా పాలక వర్గాలపై సాగించగలుగుతారు. అందుకు పాలక వర్గాలు ప్రజల దుర్గతికి తమ దోపిడీయే కారణమన్న విషయాన్ని సాధ్యమైన మేరకు మరుగునపరుస్తూంటాయి. లేదా వాస్తవ కారకుల్ని గుర్తించకుండా చేయడం వల్ల ప్రజా వెల్లువల్ని మళ్ళించ గల్లుతున్నాయి. ఇంకా చెప్పాలంటే తమ దోపిడికి గురయ్యే వర్గాల మధ్య వైరుధ్యాలను వైషమ్యాలుగా మార్చి తాము తప్పించుకుని దోపిడీని యధేచ్ఛగా కొనసాగిస్తు న్నారు. అంతగా వాస్తవాలు గ్రహిస్తే కర్మ సిద్ధాం తాన్ని ప్రయోగించే రణతంత్రం ఎలానూ ఉండనే ఉంది.

నేడు మన దేశంలో దోపిడికి గురయ్యే వర్గాల మధ్య చొచ్చుకుపోతున్నా ఈ విద్వేష భావాలు చేధించకుండా మిత్రవర్గాల్ని ఐక్యం చేయలేం. కార్యాచరణలోకి పూర్తిస్థాయిలో దించడం ఇంకా ఆలస్యమౌతుంది. సమాజ మార్పుకోసం సాగే కృషిలో మిత్రవర్గాల వైరుధ్యాలను వైషమ్యాలుగా చూడడం ఓ భాగం కావాలి. వీటిని కనిష్టస్థాయికి తగ్గించగల్గే కార్యాచరణ రూపాలు ఎంచుకోవాలి. మిత్ర వర్గాల పట్ల మెజారిటీ జనంలో ఉన్న భావాలు ఏ విధంగా అహేతుకమైనవో విప్పిచెప్పాలి.

ఏ వర్గానికావర్గ ప్రజల సమస్యలపై నిత్యం పోరాటాలు సాగించడం ద్వారా వారిని ఐక్యపర్చాలి. తద్వారా తమ వాస్తవ వర్గ శత్రువును గుర్తించగల్గుతురు. దాంతో పాటు తమ శత్రువే తమ తోటి వర్గాలకూ శత్రువని తెలుసుకుంటారు. ఫలితంగా ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా మిత్ర వర్గాలన్నీ ఐక్యం కావలన్న భావన వారిని ఒక్కటి చేస్తుంది. ఇదే ఆయారంగాల్లో పనిచేస్తున్న కార్యకర్తల దీర్ఘకాలిక కర్తవ్యంగా ఉండాలి. ఇందుకనుగుణంగా తక్షణ కార్యాచరణ ఉండాలి. దీంతో పాటు ఆయారంగాల్లో ప్రచారాందోళన, పోరాటాల్లో ఉమ్మడి శత్రువులెవరు, మన మిత్రులెవరో గుర్తుచేయాలి. ఆయారంగాల కార్యక్రమాల్లో విధిగా మిగిలిన వర్గసంఘాల నాయకుల సంఘీభావ సందేశాలివ్వాలి. ఐక్యవేదికగా నిర్థిష్ట సమస్యలపై కలసి కార్యాకలాపాలు తరచుగా నిర్వహించాలి. భావాలపై ఆధిపత్యం చూపుతోన్న కులం, మతం, కళలు, రాజ్యం వంటి వాటిపై ప్రత్యామ్నాయ మార్గాల్లో కృషి సాగించాలి. ఈ కృషి అడపాదడపా కాకుండా నిత్య కార్యాచరణలో భాగమవ్వాలి.

# మానికొండ సుబ్బారావు

ప్రధాన పాత్ర నిర్వహించారు. పార్టీపైన వ్యతిరేకత ఉన్న ఆ రోజుల్లోనయితం పార్టీ కొత్త ప్రాంతాలకూ, కొత్త వర్గాలకూ విస్తరించింది. పార్టీలో పనిచేసే తీరుతెన్నులూ, సభ్యత్వం పెరుగుదలా, పార్టీ పత్రికల అనన్య ప్రచారమూ, ప్రజాసంఘాల సభ్యత్వమూ, విరాళాల సేకరణా, రాశిలోనూ, వాసిలోనూ పార్టీ గణనీయమైన అభివృద్ధి సాధించింది.

1945–46 నాటికే మానికొండ కుటుంబం ఆదర్శ విప్లవ కుటుంబం అనే ఖ్యాతి గాంచింది. మానికొండ కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేయడంతోనే ఆగిపోకుండా.. తన తల్లి బుల్లెమ్మ గారిని విప్లవమాతగా తీర్చిదిద్దారు. భార్య సూర్యావతినీ విప్లవ నారిగా తయారు చేశారు. సాధారణంగా తల్లులు తమ బిడ్డలు పెద్ద ఉద్యోగాలు సంపాదించి ఆర్జనాపరులై ప్రయోజకులు కావాలని ఆశిస్తారు. కానీ బుల్లెమ్మగారు తన ఒక్కగానొక్క కుమారుడు కష్టభూయిష్టమైన కమ్యూనిస్టు కార్యకర్త జీవితాన్ని ఎంచుకున్నందుకు చింతించలేదు. గోర్కీ నవల 'అమ్మ'లోని 'నిలోవ్నా'ను ఆమె తలపింపచేసింది. పార్టీ రహస్య జీవితంలో మానికొండ ఇంటికెందరెందరో వచ్చి పోతుండేవారు. బుల్లెమ్మగారు వారినందరినీ తన బిడ్డల్లాగా ఆదరించింది. తరువాత 1945 నుంచి ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ, ప్రజాశక్తి కార్యాలయాల్లో ఆమె 'కమ్యూన్' నిర్వహించారు. పార్టీ సభ్యులూ, కార్యకర్తలూ తమ ఆస్తిపాస్తులను సమర్పించాలని పిలుపు ఇచ్చినప్పుడు మానికొండ దంపతులు తమ యావదాస్తినీ పార్టీకి సమర్పించారు. తన కొడుకూ కోడలూ వాళ్ల వంతు ఆస్తిని పార్టీ కోసం త్యాగం చేసినప్పుడు.. బుల్లెమ్మగారు హృదయపూర్వకంగా వారిని ఆశీర్వదించింది. పైపెచ్చు తన డబ్బు నుంచి వెయ్యిన్నూట పదహార్లు పార్టీకి సమర్పించింది. 1948లో ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభ జరుపుకోవడాన్ని ప్రభుత్వం నిషేధించిన సందర్భంగా విజయవాడలో జరిగిన నిరసన ప్రదర్శనలో బుల్లెమ్మ గారు జెండా పుచ్చుకొని అగ్రభాగాన నడిచారు. ఊరేగింపును చెదరగొట్టడానికి పోలీసులు ప్రయోగించిన బాష్పవాయువుకు శరీరం కాలి ఆమె స్పృహ తప్పి పడిపోయింది.

మానికొండ సాధారణ స్థానాల్లో ఉంటూ కూడా తన భార్య సూర్యావతి పైస్థానాలకు వెళ్లడానికి తగిన ప్రోత్సాహాన్నిచ్చారు. ప్రాథమిక పాఠశాల చదువుకే పరిమితమైన ఆమెను ఆయన తన కృషి ద్వారా విద్యా విజ్ఞానమూ, చైతన్య వికాసమూ కల్పించి ఆమె ఆంధ్రప్రదేశ్ మహిళా ఉద్యమానికే నాయకత్వం వహించే స్థాయికి తీసుకురాగలిగారు. ఎంతో ఆదర్శమైన కమ్యూనిస్టు మహిళగా ఆమెను తీర్చిదిద్దారు. అలా ఆమె సర్పంచ్‌గానూ, ఎంపిపిగానూ, శాసన మండలి సభ్యురాలుగానూ పనిచేశారు. ఈ దంపతుల గురించి ఆనాటి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పిసి జోషి మానికొండను ప్రజాస్వామిక భర్త అనీ, ఆదర్శ కమ్యూనిస్టు రివల్యూషనరీ భర్త అనీ అభివర్ణించారు. ఉద్యమపథంలో సూర్యావతిని రాయవెల్లూరు జైలులో ఏడాదిపాటు నిర్బంధించారు. ఇంచుమించు అదే సమయంలో మానికొండను కూడా అరెస్టు చేసి జైలులో పెట్టారు. జైలులో ఉన్న రెండున్నరేళ్లు ఆయన ఆదర్శనీయమైన జీవితం గడిపారు. అక్కడ అధ్యయనమూ, అధ్యాపనమూ నిర్వహించారు. ఎక్కువ సమయాన్ని అధ్యయనానికి ఉపయోగించి తన రాజకీయ సైద్ధాంతిక పునాదిని గట్టిపరుచుకున్నారు. జైల్లో ఉన్న సాధారణ కార్యకర్తలకు రాజకీయ తరగతులు నిర్వహించారు. ఆరు నెలలు తరువాత ఆయనను జామీనుపై విడుదల చేయగా, పార్టీ కార్యక్రమాలు కొనసాగించడానికి రహస్య జీవితం గడిపారు. 1955లో పార్టీ ఆర్థిక సంక్షోభంలో పడినప్పుడు బుల్లెమ్మగారు మానికొండ దంపతులను ఆదుకొని తన దగ్గర మిగిలి ఉన్న కొద్దిపాటి డబ్బుతో సంసారాన్ని నడుపు కొచ్చింది.

1955లో జరిగిన శాసనసభ మధ్యంతర ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ఓటమి పాలయింది. దీంతో పార్టీ రాజకీయంగానూ, ఆర్థికంగానూ గట్టి దెబ్బతింది. పార్టీ అప్పులు తీర్చడం మాట అలా ఉంచి కార్యకర్తలను పోషించడమే కష్టమైపోయింది. మరోవైపు ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ విజయగర్వంతో పార్టీ కార్యకర్తలపైనా, ఓటు వేసిన ప్రజలపైనా దౌర్జన్యకాండ ప్రారంభించింది. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీకి.. తన శిబిరాన్ని నిలబెట్టుకోవడమూ, ఆర్థిక స్థితి నుంచి బయటపడి పార్టీ నిర్మాణాన్ని కాపాడుకోవడమూ ప్రధాన కర్తవ్యాలయ్యాయి. మానికొండ ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ధైర్యంగానూ, చైతన్యంతోనూ ప్రజలపై సంపూర్ణ విశ్వాసంగల విప్లవకారుడిగా నిలబడ్డారు. కానీ రాష్ట్ర, జిల్లా కమిటీల్లో ఓటమితత్వపు ప్రాబల్యం పైచేయి అయింది. పార్టీ కోసం సర్వస్వం అంకితం చేసిన 'ప్రొఫెషనల్ రివల్యూషనరీ'లను పెద్ద సంఖ్యలో పార్టీ నుంచి (నిర్మాణ రంగంలో) తప్పించి ఎవరికివారు తమ బతుకుదెరువు చూసుకోవాలనే ధోరణి మెజారిటీ అయింది. జిల్లా కార్యదర్శిగా ఉన్న మానికొండ ఈ ధోరణిని ప్రతిఘటించారు. చివరికి ఆ ధోరణే నెగ్గి పార్టీ నిర్ణయం జరిగాక ఆయన సుశిక్షిత సైనికుడివలె తాను పార్టీ పూర్తికాలం కార్యకర్తగా తప్పుకున్నారు. మానికొండ వంటి కమ్యూనిస్టు విప్లవ కారుడు జీవనోపాధిని వెతుక్కుంటూ ఎక్కడుం దగలరు? ఆయన తల్లి బుల్లెమ్మగారు తన దగ్గరున్న కొద్దిపాటి సాధన సంపత్తితో ఆ దంప తులకు ధైర్యానిస్తూ అండగా నిలబడ్డారు. పార్టీని బలపరిచే ఎందరో పెద్దలు చాలా బాధపడ్డారు. వారాయనను కలుసుకొని పార్టీ పనిని మానుకోవాల్సిన అవసరం లేదనీ, తాము ఆర్థిక తోడ్పాటును అందిస్తామనీ ఆయనను ప్రోత్సహించారు. కానీ మానికొండ వ్యక్తిగత సహాయాన్ని నిరాకరిస్తూ.. వారు ఆర్థిక సాయం చేద్దామనుకున్న మొత్తాన్ని పార్టీకి జమ చేస్తే, పార్టీయే సముచిత నిర్ణయం తీసుకోగలదని నచ్చజెప్పారు. ఆయన ఎంతో కష్టదశలో ఉన్నా ఉన్నత కమ్యూనిస్టు నైతిక ప్రమాణాలను వీడలేదు. తన అవసరాలను కుదించుకొని, భార్య తోడురాగా వారిరువురూ మానవులుగా బతకడానికి అవసరమైన కనీస అన్న వస్త్రాలు మించి వాడుకోలేదు. ఒకే ఒక జత చొక్కా, ధోవతితో ఆయన గడిపేవారు. ప్రజల వద్ద నుంచి వసూలు చేసిన నిధుల నుంచి ముందు పార్టీ కార్యకర్తల అవసరాలు గడిపేవారు.

1964లో కమ్యూనిస్టు పార్టీలో చీలిక అనివార్యమైంది. దీనికి ముందు జరిగిన రాజకీయ సిద్ధాంత నిర్మాణ పోరాటంలో మార్క్సిస్టులుగా మానికొండ దంపతులు రివిజనిజాన్ని ప్రతిఘటించి నిలిచారు. కృష్ణాజిల్లా కమిటీ కార్యదర్శిగా మానికొండ పార్టీ పునర్నిర్మాణ బాధ్యతలను చేపట్టారు. 1964 డిసెంబర్ 29 రాత్రి అనేకమంది నాయకులతోపాటు మానికొండ దంపతులను అరెస్టు చేసి ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ జైలులో డిటెన్యూలుగా ఉంచింది. జైల్లో మానికొండ ప్రపంచ కమ్యూ నిస్టు ఉద్యమ చరిత్ర రాశారు. జైల్లో ఓసారి ఆయనకు గుండె జబ్బు కూడా వచ్చింది. జైలు నుంచి బయటకు వచ్చింది మొదలు కృష్ణాజిల్లా పార్టీ పునర్నిర్మాణంపైన కేంద్రీకరించారు. 1964 నుంచి ఆయన జిల్లా కార్యదర్శిగానూ, రాష్ట్ర కమిటీ సభ్యులుగానూ, 1968 నుంచి 1975లో ఆయన చనిపోయే వరకూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగానూ పనిచేశారు. 1975 జనవరి 27వ తేదీన కృష్ణా జిల్లా కాటూరులో పార్టీ నిధి వసూళ్ల కార్యక్రమంలో ఉండగా ఆయన మరోమారు గుండెపోటుకు గురయ్యారు. ఆ మరునాడు ఆయన హృదయం ఆగిపోయింది. వాణి మూగబోయింది. సొంత లాభం సొంతం మానుకొని ప్రజలకోసం అహర్నిశలూ పనిచేసిన ఆదర్శమూర్తి మానికొండ.

RNI Reg. No. APTEL/2006/17554 Postal Regd. No L1/SD/407/13-15

# కార్మికవర్గ విముక్తితోనే అవినీతి నుండి విముక్తి



– లీషావ్ చీ

కార్మికవర్గ విప్లవం అంటే అన్నిరకాల దోపిడీలనూ, అణచివేతలనూ, వర్గాలనూ తొలగించే విప్లవం. తాను స్వయంగా దోపిడీకి గురికావటమేగాని, ఇతరులను దోపిడీ చేయని కార్మికవర్గానికి కమ్యూనిస్టు పార్టీ ప్రాతినిధ్యం వహిస్తుంది. కనుకనే కమ్యూనిస్టుపార్టీ విప్లవాన్ని తుదికంటా తీసుకువెళ్ళి అన్నిరకాల దోపిడీలను అంతం చేసి, మానవ సమాజంలో పేరుకున్న అవినీతినీ, కుళ్లునూ ఊడ్చిపారవేస్తుంది. నూటికి నూరుపాళ్లూ నిర్మాణయుతమైన, క్రమశిక్షణగలిగిన పార్టీని నిర్మించడానికీ, కేంద్రీకృత ప్రజాతంత్ర రాజ్యయంత్రాన్ని నెలకొల్పటానికీ అవసరమైన శక్తి కార్మికవర్గానికి వున్నది. రాజ్యాధికారాన్ని వినియోగించి అవినీతికీ, కుళ్ళుకూ వ్యతిరేకంగా సాగే అవిశ్రాంత పోరాటంలో ప్రజలకు నాయకత్వం వహించగల శక్తి దానికున్నది. అంతేగాక అవినీతిలో కూరుకుపోయి దిగజారిన వాళ్ళను పార్టీ నుండి, రాజ్య యంత్రాన్నుండి (వాళ్ళెంతటి హోదాలో వున్నప్పటికీ) ఏరిపారవేసి వాటి స్వచ్ఛతను కాపాడుతుంది. కార్మికవర్గ విప్లవంలోనూ, కార్మికవర్గ విప్లవ పార్టీలోనూ ఉన్న ఈ విశిష్టత తొలినాటి విప్లవాలలోనూ, విప్లవ పార్టీలలోనూ వుండేది కాదు. ఉండే వీలు కూడా లేదు. మన పార్టీ సభ్యులు ఈ విషయంలో చాలా స్పష్టమైన అవగాహనతో వుండాలి. ముఖ్యంగా విప్లవం విజయం పొందినప్పటికీ, అలాగే మున్నెన్నడూ ఎరుగని బ్రహ్మాండమైన ప్రజల మద్దతును, విశ్వాసాన్ని పొందినప్పుడు కార్మికవర్గ సిద్ధాంతానికి సంబంధించి మరింత అప్రమత్తంగా వుంటూ స్వయం సాధనను మరింత పెంచుకోవాలి. కార్మికవర్గ విప్లవ స్వభావాన్ని ఎల్లప్పుడూ సంరక్షించాలి.

**(ఈ వాక్యాలు 'లీషావ్‌చీ'రచించిన 'మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి' గ్రంథం నుండి గ్రహించబడ్డాయి.)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.9. Published on January 1, 2015